అభయహస్తం కాదు.. కబంధ హస్తం!

మొదటిపేజీ తరువాయి...

రుణాలు తీసుకోవాలంటే సంక్షేమ రంగాన్ని పణంగా పెట్టాల్సి వస్తుందని స్పష్టం చేస్తున్నారు. ఆదాయ, వ్యయాలపై ప్రపంచ బ్యాంకు గుత్తాధిపత్యం చెలాయిస్తుందని, వచ్చే ఆదాయాన్ని ఎలా ఖర్చు పెట్టాలో, దేనికి ఖర్చు పెట్టకూడదో ఆంక్షలు విధిస్తుందని చెప్తున్నారు. రాష్ట్ర ప్రజలు పన్నుల రూపంలో చెల్లిస్తున్న డబ్బును ఎలా ఖర్చు చేయాలో నిర్దేశిస్తుందని అంటున్నారు. ఒక్క ముక్కలో చెప్పాలంటే తెలంగాణ 'ఆర్థిక' సార్వభౌమాధికారాన్ని ప్రపంచబ్యాంకుకు తాకట్టు పెట్టడమేనని హెచ్చరిస్తున్నారు.

20 ఏండ్ల తర్వాత..

తెలంగాణలో దాదాపు 20 ఏండ్ల తర్వాత 'ప్రపంచబ్యాంకు' అనే పేరు మళ్లీ వినిపిస్తున్నదని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు హయాంలో ప్రపంచబ్యాంకు బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ఓ దశలో ప్రపంచ బ్యాంకు అనేది ఊతపదంగా మారింది. చంద్రబాబు ప్రభుత్వం విచ్చలవిడిగా ప్రపంచబ్యాంకు నుంచి రుణాలు తీసుకున్నది. తిరిగి వాటిని చెల్లించేందుకు ప్రజలపై పన్నుల భారం వేసి ముక్కుపిండి వసూలు చేసిందని నిపుణులు చెప్తున్నారు. ఈ క్రమంలోనే కరెంటు చార్జీలు పెంచేందుకు ప్రయత్నిస్తే.. బషీర్‌బాగ్‌లో కాల్పుల వరకు వెళ్లిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు. ఆ తర్వాత వైఎస్సార్ సీఎం అయిన తర్వాత ప్రపంచబ్యాంకుతో కలుగుతున్న నష్టాలను గుర్తించి, తెగతెంపులు చేసుకున్నారు. ఆ తర్వాత ముఖ్యమంత్రులు కూడా ఈ విధానాన్ని కొనసాగించారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రపంచబ్యాంకును ఆమడ దూరంలో ఉంచింది. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు శిష్యుడు/సహచరుడిగా చెప్పుకుంటున్న రేవంత్‌రెడ్డి మళ్లీ ప్రపంచబ్యాంకును తెరమీదికి తెచ్చారని నిపుణులు అంటున్నారు.

సంక్షేమ పథకాలకు ఇకపై కోతలే..

కాంగ్రెస్ ప్రభుత్వం అభయ హస్తం పేరుతో ఆరు గ్యారెంటీలు, 400కు పైగా హామీలు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఐదు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని చెప్తున్నది. మిగతావాటిని కూడా కచ్చితంగా అమలు చేస్తామంటూనే.. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నదని, కిస్తీలు కట్టడానికి కూడా అప్పులు చేయాల్సి వస్తున్నదని ప్రచారం చేసుకుంటున్నారు. ఇలాంటి సమయంలో ప్రపంచబ్యాంకు నుంచి రుణాలు తీసుకోవడం అంటే.. సంక్షేమ పథకాలకు కోత పెట్టాల్సిందేనన్నది నిపుణుల మాట. ఓవైపు డబ్బులు లేవని బీద అరుపులు అరుస్తూ, మరోవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తామంటే ప్రపంచబ్యాంకు ఒక్క రూపాయి కూడా ఇవ్వదని స్పష్టం చేస్తున్నారు. కాబట్టి పథకాల్లో కోతలు విధిస్తేనే రుణాలు దక్కుతాయని చెప్తున్నారు. రాష్ట్రంలో మూసీ రివర్ ఫ్రంట్, స్కిల్స్ యూనివర్సిటీ, హైదరాబాద్ 4.0, వైద్యారోగ్య రంగానికి సాయం చేసేందుకు ప్రపంచబ్యాంకు ముందుకు వచ్చిందని ప్రభుత్వం చెప్తున్నది. మొదటి మూడు ప్రాజెక్టులు ప్రపంచబ్యాంకు నిబంధనలకు తగ్గట్టే పీపీపీ పద్ధతిలో చేపట్టనున్నట్టు ఇప్పటికే స్పష్టత వచ్చిందంటున్నారు. ఆరోగ్య రంగంలో పెట్టుబడులు ఎలా సాధ్యమని ప్రశ్నిస్తున్నారు. అంటే.. సమీప భవిష్యత్తులో ప్రజలకు ఉచితంగా వైద్యం అందదా? అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచ బ్యాంకు నిబంధనల ప్రకారం ఆదాయం చూపించాలని, ప్రజారోగ్యంలో ఆదాయం ఎలా చూపిస్తారని అడుగుతున్నారు. ఈ లెక్కన మళ్లీ యూజర్ చార్జీలు తెరమీదికి తెస్తారని అనుమానిస్తున్నారు. ఓవైపు అభయహస్తం అంటూనే.. మరోవైపు ప్రపంచబ్యాంకు రుణం కోసం పాకులాడుతూ రాష్ట్రాన్ని కబంధ హస్తాల్లోకి నెడుతున్నారని మండిపడుతున్నారు.

అప్పు.. వడ్డీ.. వసూలు

ప్రపంచబ్యాంకు రుణాలు అంటేనే కఠినమైన నిబంధనలు ఉంటాయని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. ప్రైవేటీకరణ దాని ప్రధాన లక్ష్యమని, ప్రపంచబ్యాంకు నుంచి తీసుకునే రుణాలతో చేపట్టే ప్రాజెక్టులన్నీ పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) పద్ధతిలో ఉండాల్సిందేనని అంటున్నారు. ఇక సంక్షేమ పథకాలకు ప్రపంచబ్యాంకు బద్ధ వ్యతిరేకి అని స్పష్టంచేస్తున్నారు. ప్రభుత్వాలు పేదలకోసం ఉచిత పథకాలు అమలు చేయొద్దని, ప్రతిదానికీ ముక్కుపిండి మరీ డబ్బులు వసూలు చేయాలన్నది దాని సిద్ధాంతమని పేర్కొంటున్నారు. రుణం ఇచ్చేముందు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని, ఆదాయ వ్యయాలను ప్రపంచబ్యాంకు క్షుణ్ణంగా పరిశీలిస్తుంది. తీసుకునే అప్పును ఎలా ఖర్చుచేస్తారు? దాని నుంచి ఆదాయం ఎలా వస్తుంది? అప్పు, వడ్డీ కలిపి ఎలా చెల్లిస్తారు? అనే అంశాలను బేరీజు వేస్తుందని చెప్తున్నారు.

ఏటా రాష్ట్రాల ఆర్థిక స్థితిగతులను బేరీజు వేస్తూ వ్యయ నియంత్రణకు ఆదేశాలు ఇస్తుందని తెలిపారు. ఒకవేళ రాష్ట్ర ఆదాయం తక్కువగా ఉండి, ఖర్చు ఎక్కువగా ఉంటే.. నిధుల విడుదలకు షరతులు విధిస్తుందని పేర్కొన్నారు. ఫలానా సంక్షేమ పథకంలో కోతలు విధించాలనో, లేదా లబ్ధిదారుల సంఖ్యను తగ్గించాలనో, లేదా పథకాన్ని పూర్తిగా ఎత్తివేయాలనో ఆదేశిస్తుందని చెప్తున్నారు. అమలు చేయకపోతే నిధుల విడుదలను ఆపడమే కాదు.. తీసుకున్న మొత్తం అప్పును కట్టాలంటూ పీకల మీద కూర్చుంటుందని హెచ్చరిస్తున్నారు. దీంతో వాటిని తీర్చడానికి మళ్లీ కొత్త అప్పులు చేయాల్సి వస్తుందని చెప్తున్నారు. ప్రపంచబ్యాంకు నుంచి రుణాలు తీసుకోవడం అంటే అప్పుల ఊబిలో కూరుకుపోవడమే అని హెచ్చరిస్తున్నారు. ఇక బ్యాంకు నిధులను ప్రజాసేవకో, ఉచిత పథకానికో అమలు చేస్తామంటే ఒక్క రూపాయి కూడా విదిల్చదని స్పష్టం చేస్తున్నారు.

ప్రపంచవ్యాప్తంగా నిరసనలు..

ప్రపంచబ్యాంకు విధానాలపై ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. దశాబ్దాలుగా ప్రజా పోరాటాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్‌కు వ్యతిరేకంగా అనేక ఆఫ్రికా దేశాల్లో ప్రజలు రోడ్ల మీదికి వచ్చి నిరసనలు తెలుపుతున్నారు. నైజీరియాలో ఇటీవల 2.25 బిలియన్ డాలర్ల ప్రపంచ బ్యాంకు రుణం కోసం, ఆ దేశ అధ్యక్షుడు బోలా తినుబు పెట్రోల్ సబ్సిడీలను, విద్యుత్తు సబ్సిడీలను తగ్గించారు. చలామణిలో ఉన్న కరెన్సీ నోట్ల సంఖ్యను తగ్గించాలని నిర్ణయించడంతో దేశవ్యాప్తంగా కార్మిక సం ఘాలు సమ్మె మొదలుపెట్టాయి. ప్రజలు రోడ్ల మీదికి వచ్చి 'నైజీరియాను స్వేచ్ఛగా వదిలేయండి' అంటూ నినాదాలు చేశారు. కెన్యాలోనూ ఇదే పరిస్థితి. 'ఐఎంఎఫ్, వరల్డ్ బ్యాంక్.. కెన్యాను మీ కబంధ హస్తాల నుంచి విడిచిపెట్టండి' అంటూ ప్రజలు రాజధాని నైరోబీలో ఉద్యమాలు చేస్తున్నారు. ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్ విధానాల వల్ల ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలుతున్నాయని, పర్యావరణానికి నష్టం కలుగుతున్నదని, వాతావరణ మార్పులతో విపత్తులు తలెత్తుతున్నాయని అమెరికాలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తున్నారు.

తక్కువ వడ్డీతో అప్పులు తెస్తం

- ప్రపంచ బ్యాంకు నుంచి నిధులు
- వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం
- పంటల బీమా చెల్లిస్తున్నం
- రైతు కూలీలకు 12 వేలు ఈ ఏడాది నుంచే
- పంద్రాగస్టు సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- గోల్కొండ కోటలో జాతీయ పతాకావిష్కరణ
- మాటల్లో తడబాటు.. విస్తుపోయిన ప్రజలు



హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రాభివృద్ధికి అవసరమైన నిధులను ప్రపంచబ్యాంకు నుంచి సమకూర్చుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇటీవల అమెరికా పర్యటనలో ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడితో సమావేశమయ్యామని తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి అవసరమైన నిధులను తక్కువ వడ్డీతో సమకూర్చుకుంటున్నట్టు చెప్పారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం గోల్కొండ కోటపై జాతీయ జెండాను ముఖ్యమంత్రి ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. వివిధ శాఖల్లో విశిష్ట సేవలందించిన పలువురు అధికారులకు పురస్కారాలు అందజేశారు. అంతకుముందు సీఎం తన ఇంటి వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. అక్కడి నుంచి పరేడ్ గ్రౌండ్ చేరుకుని అమర జవాన్లకు నివాళులర్పించారు. అక్కడి నుంచి నేరుగా గోల్కొండ కోటకు చేరుకుని జెండా ఆవిష్కరించి ప్రసంగించారు. పార్టీ మ్యానిఫెస్టోలో ప్రకటించినట్టుగా ఈ ఏడాది నుంచే రాష్ట్రంలోని రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేల చొప్పున అందజేస్తామని తెలిపారు. రైతు భరోసా పథకం కింద ఎకరానికి రూ.15 వేల చొప్పున పెట్టుబడి సాయం త్వరలోనే అందిస్తామని చెప్పారు. పంటలబీమా పథకం వర్తింపచేయడానికి ఈ ఏడాది నుంచి ఫసల్ బీమా యోజనలో చేరాలని నిర్ణయించినట్టు తెలిపారు. రైతుల తరపున బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందని అన్నారు.

తప్పు జరిగితే సరిదిద్దుకుంటాం

పరిపాలనలో లోటుపాట్లు ఉంటే సలహాలు, సూచనలు స్వీకరించే సౌలభ్యం కల్పించినట్టు రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇంతటి వ్యవస్థలో లోటుపాట్లు ఉండొచ్చని, తమ నిర్ణయాల్లో తప్పు జరిగితే సరిదిద్దుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి ప్రత్యేక గుర్తింపు సంఖ్యగల డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డు జారీ చేసే విధానాన్ని త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. రూ.500కే వంట గ్యాస్ పథకం వల్ల 43 లక్షలమంది, గృహజ్యోతి పథకం వల్ల 47.13లక్షల మంది లబ్ధిపొందుతున్నట్టు పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇండ్ల చొప్పున 4.5లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం

వ్యవసాయరంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రూ.31 వేల కోట్లు వెచ్చించి రైతును రుణ విముక్తుడిని చేస్తున్నట్టు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల కోసం ప్రతి నియోజకవర్గంలో ఒకే ఆవరణలో 25 ఎకరాల స్థలంలో ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్లను నిర్మించబోతున్నట్టు చెప్పారు. విదేశీ పర్యటనకు వెళ్లి ఫ్యూచర్ స్టేట్‌గా తెలంగాణను వారికి పరిచయం చేశామని, 40వేల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదుర్చుకున్నామన్నారు.

ప్రసంగంలో తడబాటు

గోల్కొండ కోటలో సీఎం హోదాలో తొలిసారి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన రేవంత్‌రెడ్డి పలుమార్లు తన ప్రసంగంలో తడబడ్డారు. దాదాపు 30నిమిషాలపాటు ప్రసంగించిన ఆయన కొన్ని పదాలను సరిగ్గా పలుకలేకపోయారు. 20కిపైగా పదాలను పలకడంలో తప్పులు దొ ర్లాయి. మరికొన్ని పదాలను చదువుతూ తడబడి ఆ తర్వాత సరిదిద్దుకున్నారు. కొన్నిచోట్ల అంకెలను తప్పుగా చెప్పారు.

తెలంగాణలో భాక్రానంగల్ ప్రాజెక్టు

'మన రాష్ట్రంలో నాగార్జునసాగర్, శ్రీశైలం, భాక్రానంగల్, శ్రీరామ్‌సాగర్ లాంటి ప్రాజెక్టులను నెహ్రూ ప్రారంభిస్తే తర్వాత వాటిని పూర్తిచేసి కోట్లాది మంది రైతుల పొలాలకు సాగు జలాలు పారించిన గొప్ప చరిత్ర ఇందిరాగాంధీకి దక్కుతుంది' అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నా రు. అయితే హిమాచల్‌ప్రదేశ్‌లోని బిలాస్‌పూర్ జిల్లాలోని భాక్రా గ్రామంలో సట్లెజ్ నదిపై భాక్రానంగల్ డ్యామ్ నిర్మించారు. వర్షపు నీటి నిల్వతోపాటు హర్యానా, రాజస్థాన్, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలకు సాగునీరు అందిస్తుంది. ఉత్తర భారతంలో ఇది చాలా పెద్ద ప్రాజెక్టు. ఇది రాష్ట్రంలోనే ఉన్నట్టు చెప్పడంతో సోషల్ మీడియాలో ట్రోల్స్ మొదలయ్యాయి.

సీఎం ప్రసంగిస్తుండగానే బయటకు..

గోల్కొండ కోటలో జాతీయ పతాకం ఆవిష్కరణ అనంతరం రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తుండగానే పలువురు లేచి బయటకు వెళ్లేందుకు యత్నించారు. అక్కడే ఉన్న పోలీసులు దారికి అడ్డంగా కుర్చీలు పెట్టి వెళ్లి కూర్చోవాలని సూచించారు. వేడుకలను ప్రజలు వీక్షించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్యాలరీల నుంచి కూడా ప్రజలు లేచి బయటకు వెళ్లేందుకు ప్రయత్నించారు.

మైనార్టీలోనూ పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లు

- త్వరలో నాంపల్లి, బజార్‌ఘాట్‌లో ఏర్పాటు
- ఒక్కో హాస్టల్‌లో 100 మంది విద్యార్థులకు వసతి
- రాజేంద్రనగర్ సీవోఈలో స్మార్ట్‌క్లాసులు



హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ) : బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమహాస్టళ్ల తరహాలోనే మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలోనూ పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలు త్వరలోనే అందుబాటులోకి రానున్నట్టు ఆ శాఖ ఉన్నతాధికారులు వెల్లడించారు. అన్ని సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో బాల, బాలికలకు వేర్వేరుగా ప్రీ, పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాలు అందుబాటులో ఉండగా, మైనార్టీ సంక్షేమశాఖలో ఇప్పటివరకు లేవు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మైనార్టీ విద్యార్థుల కోసం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 204 గురుకులాలు ఏర్పాటు చేయగా, అవన్నీ ఏడాది కిందటే గురుకుల కాలేజీలుగా మారాయి. అయితే, ఇంటర్ అనంతరం డిగ్రీ, ఇతర కోర్సులు చదివే విద్యార్థులకు హాస్టళ్లు అందుబాటులో లేకపోవడంతో బాలురు, బాలికలకు వేర్వేరుగా పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లు ఏర్పాటుచేసి ఒక్కో హాస్టల్‌లో 100 మందికి వసతి కల్పించాలని నిర్ణయించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని బజార్‌ఘాట్, నాంపల్లిలో భవనాలు నిర్మించారు. పనులన్నీ దాదాపు తుది దశకు చేరుకున్నాయి. ఈ ఏడాది నుంచే వీటిని అందుబాటులోకి తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు మైనార్టీ సంక్షేమశాఖ అధికారులు వెల్లడించారు. రాజేంద్రనగర్‌లోని మైనార్టీ సీవోఈలో నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్మార్ట్ క్లాసులు నిర్వహించనున్నారు.

స్కిల్స్ యూనివర్సిటీ చైర్మన్‌గా ఆనంద్ మహీంద్ర



హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్మన్‌గా మహీంద్ర గ్రూపు సంస్థల చైర్మన్ ఆనంద్ మహీంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఏడాదిపాటు పదవిలో కొనసాగనున్నారు. రేవంత్‌రెడ్డి ఇటీవలే ఆనంద్ మహీంద్రతో సమావేశమై స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు, లక్ష్యాలను వివరించి చైర్మన్‌గా కొనసాగాలని కోరిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో దీన్నిఏర్పాటు చేస్తున్నారు.

మహిళా రైతుపై పోలీసుల దౌర్జన్యం



ఖమ్మం జిల్లా వైరాలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి సభ జరిగింది. ఈ సందర్భంగా తమ పోడు భూముల సమస్యను ముఖ్యమంత్రికి వివరించేందుకు ప్రయత్నిస్తున్న మహిళా రైతును అడ్డుకుంటున్న పోలీసులు

కుర్చీలు అడ్డుపెట్టి మహిళల అడ్డగింత



గోల్కొండ కోట వద్ద వేడుకల సందర్భంగా ముఖ్యమంత్రి ప్రసంగిస్తుండగా కొంతమంది మహిళలు అక్కడి నుంచి వెళ్లిపోయేందుకు ప్రయత్నించారు. వారిని పోలీసులు, సిబ్బంది కుర్చీలు అడ్డుపెట్టి అడ్డుకున్నారు.

అంబులెన్స్‌కు దారి ఇవ్వక కాలినడకన బాలింత



గోల్కొండ వద్ద స్వాతంత్ర్య వేడుకలకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకావడంతో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి అంబులెన్స్‌ను అడ్డుకున్నారు. అందులో ఉన్న బాలింత నడుచుకుంటూ ఏరియా దవాఖానకు వెళ్లారు.

కేటీఆర్ వ్యాఖ్యలపై మహిళా కమిషన్ విచారణ

హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ) : 'మహాలక్ష్మి' పేరిట ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి సంబంధించి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై విచారణ చేపట్టనున్నట్టు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె ట్వీట్ చేశారు. కేటీఆర్ వ్యాఖ్యలు మహిళలను అవమానించేలా ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ సుమోటోగా స్వీకరించి విచారణ ప్రారంభించినట్టు వెల్లడించారు.

మహిళా కమిషన్ తీరు హాస్యాస్పదం

బీఆర్‌ఎస్ నేత రజితారెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మహిళా కమిషన్ తీరు హాస్యాస్పదంగా ఉన్నదని బీఆర్‌ఎస్ నేత రజితారెడ్డి విమర్శించారు. బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలను సుమోటాగా స్వీకరిస్తున్నామని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద ఎక్స్‌వేదికగా పేర్కొనటాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక పదుల సంఖ్యలో మహిళలపై అత్యాచారాలు జరిగినప్పుడు, పోలీస్‌స్టేషన్‌లో ఒక దళిత మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించినపుడు, బాలికల వసతి గృహాల్లో పరిణామాలపై ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. మహిళా ఎమ్మెల్యేలపై సీఎం, డిప్యూటీ సీఎం అనుచిత వ్యాఖ్యలు చేసినప్పుడు స్పందించని కమిషన్ కేటీఆర్‌కు నోటీసులు పంపటం ఏమిటో అర్థం కావడంలేదని అన్నారు.

బ్యాక్‌లాగ్‌లన్నీ జాబ్ క్యాలెండర్‌లోకే..!

- గురుకుల పోస్టుల్లో డౌన్‌మెరిట్ లేనట్టే
- ప్రాథమిక అంచనాలో 1700 నాన్‌జాయినింగ్స్
- డీఎస్సీ, జేఎల్ రిక్రూట్‌మెంట్ పూర్తయితే సగం ఖాళీ
- అన్నింటినీ వచ్చే జాబ్ క్యాలెండర్‌లోనే నింపేలా కసరత్తు

హైదరాబాద్, ఆగస్టు15 (నమస్తే తెలంగాణ): గురుకుల బ్యాక్‌లాగ్ పోస్టులన్నింటినీ తదుపరి జాబ్ క్యాలెండర్‌లోనే నింపేందుకు ప్రభుత్వం యోచిస్తున్నది. ఆ దిశగానే తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ రిక్రూట్‌మెంట్ బోర్డు(ట్రిబ్) ముమ్మర కసరత్తు చేస్తున్నది. డౌన్‌మెరిట్ కోసం ఎదురుచూస్తున్న 1:2 అభ్యర్థుల ఆశలపై నీళ్లు చల్లింది. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యుత్సాహం, రాజకీయ స్వార్థం వల్లనే వేలాది పోస్టులు మిగిలిపోయే దుస్థితి ఏర్పడిందని, దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని అభ్యర్థులు మండిపడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ గురుకులాల్లో డీఎల్, జేఎల్, పీజీటీ, టీజీటీ, ఫిజికల్ డైరెక్టర్, స్కూల్ లైబ్రేరియన్, స్కూల్ పీడీ, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్ తదితర 9,210 పోస్టుల భర్తీకి ట్రిబ్ గతేడాది ఆగస్టులోనే రాత పరీక్ష నిర్వహించింది. కోర్టు కేసులు, అర్హులు లేని పోస్టులను మినహాయించి 8,304 పోస్టులకు తుది జాబితా ప్రకటించగా, ఆయా సొసైటీలు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించి అభ్యర్థులకు పోస్టింగ్స్ సైతం ఇచ్చాయి. నెల గడుస్తున్నా పోస్టింగ్ ఆర్డర్ అందుకున్న వారిలో 1,700 మంది అభ్యర్థులు ఇప్పటికీ జాయిన్ కాలేదని తెలుస్తున్నది. ఇప్పటికే 2,104 పోస్టులు మిగిలిపోయాయి.

ట్రిబ్ పోస్టులు సగానికిపైగా బ్యాక్‌లాగ్

గురుకుల పోస్టులకు ఎంపికైన అభ్యర్థులే చాలా మంది టీజీపీఎస్సీ నిర్వహించిన జేఎల్ పోస్టులను సాధించారు. ప్రస్తుతం సర్టిఫికెట్ వెరిఫికేషన్ కొనసాగుతున్నది. గురుకులాల్లో పోస్టింగ్ ఆర్డర్స్‌ను తీసుకున్న అభ్యర్థులు టీజీపీఎస్సీ రిజల్ట్ కోసమే ఎదురుచూస్తూ జాయిన్ కాకుండా ఉన్నారని తెలుస్తుంది. దీంతో గురుకుల పోస్టుల్లో చాలా మేరకు ఖాళీ అయ్యే అవకాశం ఉన్నది. మరోవైపు 11,062 డీఎస్సీ పోస్టులను ప్రకటించడంతో ఆ పరీక్షకు సైతం గురుకుల పోస్టులకు ఎంపికైన వారే పోటీపడ్డారు.

ట్రిబ్ చేపట్టిన నియామకాలు

పోస్టు	నోటిఫైడ్	నింపినవి	నింపనవి
డిగ్రీ గురుకులాల్లోని డీఎల్, పీడీ, లైబ్రేరియన్	793	740	53
జూనియర్ కాలేజీల్లో జేఎల్, పీడీ, లైబ్రేరియన్	1924	1898	26
పీజీటీ (పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్)	1276	1255	21
టీజీటీ (ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్)	4006	3718	288
స్కూల్ లైబ్రేరియన్	434	418	16
స్కూల్ ఫిజికల్ డైరెక్టర్	275	275	0
మొత్తం	8708	8304	404

కొడుకు ఆచూకీ చెప్పాలని దళిత మహిళకు వేధింపులు

- 3 నెలలుగా పీఎస్‌కు రప్పిస్తున్న పోలీసులు
- సీఎం సొంత జిల్లాలో దారుణం
- లాఠీతో కొట్టారని బాధితురాలు ఆవేదన

బషీరాబాద్, ఆగస్టు 15: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో పేద దళిత మహిళపై పోలీసులు కర్కషంగా వ్యవహరించారు. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం నవల్గాకు చెందిన దళిత మహిళ లోవాడ కళావతికి కొడుకు నరేశ్ (17) ఉన్నాడు. మండల పరిధిలోని కాశీపూర్‌కు చెందిన ఓ బాలికను నరేశ్ 3 నెలల క్రితం (మే 2వ తేదీన) ఎక్కడికో తీసుకెళ్లాడు. మే 5న బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో నరేశ్‌పై కిడ్నాప్ కేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో నరేశ్ ఆచూకీ తెలపాలని తల్లి కళావతిని పోలీసులు స్టేషన్‌కు పిలిపించుకొని వేధిస్తున్నారు. తనకు తెలియదని చెప్తున్నా పట్టించుకోకుండా కొట్టారని బాధితురాలు తెలిపింది. కాళ్లు, చేతులపై లాఠీతో కొట్టారని, దాంతో నడవలేకపోయానని చెప్పింది. కొడుకు ఆచూకీ చెప్పకపోతే గన్నుతో కాల్చివేస్తానని ఎస్సై బెదిరించినట్టు వెల్లడించింది. మూడు నెలల నుంచి ప్రతి రోజు పోలీస్‌స్టేషన్‌కు రప్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. కూలిపనులు చేస్తే గానీ పుటగడవని తనను పోలీసులు ఇలా ఇబ్బందులు పెట్టడం తట్టుకోలేకపోతున్నానని, ఒక్కసారిగా చంపేస్తే కొడుకు కోసం చనిపోయిందన్న పేరైనా ఉంటుందని కన్నీరుమున్నీరవుతున్నది.

పీసీసీ చీఫ్ కౌన్?

- రేసులో బలరాం నాయక్, అడ్లూరి లక్ష్మణ్, మధు యాష్కి
- సామాజిక వర్గం కోణంలో ఎవరి ప్రయత్నాలు వారివే
- మహిళా విభాగం అధ్యక్షురాలి మార్పు కూడా తథ్యం
- మరో 20 నామినేటెడ్ పోస్టులకు అభ్యర్థుల ఎంపిక

హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి ఢిల్లీ పర్యటనకు వెళ్లిన నేపథ్యంలో మళ్లీ పీసీసీ అధ్యక్ష పదవిపై కాంగ్రెస్‌లో చర్చ మొదలైంది. రాష్ట్రం కాంగ్రెస్ పార్టీకి సారథిని ఎంపిక చేసేందుకు పార్టీ అధిష్ఠానం సుదీర్ఘ కసరత్తు చేస్తున్నది. పార్లమెంటు ఎన్నికలు ముగిసిన వెంటనే పీసీసీ అధ్యక్షుడి ఎంపిక దాదాపు పూర్తయిందనుకుంటున్న సమయంలో అధిష్ఠానం తన నిర్ణయాన్ని వాయిదా వేసింది. ఆ సమయంలో మహేశ్‌కుమార్‌గౌడ్ పేరు ఖరారైనట్టు ప్రచారం జరిగింది. ఆయన పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేకు ధన్యవాదాలు తెలుపుతున్న ఫొటోలు కూడా విడుదలయ్యాయి. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి ఢిల్లీకి వెళ్లారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడి ఎంపికపై ప్రధానంగా చర్చ ఉంటుందని ప్రచారం జరుగుతున్నది. రాష్ట్రంలో రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఎవరికి పీసీసీ పదవిని అప్పగిస్తారన్న దానిపై తీవ్రమైన చర్చ జరుగుతున్నది. మహేశ్‌కుమార్‌గౌడ్ తనకు దాదాపు పదవి ఖాయమైందన్న ధీమాతో ఉండగా.. తాజాగా తెరమీదకు మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ పేరు వచ్చింది. ఆయన తనకు పార్టీలో తగిన గుర్తింపు ఇస్తారని, పీసీసీ అధ్యక్ష పదవి తనదేనని చెప్తున్నారు. ఈ విషయంలో నిర్ణయం జరిగిపోయిందని, పార్టీ అధిష్టానం ప్రకటన చేయడమే ఆలస్యమని అంటున్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో లంబాడ తెగకు చెందిన వారికి మంత్రి పదవి దక్కలేదని, వారికి సముచిత స్థానం ఇవ్వకపోతే పార్టీ మనుగడకు ఇబ్బంది అన్న విషయాన్ని అధిష్ఠానం గుర్తించిందని ఆయన తన సన్నిహితులతో చెప్తున్నారు. ఇక మరోనేత, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేరు కూడా తెరపైకి వచ్చింది. పార్టీలో మాదిగ సామాజికవర్గానికి చెందిన లక్ష్మణ్‌కు పీసీసీ అధ్యక్ష పదవి ఇస్తే మంచిదని, ఎస్సీల వర్గీకరణ రాష్ట్రంలో ప్రధానాంశంగా ఉండటంతో లక్ష్మణ్ వంటి సీనియర్లకు పీసీసీ పదవి ఇస్తే బాగుంటుందన్న ప్రతిపాదన వచ్చినట్టు తెలుస్తున్నది. పలువురు మంత్రులు కూడా ఆయన పేరును సిఫారసు చేస్తున్నట్టు సమాచారం. ఇక మరో నేత మధుయాష్కీ కూడా రేసులో ఉన్నారని ప్రచారం జరుగుతున్నది. బీసీ సామాజికవర్గానికి చెందిన తనకు ఖచ్చితంగా పీసీసీ అధ్యక్ష పదవి వస్తుందని ఆయన తన అనుచరులతో చెప్తున్నట్టు తెల్సింది.

మహిళా కాంగ్రెస్ పదవి సరితకు?

రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావును పక్కకు పెట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పార్టీ అధిష్ఠానానికి సిఫారసు చేశారు. ఆమె స్థానంలో గద్వాలకు చెందిన సరిత పేరును సీఎం సిఫారసు చేశారు. ఈ మేరకు సీఎం పేరుతో ఒక లేఖ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. గద్వాలలో బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకోవడంపై సరిత వర్గం భగ్గుమన్న సంగతి తెల్సిందే. దీంతో తాను తిరిగి బీఆర్‌ఎస్‌లోకే వెళ్తానని కృష్ణమోహన్‌రెడ్డి ప్రకటించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి కల్పించుకొని కృష్ణమోహన్ రెడ్డిని కాంగ్రెస్‌లో ఉండేలా ఒప్పించారు. అదే సమయంలో సరితకు పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలి పదవి ఇస్తామని హామీ ఇచ్చారు. దీనిపై ప్రస్తుత మహిళా విభాగం అధ్యక్షురాలు సునీతారావు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఆమె తనకు పార్టీ సరైన గుర్తింపు ఇవ్వడంలేదని మీడియాతో వాపోయారు. తన పదవిని కాపాడుకునేందుకు ఆమె తన ప్రయత్నాల్లో తాను ఉన్నారు. ఇవి కాకుండా రేవంత్ తన పర్యటనలో నామినేటెడ్ పోస్టులకు కూడా 20 మందిని ఎంపిక చేసే అవకాశం కూడా ఉన్నట్టు తెలిసింది.

19వ సారి ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి

పదవులపై అధిష్ఠానంతో చర్చలు

ఫాక్స్‌కాన్ కంపెనీ ప్రతినిధులతో భేటీ

హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి గురువారం రాత్రి ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఆయన వెంట పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఉన్నారు. ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన తర్వాత రేవంత్ ఢిల్లీ వెళ్లడం ఇది 19వ సారి. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్ష పదవితో పాటు పార్టీలోని ఇతర పదవులపైనా అధిష్ఠానం పెద్దలతో సీఎం చర్చించనున్నట్టు సమాచారం. పీసీసీ చీఫ్ పదవిపై అధిష్ఠానం దాదాపు మూడు నెలలుగా నాన్చుడు ధోరణి అవలంబిస్తున్న సంగతి తెలిసిందే. మహేశ్‌కుమార్‌గౌడ్ పేరు దాదాపు ఖరారైందని అప్పట్లో వార్తలు రాగా, తాజాగా మరో రెండుమూడు పేర్లు వినిపిస్తున్నాయి. పార్టీ విభాగాలకు అధ్యక్షుల నియామకం, మంత్రి పదవుల విస్తరణ వంటి అంశాలపైనా చర్చించనున్నట్టు సమాచారం. దీంతోపాటు ఢిల్లీలో ఫాక్స్‌కాన్ సంస్థ ప్రతినిధులతోనూ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చర్చించనున్నట్టు తెలిసింది.



రాజ్‌భవన్‌లో జాతీయ జెండా ఎగురవేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

రాజ్‌భవన్‌లో ఎట్‌హోం

పాల్గొన్న సీఎం, మంత్రులు

హైదరాబాద్, ఆగస్టు 15(నమస్తే తెలంగాణ): స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా గురువారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ రాజ్‌భవన్‌లో ఎట్‌హోం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, అధికారులు హాజరయ్యారు. వారంతా గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మతో కలిసి అక్కడే తేనీటి విందు స్వీకరించారు.



తెలంగాణ భవన్‌లో జాతీయ జెండాను ఎగురవేస్తున్న కేటీఆర్. చిత్రంలో జగదీశ్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, శేరి సుభాశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, దేవీప్రసాద్ తదితరులు

స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే

తెలంగాణ భవన్‌లో జాతీయ జెండా ఎగురవేసిన కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): స్వాతంత్య్రం పొందడమే కాదు.. దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా మనపైనే ఉన్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం తెలంగాణ భవన్‌లో జాతీయ జెండాను ఆయన ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'ఎందరో మహోన్నత వ్యక్తుల త్యాగాల ఫలితమే స్వాతంత్య్రం. నాడు వారంతా పోరాడి స్వాతంత్య్రం తేవడంతోనే నేడు మనమంతా ఆత్మగౌరవంగా జీవిస్తున్నాము. ఈ స్వాతంత్య్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉన్నది. ఇదే సమయంలో మహనీయులను నిత్యం స్మరించుకోవాల్సిన అవసరం ఉన్నది' అని కేటీఆర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, జగదీశ్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్ గౌడ్, మాజీ స్పీకర్, మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, దేవీప్రసాద్, ఎం శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాళ్లకు బూట్లతోనే జెండా ఎత్తబోయిన విప్

మహబూబాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్ బూట్లు వేసుకుని జాతీయ జెండా ఎత్తబోయారు. కలెక్టర్ అటెండర్ సూచనతో తేరుకొన్న విప్.. షూస్‌విప్పి జెండావిష్కరించారు.

• పట్టణ ప్రథమ మహిళకు అవమానం



జనగామ, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్‌కు అవమానం జరిగింది. జనగామ జిల్లా కేంద్రంలో వేడుకలకు ముఖ్యఅతిథిగా ఆలేరు ఎమ్మెల్యే, విప్ బీర్ల ఐలయ్య, విశిష్ట అతిథులుగా ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి, కలెక్టర్ షేక్‌రిజ్వాన్‌బాషా వేదిక ఎక్కుతున్నారు. పట్టణ ప్రథమ మహిళ, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునను 'మీకు ప్రొటోకాల్ లేదు' అని పోలీసులు అడ్డుకోగా, ఎమ్మెల్యే పల్లా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కలెక్టర్ సూచనతో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ సైతం వేదిక పక్కకు వెళ్లి కూర్చోవాలంటూ చెప్పారు.



హైకోర్టులో జరిగిన జెండావిష్కరణలో పాల్గొన్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే

న్యాయవాదుల రక్షణకు చట్టం చేయండి

- ప్రభుత్వానికి సీజే ప్రతిపాదన
- హైకోర్టులో ఘనంగా స్వాతంత్య్ర వేడుకలు
- తెలుగులో తీర్పుల వెబ్‌సైట్ ప్రారంభం

హైదరాబాద్, ఆగస్టు15 (నమస్తే తెలంగాణ): న్యాయవాదుల రక్షణ కోసం చట్టం రూపొందించాలని ప్రభుత్వానికి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే సూచించారు. గురువారం హైకోర్టులో జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ 'న్యాయవాదులపై దాడులు చేయాలనుకునే వాళ్లలో వణుకు పుట్టాలంటే చట్టం ఉండాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ నర్సింహారెడ్డి సూచన చేశారు. ఈ సూచనను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు చట్టం రూపొందించాలని ప్రభుత్వానికి ప్రతిపాదిస్తున్నది' అని పేర్కొన్నారు. ప్రభుత్వం త్వరలోనే చట్టాన్ని తీసుకొస్తుందనే నమ్మకం తనకు ఉన్నదన్నారు. క్రిమినల్ కేసుల్లో కోర్టులు జారీ చేసిన సమన్లను నిందితులకు వెంటనే అందజేసేందుకు వీలుగా త్వరలోనే ప్రత్యేక యాప్‌ను తీసుకొస్తామని తెలిపారు. ప్రస్తుతం రెండు ధర్మాసనాలు పేపర్లు లేకుండానే కోర్టు విధులను నిర్వహిస్తున్నాయని వెల్లడించారు. ఈ సందర్భంగా హైకోర్టు తీర్పులు ఇంగ్లిష్‌తోపాటు తెలుగులో ప్రజలకు అందుబాటులో ఉండే వెబ్‌సైట్‌ను జస్టిస్ అలోక్ అరాధే ప్రారంభించారు. ప్రసంగించిన వారిలో అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, బార్ కౌన్సిల్ చైర్మన్ నర్సింహారెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి ఉన్నారు. చదువులో ప్రతిభ చూపిన హైకోర్టు ఉద్యోగుల పిల్లలకు ఈసారీ అవార్డులను అందజేసిన మాజీ ఉద్యోగి విరూపాక్షరెడ్డిని ప్రధాన న్యాయమూర్తి అభినందించారు.

తులం బంగారం ఇంకా దొరకలేదా?

- మహాలక్ష్మికి 2500 ఏమయ్యాయి?
- స్టేషన్ ఘన్‌పూర్‌కు త్వరలో ఉప ఎన్నిక ఖాయం : కేటీఆర్
- బీఆర్ఎస్‌లో కాంగ్రెస్ నేతల చేరిక



మాజీ జడ్పీటీసీ రవికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేటీఆర్. చిత్రంలో పల్లా, రాజయ్య

హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): కల్యాణలక్ష్మి కింద ఆడబిడ్డలకు ఇస్తామన్న తులం బంగారం, మహాలక్ష్మి పథకం కింద ఇస్తామన్న రూ. 2,500 ఏమయ్యాయని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 2.5 లక్షల పెండిండ్లు అయ్యాయని గుర్తుచేశారు. వృద్ధులకు 4 వేలు ఇస్తామని చెప్పి రెండు నెలల పైసలు ఎగ్గొట్టారని విమర్శించారు. ఇప్పుడు కాం గ్రెస్‌లో ఎటు చూసినా రేవంత్‌రెడ్డి అన్నదమ్ములే కనిపిస్తున్నారని ఎద్దేవా చేశారు. సీఎం బావమరిది సృజన్‌రెడ్డి కంపెనీకి అమృత్ పథకం కింద వెయ్యి కోట్ల టెండర్లలో పనులు అప్పజెప్పారని పేర్కొన్నారు. గురువారం తెలంగాణ భవన్‌లో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గానికి చెందిన తాజా మాజీ జడ్పీటీసీ సభ్యులు మారపాక రవి, మాజీ ఎంపీపీ గబ్బెట బుచ్చయ్య, ప్రవీణ్, తిరుపతి తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు. కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ మరో 50 ఏండ్లు పటిష్ఠంగా ఉంటుందని తేల్చి చెప్పారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనమంటూ తప్పుడు ప్రచారం జరుగుతున్నదని, అదే నిజమైతే తమ ఇంటి ఆడబిడ్డ 150 రోజులుగా జైలులో ఎందుకు ఉంటుందని ప్రశ్నించారు.

భట్టికి నోబెల్ బహుమతి ఇవ్వొచ్చు

రూ.75 కోట్లతో సీతారామ ప్రాజెక్ట్ పూర్తి చేశామని చెప్తున్న భట్టికి నోబెల్ బహుమతి ఇవ్వొచ్చని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కేసీఆర్ పూర్తిచేసిన పనులను తన క్రెడిట్‌లో వేసుకునేందుకు రేవంత్ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ ఇచ్చిన 30 వేల ఉద్యోగాలను కూడా తామే ఇచ్చినట్టు రేవంత్‌రెడ్డి చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. జాబ్‌లెస్ క్యాలెండర్ ప్రకటించారని మండిపడ్డారు. వడ్లకు బోనస్‌పైనా రేవంత్ మాట తప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

స్టేషన్ ఘన్‌పూర్‌కు ఉప ఎన్నికలు

స్టేషన్ ఘన్‌పూర్ సహా మిగిలిన స్థానాల్లోనూ కచ్చితంగా ఉప ఎన్నికలు వస్తాయని, అప్పుడు ప్రజల ముందుకు కాంగ్రెస్ వైఫల్యాలను తీసుకెళ్లాలని కేటీఆర్ సూచించారు. స్టేషన్ ఘన్‌పూర్‌కు జరిగే ఎన్నికల్లో రాజయ్య విజయం పక్కా అని జోస్యం చెప్పారు. కాగ్నిజెంట్ సంస్థ బీఆర్ఎస్ ఉన్నప్పుడే ఒప్పందం కుదుర్చుకున్నదని, దీనినీ రేవంత్ తన ఖాతాలో వేసుకునేందుకు ప్రయత్నిస్తారని విమర్శించారు. బీఆర్ఎస్‌లో నాయకులు పోయినా కార్యకర్తలకు కొదవలేదని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ దురాగతాలను అడ్డుకోవడానికి తమకు అండగా ఉండాలని కోరారు. మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య మాట్లాడుతూ నమ్మక ద్రోహానికి కడియం శ్రీహరి పరాకాష్ట అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎన్నో అవకాశాలు ఇచ్చినా మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టేషన్ ఘన్‌పూర్‌ను మున్సిపాలిటి చేయకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. సమావేశంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లు, రాష్ట్ర నాయకులు మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, ఉపాధ్యక్షుడు తుంగ బాలు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలా?

మోసం చేయడం కాంగ్రెస్ నైజమని కేటీఆర్ విమర్శించారు. బీసీ డిక్లరేషన్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామని చెప్పారని, కానీ దానిని అమలు చేయకుండానే కాంగ్రెస్ స్థానిక ఎన్నికలకు వెళ్తుందని పేర్కొన్నారు. బీజేపీ నేతలు కూడా కాంంగ్రెస్‌కు అనుకూలంగా పనిచేస్తున్నారని ఆరోపించారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర. చిత్రంలో శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్

తెలంగాణ వ్యతిరేకికి రాజ్యసభ సీటా?

- రాష్ట్ర కాంగ్రెస్‌లో అర్హులే లేరా?
- ఢిల్లీలో మన ఆత్మగౌరవం తాకట్టు
- బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణ వ్యతిరేకి అయిన అభిషేక్ సింఘ్వీకి రాష్ట్రం నుంచి రాజ్యసభ సీటు ఇచ్చారని బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆరోపించారు. గురువారం తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి రవిచంద్ర మీడియాతో మాట్లాడుతూ.. 'రాష్ట్రంలోని బీసీ, మాదిగ, మైనార్టీల్లో ఎవరికైనా రాజ్యసభ సీటు ఇస్తారని అనుకున్నాం. వీ హనుమంతరావు లాంటి సీనియర్లు కాంగ్రెస్ అధిష్ఠానానికి కనిపించలేదు. సింఘ్వీ ఏ రోజూ తెలంగాణకు అనుకూలంగా మాట్లాడలేదు. గతంలో ఇక్కడి ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడారు. ఆయన తెలంగాణ వ్యతిరేకి. ఇక్కడివారికి పరిపాలన చేతకాదు అన్నట్టు మాట్లాడారు. తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల డిమాండ్లు ఉన్నందున రెండో ఎస్సార్సీ వేయాలని అన్నడు. హైదరాబాద్ లేని తెలంగాణ ఇవ్వాలని అన్నడు' అని గుర్తుచేశారు. రాష్ట్రంలో అర్హులే లేరన్నట్టు ఢిల్లీ వారికి రాజ్యసభ సీటు ఇవ్వటం రాష్ట్ర ప్రజలను అవమానించటమేనని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే తెలంగాణ అస్థిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టిందని ధ్వజమెత్తారు. ముస్లిం, ముదిరాజ్, మున్నూరుకాపు, యాదవ కులాలకు మంత్రివర్గంలో అవకాశం దక్కలేదని, కనీసం రాజ్యసభలోనైనా చాన్స్ దక్కుతుందని చూశామని వెల్లడించారు. సామాజికవర్గాల పరంగా కేసీఆర్ సమన్యాయం చేశారని తెలిపారు. డీ శ్రీనివాస్, బండ ప్రకాశ్, లింగయ్యయాదవ్ లాంటి వెనకబడినవర్గాలకు అవకాశం కల్పించారని చెప్పారు. సీతారామ ప్రాజెక్టు ప్రారంభం చాలా సంతోషకరమని, కేసీఆర్ అంటేనే నీళ్లు గుర్తుకు వస్తాయని అన్నారు.

కేసీఆర్ ఇతర రాష్ట్రాల వారికి సీటు ఇవ్వలేదు: శ్రీనివాస్ గౌడ్

మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో పదవులన్నీ తెలంగాణేతరులకే దక్కేవని గుర్తుచేశారు. పీసీసీ చీఫ్‌లు, సీఎం పదవులు అన్నీ వారికే వచ్చేవని తెలిపారు. తెలంగాణ ఉద్యమం రావడానికి అసమానతలు కూడా కారణమని వెల్లడించారు. కేసీఆర్ తెలంగాణ తెచ్చినందుకే రేవంత్‌రెడ్డి సీఎం, కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రి అయ్యారని అన్నారు. కేసీఆర్‌పై పెద్ద స్థాయిలో ఒత్తిళ్లు వచ్చినా ఇతర రాష్ట్రాల వారికి రాజ్యసభ సీటు ఇవ్వలేదని స్పష్టం చేశారు. తెలంగాణ వ్యతిరేకులకు ఇక్కడి నుంచి పదవులు ఇవ్వడం బాధ కలిగిస్తున్నదని చెప్పారు. బీసీలకు అవకాశం ఇస్తే బాగుండేదని అభిప్రాయపడ్డారు.

రాజీవ్ విగ్రహం.. అస్థిత్వంపై దాడే

- తెలంగాణ స్వాభిమానాన్ని దెబ్బతీసే కుట్ర
- సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహం ప్రతిష్ఠించాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ సోయి లేదు.. వలసవాద పుత్రుడు
- మొండిగా వ్యవహరిస్తే ప్రజల ధర్మాగ్రహానికి గురికాక తప్పదు
- ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, బీఆర్ఎస్ నేత దేవీప్రసాద్ హెచ్చరిక



మీడియాతో మాట్లాడుతున్న దేశపతి శ్రీనివాస్. చిత్రంలో దేవీప్రసాద్, పల్లె రవికుమార్‌గౌడ్

> “ ఇప్పటికైనా రాజీవ్‌గాంధీ విగ్రహం స్థానంలో తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలి. అలా కాదని మొండికేస్తే తెలంగాణలో అలజడి మొదలవుతుంది, ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. మేము ఉద్యమ కార్యాచరణ ప్రకటించాల్సి ఉంటుంది. తెలంగాణ అస్థిత్వం మీద దాడి చేయడం మానాలి. -దేశపతి శ్రీనివాస్

హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలనుకున్న చోట రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ప్రతిష్ఠించడం ముమ్మాటికీ మన అస్తిత్వంపై దాడేనని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల ప్రతీక అయిన తెలంగాణ తల్లి విగ్రహం సచివాలయం, అమరజ్యోతి మధ్యలో ఏర్పాటుచేయాలని గత ప్రభుత్వం నిర్ణయించిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నదని అన్నారు. దేశమంతా ఓ వైపు స్వాతంత్య్ర దినోత్సవ సంబురాలు జరుపుకుంటుంటే ఇక్కడ మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ స్వాభిమానం మీద దాడి చేస్తున్నదని విమర్శించారు. తెలంగాణ స్వాభిమానాన్ని దెబ్బతీసేందుకు రాష్ట్ర సచివాలయం ఎదురుగా రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి ఏనాడు ప్రాంతీయ అకాంక్షలు తెలియవని, ఆ పార్టీ అప్రజాస్వామిక విధానాల కారణంగానే అనేక ప్రాంతీయ పార్టీలు పుట్టాయని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ సోయి లేదని, ఆయన వలసవాద పుత్రుడని దుయ్యబట్టారు. తెలంగాణ ఉద్యమం సమయంలో.. ఎవరైనా చంద్రబాబు దగ్గరికి వస్తే ప్రాణాలు తీస్తా అన్నట్టు రేవంత్ రైఫిల్ పట్టుకుని తిరగాడని ఆరోపించారు. రేవంత్ సీఎం అయ్యాక జై తెలంగాణ నినాదం మసకబారిపోయిందని, ఆ స్థానంలో జై సోనియా, జై కాంగ్రెస్ నినాదాలు వచ్చాయని మండిపడ్డారు. రేవంత్ అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ అధికార చిహ్నంలోని చార్మినార్, కాకతీయ తోరణాలను రాచరిక చిహ్నాలని అవహేళన చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, రాహుల్ గాంధీ తండ్రి రాజీవ్‌గాంధీ విగ్రహం కాదని డిమాండ్‌చేశారు. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, లేకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

తెలంగాణ ప్రజల ప్రతీక

తెలంగాణ తల్లి తెలంగాణ ప్రజల ప్రతీక అని, వ్యక్తి కాదనే విషయాన్ని గుర్తించాలని దేశపతి శ్రీనివాస్ పేర్కొన్నారు. రాజీవ్‌గాంధీ ఒక వ్యక్తి అని గుర్తుచేశారు. రాజకీయ సంకుచిత వైఖరి, మొండివైఖరితో వ్యవహరిస్తే ఉద్యమించక తప్పదని హెచ్చరించారు. తెలంగాణ తల్లి విగ్రహం కావాలా లేక రాహుల్‌గాంధీ తండ్రి విగ్రహం కావాలా ప్రజలు తేల్చుకోవాలని సూచించారు.

కేసీఆర్ పేరు చెరిపేస్తే చెరిగిపోయేది కాదు

రాజీవ్‌గాంధీకి తెలంగాణకు ఏం సంబంధం అని దేశపతి ప్రశ్నించారు. తెలంగాణతో సోనియా గాంధీకి సంబంధం ఉందన్నారు. రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టే ముందు తెలంగాణ మేధావులతో ఏమైనా చర్చలు జరిపారా? కనీసం కోదండరాం, హరగోపాల్, అందెశ్రీ అభిప్రాయాలనైనా తెలుసుకున్నారా అని ప్రశ్నించారు. వారు ముగ్గురైనా రాజీవ్ గాంధీ విగ్రహం అక్కడ వద్దని రేవంత్‌కు సూచిస్తే మంచిదని అన్నారు. రాజీవ్‌గాంధీ విగ్రహానికి తెలంగాణ సచివాలయానికి ఏం సంబంధం అని బీఆర్ఎస్ నేత జీ దేవీప్రసాద్ ప్రశ్నించారు. సచివాలయం ముందు రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టడం తెలంగాణ ప్రజల మనసును గాయపరచడమేనని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేత పల్లె రవికుమార్ మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీ విగ్రహం విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలని, లేకుంటే ప్రజల ధర్మాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

లోకం పోకడ



మనం ఇలాగే ఇంకా కసిగా పనిచేసి ఏలియన్లను పార్టీలోకి చేర్చుకొని గ్రహాలతో పోటీ పడాలి సార్!

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	38.7°c	25.5°c
రంగారెడ్డి	37.3°c	22.6°c
మెదక్	36.8°c	23.6°c
నల్లగొండ	34.5°c	24.0°c
ఖమ్మం	34.0°c	25.0°c
హైదరాబాద్	33.8°c	25.8°c
మహబూబ్‌నగర్	33.4°c	24.2°c
కరీంనగర్	33.0°c	27.0°c
నిజామాబాద్	32.2°c	26.4°c
వరంగల్	32.0°c	26.0°c

జెండా స్టిక్కర్‌ను తలకిందులుగా ధరించి జెండావిష్కరణ



మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 15: పంద్రాగస్టు వేడుకల్లో పాల్గొన్న మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తన షర్ట్‌పై జాతీయజెండా స్టిక్కర్‌ను తలకిందులుగా ధరించడం చర్చనీయాంశంగా మారింది. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఒకేషనల్ జూనియర్ కళాశాలలో జాతీయ జెండావిష్కరణకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యేకు స్వాగతం పలికే క్రమంలో కళాశాల సిబ్బంది జెండా స్టిక్కర్‌ను ఇలా తలకిందులుగా పెట్టారు. ఆయన దానిని గమనించకుండా జాతీయ జెండాను ఎగురవేశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా వైరల్ అయ్యాయి.



బాన్సువాడ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో బూట్లను తీసి పక్కన పెడుతున్న అటెండర్

ఉన్నతాధికారి బూట్లు పట్టిన అటెండర్

బాన్సువాడ, ఆగస్టు 15: బాన్సువాడ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గురువారం నిర్వహించిన స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా అవమానకర ఘటన చోటుచేసుకుంది. జెండావిష్కరణకు వచ్చిన ఆర్డీవో.. జెండా గద్దె సమీపంలో బూట్లు వదిలారు. దీంతో అటెండర్ వచ్చి ఆర్డీవో బూట్లను తీసి పక్కన పెడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఉన్నతాధికారి బూట్లను అటెండర్ మోయడమేంటని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. ఆర్డీవోను వివరణ కోరగా స్పందించలేదు.

ఎమ్మెల్యేల నారాజ్

నిజామాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): పంద్రాగస్టు వేడుకల్లో గౌరవ వందన స్వీకారోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పలువురిలో అసంతృప్తిని రగిల్చింది. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ఒకింత నారాజ్ అయినట్టుగా గుసగుసలు వినిపిస్తున్నాయి. సీనియర్ శాసనసభ్యులను పక్కన పెట్టి కార్పొరేషన్ చైర్మన్లకు జెండా ఎగురవేసే అవకాశం రావడంతో పలువురు నొచ్చుకున్నట్టుగా తెలుస్తున్నది. ఇందులో భాగంగానే జెండా వందనానికే ముఖం చాటేసినట్టుగా అర్థమవుతున్నది. కామారెడ్డిలో వేరే జిల్లాకు చెందిన వ్యక్తి కి అవకాశం ఇచ్చి ఈ ప్రాంతానికి చెందిన షబ్బీర్ అలీని వేరే జిల్లాకు పంపడంపైనా చర్చ నడుస్తున్నది. మంత్రి పదవి రాలేదన్న బాధ వెంటాడుతుండగా.. మరోవైపు పం ద్రాగస్టు వేడుకల్లో జెండా ఆవిష్కరణలోనూ చోటు లేకపోవడంతో సుదర్శన్‌రెడ్డి వర్గీయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇతర ఎమ్మెల్యేలూ అసంతృప్తితో ఉన్నారు.

జెండావిష్కరణ ఏర్పాట్లలో ఘర్షణ

వెల్దండలో కత్తితో దాడి.. ఇద్దరికి గాయాలు

నర్మెట, ఆగస్టు 15: జాతీయ జెండా ఆవిష్కరణ ఏర్పాట్లలో ఇద్దరు యువకుల మధ్య జరిగిన ఘర్షణ కత్తులతో దాడి వరకు వెళ్లింది. జనగామ జిల్లా నర్మెట మండలం వెల్దండ గ్రామంలో కొందరు యువకులు చందాలు వేసుకొని బుధవారం రాత్రి జాతీయ జెండావిష్కరణ ఏర్పాట్లు చేశారు. ఈ విషయంలో గోల్కొండ శ్రీనివాస్, కంతి స్వామికి బుధవారం రాత్రి గొడవ జరిగింది. గురువారం ఉదయం జాతీయ జెండావిష్కరణ అనంతరం పెద్ద మనుషులు పిలిచి రాత్రి గొడవ ఎందుకు జరిగిందని స్వామిని, శ్రీనివాస్‌ను విచారించారు. శ్రీనివాస్ పెద్ద మనుషులు చెప్పింది వినకుండా తన వద్ద ఉన్న కత్తితో స్వామి, రవిపై దాడి చేశాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన స్వామిని హైదరాబాద్‌లోని నీలిమా దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై నగేశ్ తెలిపారు.



మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
NAMASTE TELANGANA

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

శుక్రవారం FRIDAY 16.8.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 14+4 Pages: 14+4 | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 72 ‖ వెల (Price) రూ.6.50 | వరలక్ష్మీ వ్రతం

శుక్రవారం, సూర్యోదయం: 5-59, సూర్యాస్తమయం: 6-41. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు శ్రావణ మాసం శుక్ల పక్షం తిథి: ఏకాదశి ఉదయం 9-40 వరకు, తదుపరి ద్వాదశి. నక్షత్రం: మూల పగలు 12-43 వరకు. వర్జ్యం: ఉదయం 11-09 నుంచి పగలు 12-44 వరకు, పునర్ వర్జ్యం: రాత్రి 9-58 నుంచి రాత్రి 11-30 వరకు. రాహుకాలం: ఉదయం 10-45 నుంచి పగలు 12-20 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 8-32 నుంచి ఉదయం 9-22 వరకు, పునర్ దుర్ముహూర్తం: పగలు 12-45 నుంచి పగలు 1-36 వరకు. అమృతకాలం: ఉదయం 6-22 నుంచి ఉదయం 7-57 వరకు. మఖ కార్తె, సింహ సంక్రమణం.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD
www.ntnews.com /ntdailyonline

మాఫీ అరకొర.. రైతు కొరకొర

అసెంబ్లీ ఎన్నికలకు ముందు డిసెంబర్ 9 కల్లా రుణమాఫీ చేస్తామన్నారు. ఆ తర్వాత మాఫీపై మాటలు, తేదీలు మారుతూ వచ్చాయి. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఊరూరా దేవుళ్లపై ఒట్లు పెట్టి మరీ ఆగస్టు 15 నాటికి పూర్తిచేస్తానని ముఖ్యమంత్రి రేవంత్ చెప్పుకొచ్చారు. ఒకేదశలో అన్నది కాస్తా మూడు నాలుగు దశలైంది. తొలి రెండు దశల్లో మాఫీ కాకపోవడం నుంచి రైతులు ఇంకా తేరుకోకముందే.. '2 లక్షల వరకు రుణమాఫీ అయిపోయింది. అందరికీ చేసేశాం' అని సీఎం ప్రకటించేశారు.

మొత్తం 32.5 లక్షలమంది రైతులకు మాఫీ చేస్తామన్నారు. కానీ చివరకు 22 లక్షల మందితోనే సరిపెట్టారు. మరి మిగిలిన రైతుల సంగతేంది? 31వేల కోట్లు మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ చేసింది 17,869 కోట్లే! సగం నిధులూ ఖర్చు కాకుండా మాఫీ ఎట్ల పూర్తయ్యింది?

అర్హతలున్నా కొంతమందికి రుణమాఫీ కాలేదని సీఎం స్వయంగా చెప్పుకొచ్చారు. కానివాళ్లు కలెక్టరేట్ కౌంటర్లలో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. అంటే సాగుపనులన్నీ మానుకుని ఇక రైతులు రేపటినుంచి సర్కారీ దఫ్తర్ల చుట్టూ దరఖాస్తులు పట్టుకుని తిరగాలన్నమాట. ఇదీ.. కాంగ్రెస్ గ్యారెంటీ!

రుణమాఫీ పూర్తి చేశాం



- వరంగల్ రైతు డిక్లరేషన్‌ను అమలు చేశాం
- 2 లక్షల్లోపు రుణాల కోసం 18 వేలకోట్లు జమ
- నిరుద్యోగులకు ఇక ఏటా 60 వేల ఉద్యోగాలు
- రెండేండ్లలో సీతారామ ప్రాజెక్టు పూర్తిచేస్తాం › 3
- సవాల్‌కు కట్టుబడి హరీశ్ రాజీనామా చేయాలి
- వైరా బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్



పిడికిలెత్తిన పోడురైతులు
- పట్టాలివ్వకపోవడంపై సీఎం సభలో నిరసన
- పలువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు › 3

ఆవేశంతో రంకెలేస్తే అబద్ధం నిజమైపోదు!



అబద్ధమే సిగ్గుపడే నీచమైన చరిత్రకు నాంది పలికిన సీఎం

- రైతుకే కాదు, దేవుడికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ద్రోహం
- దేవుళ్లపై ఒట్లు పెట్టి మరీ రుణమాఫీని ఎగవేసిన సర్కార్
- కేటాయించిన రూ.26 వేల కోట్లలోనూ 9వేల కోట్లు కోత
- ఇంతలా దిగజారిన, దిక్కుమాలిన సీఎం మరొకరు లేరు
- రేవంత్ పాపాలు రాష్ట్రానికి శాపంగా మారొద్దు: హరీశ్‌రావు

హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): రుణమాఫీ పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి రైతులను దగా చేశారని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. నోటికి వచ్చినట్టు దిగజారుడు భాషలో బీఆర్‌ఎస్‌ను తిడితేనో, తెచ్చిపెట్టుకున్న ఆవేశంతో రంకెలు వేస్తేనో అబద్ధాలు నిజాలు అయిపోవని అన్నారు. రేవంత్‌రెడ్డి రైతు ద్రోహానికే కాదు దైవ ద్రోహానికీ పాల్పడ్డారని మండిపడ్డారు. ఆగస్టు 15 నాటికి రాష్ట్రంలోని రైతులకు రూ.31వేల కోట్ల రుణమాఫీ చేస్తామని ఊదరగొట్టి అందులో రూ.9 వేల కోట్ల కోతపెట్టిన ఘనుడు రేవంత్‌రెడ్డి అని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి సీఎంలా ప్రవర్తించటం లేదనే విషయాన్ని ప్రతి సందర్భంలోనూ నిరూపించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఉమ్మడి › 3వ పేజీలో

రాష్ట్రానికి పట్టిన చీడ రేవంత్

- ఇంత అసభ్యత నిండిన ముఖ్యమంత్రి దేశంలోనే లేరు › 3
- రేవంత్‌రెడ్డీ.. నీ భాషను పశువులు కూడా సహించలేవు
- హరీశ్ మెడలు వంచితేనే నువ్వు రుణమాఫీ చేసినవ్: పల్లా
- అమరుల స్థూపం వద్ద రేవంత్ ముక్కు నేలకు రాయాలి: సబిత
- దేవుళ్లనూ మోసం చేసిన పచ్చి అబద్ధాల కోరు రేవంత్: వేముల
- మూసీని కాదు ముఖ్యమంత్రి నోటిని ప్రక్షాళన చేయాలి: పాడి
- హరీశ్‌రావును తిడితే తప్పులు ఒప్పులై పోవు: కొత్త ప్రభాకర్‌రెడ్డి

కేసీఆర్ ఎత్తిపోతలు.. కాంగ్రెస్ ఉత్త కోతలు

నెరవేరిన కేసీఆర్ జల సంకల్పం.. సీతారామ ప్రాజెక్టుతో ఉమ్మడి ఖమ్మం ప్రజల కల సాకారం

8 ఏండ్లుగా 7,400 కోట్లు ఖర్చు చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం.. 8 నెలల్లో 75 కోట్లు వెచ్చించిన కాంగ్రెస్ సర్కార్

అయినా అంతా తామే కట్టినట్టు ముఖ్యమంత్రి, మంత్రుల బిల్డప్.. ప్రాజెక్టు మూడు పంప్‌హౌస్‌లు ప్రారంభం



ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతాంగానికి గోదావరి జలాలను అందించేందుకు వీలుగా రూపొందించిన సీతారామ ఎత్తిపోతల పథకానికి టేకులపల్లి మండలం రోళ్లపాడు వద్ద 2016 ఫిబ్రవరి 16న శంకుస్థాపన చేస్తున్న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్. 8 ఏండ్లలో 7,400 కోట్లు ఖర్చు చేసిన కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణాన్ని దాదాపు పూర్తిచేసింది.



సీతారామ ప్రాజెక్టు పంప్‌హౌస్‌లను ప్రభుత్వం గురువారం ప్రారంభించింది. భద్రాద్రి జిల్లా పూసుగూడెం వద్ద నిర్మించిన పంపుహౌస్‌ను సీఎం రేవంత్ ప్రారంభించారు. బీజీ కొత్తూరు పంపుహౌస్‌ను మంత్రి కోమటిరెడ్డి, కమలాపురం పంపుహౌస్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు.

8 నెలలు గడిచిపోయాయి. ఒక్క పంప్‌నూ బిగించలేదు. ఒక్క మోటరైనా కొత్తగ పెట్టలేదు. పైగా సీతారామ ప్రాజెక్టే వృథా అన్నారు. ఖర్చు భారమని, అంచనాలు పెరిగిపోయాయని చెప్తూ వచ్చారు. తీరా ఇప్పుడు ఆ ప్రాజెక్టు తామే కట్టామని, క్రెడిట్ అంతా తమదేనని అంటున్నారు. కానీ ఖమ్మం ప్రజలకు తెలుసు. ప్రాజెక్టు ఎవరి ఆలోచనో! ఎవరి ప్రయత్నమో! ఎవరి కష్టమో! కాంగ్రెస్ పాలనలో తట్టెడు మట్టి కూడా తియ్యకుండా ఆగిపోయిన ప్రాజెక్టులను పట్టాలెక్కించి పరుగులు తీయించింది కేసీఆర్. ఒకటికాదు రెండుకాదు.. పదుల సంఖ్యలో ఎత్తిపోతల పథకాలను వేగంగా పూర్తిచేసిన ఘనత కేసీఆర్‌దే. ప్రభుత్వం మారిన తర్వాత కూడా.. సీతారామ ప్రాజెక్టు దాదాపు పూర్తయ్యిందని, తుదిమెరుగులు దిద్దితే రైతులకు నీళ్లందించవచ్చని ప్రభుత్వానికి కేసీఆర్ గుర్తుచేశారు. ఆయన చెప్పిన తర్వాత కదలిన ప్రభుత్వం.. గురువారం ప్రాజెక్టు పంప్‌హౌస్‌లను ప్రారంభించింది.

నిలదీసిన బీఆర్‌ఎస్ నేతల అరెస్ట్
'సీతారామ' నీళ్లివ్వాలన్న మాజీ ఎమ్మెల్యేలు
రేగా, హరిప్రియ అరెస్ట్.. ఆందోళనతో ఉద్రిక్తం › 3

నీళ్లు ఎత్తిపోసింది కొద్దిసేపే!
ప్రారంభంలో గంటైనా నడవని పంప్‌హౌస్‌లు

ఖాతా లేకున్నా యూపీఐ చెల్లింపులు
త్వరలో డెలిగేటెడ్ పేమెంట్ సిస్టమ్
పరిచయం కానున్న కొత్త ఫీచర్లు
› 8

ఎస్బీఐ వడ్డీరేట్ల పెంపు
10 బేసిస్ పాయింట్లు పెరిగిన ఎంసీఎల్‌ఆర్
గృహ, వాహన, వ్యక్తిగత రుణాలు పిరం › 8

అభయహస్తం కాదు కబంధ హస్తం!

వరల్డ్ బ్యాంక్ అప్పుల ఊబిలోకి రాష్ట్రాన్ని దించుతున్న కాంగ్రెస్ సర్కార్

- ప్రపంచబ్యాంకు ప్రాపకం కోసం ప్రభుత్వం పాకులాట
- అప్పులు తెస్తానంటూ ముఖ్యమంత్రి పంద్రాగస్టు సందేశం
- తక్కువ వడ్డీకే రుణాలిస్తారని గొప్పగా చెప్పుకొచ్చిన రేవంత్
- అదే జరిగితే ఆర్థిక సార్వభౌమాధికారాలు తాకట్టు పెట్టినట్టే
- సంక్షేమానికి ఎసరు పెట్టేలా బిగుసుకునే నిబంధనల చట్రం
- సర్కార్ తలొగ్గితే గ్యారెంటీలు గగనమే.. హామీలకు మంగళమే
- బాబు హయాంలో సంస్కరణల పేరిట ప్రైవేటీకరణ ఉచ్చు
- విద్యుత్తు సంస్కరణలపై నాటి పోరాటాన్ని మరువని ప్రజలు
- తెలంగాణలో 20 ఏండ్లుగా వినపడని ప్రపంచబ్యాంకు మాట
- అప్పుల యావలో ఇప్పుడు మళ్లీ తెరపైకి తెచ్చిన సీఎం రేవంత్

హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణను ప్రపంచబ్యాంకు విషకౌగిలిలోకి చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉవ్విళ్లూరుతున్నది. 'తక్కువ వడ్డీతో నిధులు ఇవ్వడానికి ప్రపంచబ్యాంకు సానుకూలంగా ఉన్నది' అని సీఎం రేవంత్‌రెడ్డి కొన్నాళ్లుగా పదే పదే చెప్తున్న మాట. ఇటీవల అమెరికా పర్యటనలోనూ ప్రపంచబ్యాంకు అధ్యక్షుడితో చర్చలు జరిపారు. హైదరాబాద్ 4.0, మూసీ ప్రక్షాళన, స్కిల్స్ యూనివర్సిటీ, ప్రజారోగ్య రంగానికి అప్పులు ఇచ్చేందుకు ప్రపంచబ్యాంకు సిద్ధంగా ఉన్నదని ప్రకటించారు. ఈ నిర్ణయంపై ఆర్థిక నిపుణులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచబ్యాంకు నుంచి › 10వ పేజీలో

గడువులోగా సాధ్యమయ్యేనా?
మార్కెట్ ధర రూ.50 లక్షలైతే.. ఇస్తున్నది రూ.6 లక్షలే
భూసేకరణపై రైతులను ఒప్పించాలంటూ కలెక్టర్లపై ఒత్తిడి
ట్రిపుల్ ఆర్ భవితవ్యంపై సర్వత్రా అనుమానాలు › 5

బ్యాక్‌లాగ్‌లన్నీ జాబ్ క్యాలెండర్‌లోకే!
- గురుకుల పోస్టుల్లో డౌన్‌మెరిట్ లేనట్టే › 10
- ప్రాథమిక అంచనాలో 1700 నాన్‌జాయినింగ్స్
- డీఎస్సీ, జేఎల్ రిక్రూట్‌మెంట్ పూర్తయితే సగం ఖాళీ
- అన్నింటినీ వచ్చే క్యాలెండర్‌లోనే నింపేలా కసరత్తు
- డౌన్‌మెరిట్ పాటించాలని 6 నెలలుగా అభ్యర్థుల పోరాటం..అయినా అదేమీ పట్టని రాష్ట్ర ప్రభుత్వం


కరెంట్ కోతలు.. అడిగితే బూతులు

ఫోన్ చేసిన వ్యక్తిపై విద్యుత్తు సిబ్బంది అసహనం
మద్యం మత్తులో తిట్లు.. ఆడియో వైరల్
నేడు సీఎండీకి ఫిర్యాదు చేయనున్న బాధితుడు

కాశీబుగ్గ, ఆగస్టు 15: గ్రేటర్ వరంగల్‌లోని కాశీబుగ్గ ఓసిటీ రోడ్డులోని సబ్‌స్టేషన్ పరిధి విద్యుత్తు అధికారులు వినియోగదారుడిని బూతులు తిట్టినట్టు సోషల్ మీడియాలో వైరల్ అయింది. గురువారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో కాశీబుగ్గ వినియోగదారుడు కరుణాకర్‌రెడ్డి విద్యుత్తు అధికారులకు ఫోన్ చేసి కరెంటు పోయిందని సమాచారం ఇచ్చాడు. దీంతో అధికారులు బూతులు తిట్టినట్టు ప్రచారం జరుగుతున్నది. అధికారి మద్యం మత్తులో ఉన్నట్టు తెలిసింది. ఇరువురి మధ్య మాటామాటా పెరగడంతో వినియోగ దారుడిని బూతులు తిట్టినట్టు తెలిసింది. స్వాతంత్ర్య దినోత్సవం రోజున మద్యం మత్తులో ఉన్న అధికారితోపాటు మరో ఉద్యోగి దూషించినట్టు ప్రచారం జరుగుతున్నది. కాశీబుగ్గకు చెందిన విద్యుత్తు ఏఈపై గతంలో ఆరోపణలు వచ్చినట్టు తెలిసింది. మద్యం మత్తులో బూతులు మాట్లాడిన అధికారుల ఫోన్ ఆడియో రికార్డులను విద్యుత్తు శాఖ సీఎండీ దృష్టికి తీసుకెళ్లనున్నట్టు బాధితుడు తెలిపాడు.

లౌకిక పౌరస్మృతి తక్షణావసరం

- ఇప్పుడున్నది మతపరమైన పౌరస్మృతి
- ఇది దేశాన్ని మతం ఆధారంగా విభజిస్తున్నది
- తరచూ ఎన్నికలతో దేశాభివృద్ధికి ఆటంకం
- జమిలి ఎన్నికలకు పార్టీలు ముందుకు రావాలి
- బంగ్లాదేశ్‌లోని హిందువుల భద్రతపై 140 కోట్ల మంది భారతీయుల్లో ఆందోళన
- స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, ఆగస్టు 15: దేశంలో లౌకిక పౌర స్మృతి తక్షణ అవసరమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. గురువారం న్యూఢిల్లీలోని ఎర్రకోటలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయన జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ.. 'ఇప్పుడు ఉన్న పౌర స్మృతి మతపరమైన పౌరస్మృతి అని సమాజంలోని ఎక్కువ మంది నమ్ముతున్నారు. ఇందులో నిజం ఉంది. మనం 75 ఏండ్లు మతపరమైన పౌర స్మృతితో జీవించాం. వివక్షను ప్రోత్సహించే పౌర స్మృతితో జీవించాం. ఇది దేశాన్ని మతప్రాతిపదికన విభజించడంతో పాటు అసమానతలను ప్రోత్సహిస్తున్నది. ఇప్పుడు మనం లౌకిక పౌర స్మృతి దిశగా పయనించాల్సి ఉంది. దేశానికి లౌకిక పౌర స్మృతి తక్షణ అవసరం. రాజ్యాంగ స్ఫూర్తి కూడా ఇదే. సుప్రీంకోర్టు కూడా దీని అవసరాన్ని అనేక సార్లు నొక్కి చెప్పింది. రాజ్యాంగ నిర్మాతల కలను నెరవేర్చాలి.' అని పేర్కొన్నారు. బంగ్లాదేశ్ ఘటనలను ఆయన ప్రస్తావిస్తూ ఆ దేశంలోని హిందువులు, ఇతర మైనారిటీల భద్రత పట్ల 140 కోట్ల మంది భారతీయులు ఆందోళనతో ఉన్నారని అన్నారు. దేశంలో తరచూ ఎన్నికలు జరుగుతుండటం వల్ల అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతున్నదని, జమిలి ఎన్నికలకు రాజకీయ పార్టీలు ముందుకు రావాలని ఆయన కోరారు. మహిళలపై అకృత్యాలకు పాల్పడే వారికి విధించే శిక్షలకు విస్తృత ప్రచారం కల్పించాలని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆడవాళ్లపై దారుణాలకు పాల్పడితే ఉరిశిక్ష పడుతుందనే భయం నేరస్తుల్లో రావాలన్నారు.

దేశానికి ఇది స్వర్ణయుగం

భారతదేశానికి ముఖ్యంగా ప్రపంచ కోణంలో ఇది స్వర్ణయుగమని, ఆ అవకాశాన్ని వదులుకోవద్దని మోదీ ప్రజలను కోరారు. భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచ పెట్టుబడిదారులు ఆసక్తి చూపిస్తున్నారని, రాష్ట్రాలు స్పష్టమైన విధానాలు రూపొందించి పెట్టుబడులను ఆకర్షించాలని సూచించారు. పెట్టుబడులు పెట్టాల్సింది రాష్ట్రాల్లో కాబట్టి కేంద్రం మాత్రమే ఈ పని చేయలేదని ప్రధాని పేర్కొన్నారు. భారత్ అభివృద్ధి చెందిన, సుసంపన్న దేశంగా మారాలనే లక్ష్యాన్ని అందుకోవాలంటే 140 కోట్ల మంది భుజం భుజం కలిపి నడవాలన్నారు. 2047 నాటికి 'వికసిత్ భారత్' సాధిస్తామని పేర్కొన్నారు. రాజకీయాల్లోకి కొత్త రక్తం రావాలని, రాజకీయ కుటుంబ నేపథ్యం లేని లక్ష మంది యువత ప్రజాజీవితంలోకి రావాలని పిలుపునిచ్చారు. రాబోయే ఐదేండ్లలో 75 వేల కొత్త వైద్య విద్య సీట్లను అందుబాటులోకి తెస్తామని తెలిపారు. దేశం ఎదుగుదలను జీర్ణించుకోలేని వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన ప్రజలకు సూచించారు. ఇలాంటి వక్రబుద్ధి ఉన్న గుప్పెడు మంది కూడా అస్థిరతకు బాటలు వేయవచ్చని, అన్నీ నాశనం చేయాలని వారు కలలు కంటున్నారని ఆరోపించారు. కాగా, మోదీది ఇది 11వ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం.ఈసారి ఆయన 98 నిమిషాల పాటు ప్రసంగించి రికార్డు సృష్టించారు.

అంబేద్కర్‌ను అవమానించడమే: ప్రతిపక్షాలు

ఇప్పుడు దేశంలో ఉన్నది 'మతపరమైన పౌర స్మృతి' అని ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ మండిపడింది. మోదీ వ్యాఖ్యలు రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌ను అవమానించడమే అని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. 'విద్వేషం, అపహాస్యం, చరిత్రను వక్రీకరించడంలో మానవాతీత ప్రధానమంత్రి సామర్థ్యానికి అవధులు లేవు. ఎర్రకోట నుంచి వీటిని ఆయన పూర్తిగా ప్రదర్శించారు. ఇప్పటివరకు మతపరమైన పౌరస్మృతి ఉందని అనడం అంటే హిందూ పర్సనల్ చట్టాల్లో సంస్కరణలు తీసుకువచ్చిన అంబేద్కర్‌ను తీవ్రంగా అవమానించడమే. ఈ సంస్కరణలను బీజేపీ, జన్‌సంఘ్ వ్యతిరేకించింది' అని పేర్కొన్నారు. మోదీ ప్రసంగంపై సీపీఐ ప్రధాన కార్యదర్శి డీ రాజా స్పందిస్తూ.. దేశాన్ని ఏకం చేసేందుకు, ప్రజల్లో స్ఫూర్తి నింపే అంశమేదీ ప్రసంగంలో లేదని, ఆర్‌ఎస్‌ఎస్ విభజన అజెండా ప్రకారమే మోదీ మాట్లాడారని ఆరోపించారు. దేశంపై ఏకరూపతను రుద్దేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రధాన మంత్రి సంకుచిత బుద్ధిని వదులుకుంటారని అనుకున్నప్పుడల్లా ఆయన నిరాశపరుస్తున్నారని ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా అన్నారు.

రాహుల్ గాంధీ సీటుపై వివాదం

ఎర్రకోట వద్ద స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఐదో వరుసలో సీటు కేటాయించడాన్ని కాంగ్రెస్ పార్టీ తప్పుపట్టింది. 'చిన్న బుద్ధి ఉన్న వారి నుంచి పెద్ద పనులు ఆశించడం వ్యర్థమే. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ఐదో వరుసలో కూర్చునేలా చేయడం ద్వారా మోదీ తన ఫ్రస్ట్రేషన్‌ను చాటుకున్నారు.' అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనేత్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.



దుండగుల దాడిలో ధ్వంసమైన పరికరాలు, ఫర్నీచర్

అర్ధరాత్రి అట్టుడికిన బెంగాల్

- జూనియర్ డాక్టర్ హత్యాచారంపై మహిళల నిరసన
- ఆర్‌జీ దవాఖానలో అర్ధరాత్రి దుండగుల విధ్వంసం
- పోలీసులపై రాళ్లు.. 9 మంది నిందితుల అరెస్టు

కోల్‌కతా, ఆగస్టు 15: కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ దవాఖానలో జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనపై అర్ధరాత్రి పశ్చిమబెంగాల్ అట్టుడికింది. 'స్వాతంత్ర్యం వచ్చిన అర్ధరాత్రి మహిళల స్వాతంత్ర్యం కోసం' అంటూ నిర్వహించిన ఆందోళన హింసాత్మకంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల మహిళలు అర్ధరాత్రి నిరసన వ్యక్తం చేశారు. నిరసనకారులుగా పేర్కొంటూ సుమారు 40 మంది గుంపు గురువారం అర్ధరాత్రి ఆర్‌జీ కార్ హాస్పిటల్‌లోకి చొరబడి విధ్వంసం సృష్టించారు. దవాఖాన ప్రాంగణంలోకి చేరుకున్న ఆందోళనకారులు ఎమర్జెన్సీ విభాగాన్ని, నర్సింగ్ స్టేషన్, మందుల స్టోర్, సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. అక్కడ విధి నిర్వహణలో ఉన్న పోలీసులపైకి రాళ్లు రువ్వారు. ఆందోళనకారులను అదుపుచేయడానికి పోలీసులు బాష్పవాయువును ప్రయోగించారు. తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. విధులలో ఉన్న తమకు రక్షణ కల్పించాలంటూ నర్సులు ఆందోళన చేశారు. తాము చేస్తున్న ఆందోళనను నైతికంగా దెబ్బతీయడానికే దవాఖానపై దాడి చేశారని, అయితే న్యాయం కోసం తమ ఆందోళన కొనసాగుతుందని డాక్టర్లు స్పష్టం చేశారు.

మమత రాజీనామా చేయాలి

హింసాత్మక ఘటనలకు బాధ్యత వహిస్తూ మమతా బెనర్జీ సీఎం పదవికి రాజీనామా చేయాలని విపక్ష బీజేపీ డిమాండ్ చేసింది. డాక్టర్ మృతికి నిరసగా కాళీఘాట్‌లోని సీఎం ఇంటి ముందు శుక్రవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తామని బీజేపీ మహిళా విభాగం ప్రకటించింది. ఆందోళన చేస్తున్న డాక్టర్లకు రక్షణ కల్పించడంలో, హింసను నిరోధించడంలో మమత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పరిస్థితిని మమత ప్రభుత్వం అదుపు చేయలేకపోతే ఆర్మీని దింపాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సుకాంత మజుందార్ డిమాండ్ చేశారు.

స్తంభించిన వైద్య సేవలు..

జూనియర్ డాక్టర్ హత్యాచారం కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నాయి. గత ఏడు రోజుల నుంచి ఆరోగ్య సేవలు స్తంభించగా, తమ సహచర విద్యార్థినికి న్యాయం చేయాలంటూ జూనియర్ డాక్టర్లు ఆందోళన కొనసాగిస్తున్నారు. చాలా ప్రభుత్వ దవాఖానలలో ఇప్పటికే ఔట్ పేషంట్, అత్యవసర సేవలు నిలిచిపోవడంతో సేవలందక రోగులు అల్లాడుతున్నారు. కాగా, దవాఖానను గురువారం సందర్శించిన గవర్నర్ బోస్ ఆందోళన చేస్తున్న జూనియర్ డాక్టర్లతో మాట్లాడారు.

రాష్ట్రంలో అశాంతిని సృష్టించడానికే: మమత

రాష్ట్రంలో అశాంతిని సృష్టించడానికి సీపీఐ(ఎం), బీజేపీ ఈ విధ్వంసానికి పాల్పడ్డాయని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. తాను ఈ విషయంలో విద్యార్థులు, ఆందోళన చేస్తున్న డాక్టర్లను తప్పుబట్టడం లేదని అన్నారు. ఆర్‌జీ కార్ దవాఖానలో విధ్వంసం సృష్టించింది బయటివారేనని ఆమె అన్నారు. బాధిత మహిళా డాక్టర్‌కు న్యాయం జరగాలంటూ శుక్రవారం తాను వీధుల్లోకి రానున్నట్టు ఆమె ప్రకటించారు.



'అగ్ని మిస్సైల్ మ్యాన్' అగర్వాల్ కన్నుమూత

హైదరాబాద్, ఆగస్టు 15: అగ్ని క్షిపణి పితామహుడిగా గుర్తింపు పొందిన ఆర్‌ఎన్ అగర్వాల్ (84) గురువారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన నేతృత్వంలో 1983లో అగ్ని క్షిపణి తయారీ ప్రోగ్రాంను భారత్ మొదలుపెట్టింది. ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి సామర్థ్యం కలిగిన దేశాల సరసన భారత్‌ను నిలపటంలో ఆయన కృషి ఉంది. ప్రస్తుతం అత్యంత శక్తివంతమైన క్షిపణి 'అగ్ని-5' రేంజ్ 5వేల కిలోమీటర్లు. అగ్ని మిస్సైల్ మ్యాన్‌గా, అగ్నివాల్‌గా ఆయన గుర్తింపు పొందారు. భారత ప్రభుత్వం ఆయనను పద్మభూషణ్‌తో సత్కరించింది. అగ్ని, పృథ్వీ, ఆకాశ్, నాగ్, త్రిశూల్ క్షిపణి తయారీ 'ఐజీఎండీపీ'లో ఆయన పాలుపంచుకున్నారు.

గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీగా 'మంకీపాక్స్'

వాషింగ్టన్, ఆగస్టు 15: ఆఫ్రికా దేశాల్లో 'మంకీపాక్స్' వైరస్ వ్యాప్తి అత్యంత ఆందోళనకర స్థాయికి చేరుకుందని, ఇక్కడి పరిస్థితి అంతర్జాతీయంగా ఆందోళన కలిగించే విధంగా ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ప్రకటించింది. గ్లోబల్ పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీని విధిస్తున్నట్టు తాజాగా హెచ్చరికలు జారీచేసింది. ఈ నేపథ్యంలో భారత్ సహా 196 సభ్య దేశాలు అంతర్జాతీయ ఆరోగ్య నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. డబ్ల్యూహెచ్‌వో సభ్య దేశాలకు అత్యున్నత స్థాయి ప్రమాద హెచ్చరికను జారీచేసింది. డబ్ల్యూహెచ్‌వో చీఫ్ టెడ్రోస్ అధనోమ్ మాట్లాడుతూ, 'ఎమర్జెన్సీ కమిటీ సూచన మేరకు గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటిస్తున్నాం' అని అన్నారు. వ్యాధి సోకితే తీవ్రమైన కండరాల నొప్పి, జ్వరం వస్తాయి.

స్వేచ్ఛ, స్వాతంత్ర్యం విలువను

బంగ్లా పరిణామాలు గుర్తుచేశాయ్

సీజేఐ డీవై చంద్రచూడ్

న్యూఢిల్లీ, ఆగస్టు 15: మనకు లభించిన స్వాతంత్ర్యం, స్వేచ్ఛ ఎంతో ముఖ్యమైనవని, ఈ హక్కుల విలువ ఏమిటో ఇటీవల మన పొరుగున ఉన్న బంగ్లాదేశ్‌లో జరిగిన పరిణామాలు మనకు గుర్తు చేస్తున్నాయని సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు. ఇటీవల బంగ్లాదేశ్‌లో హింసాత్మక ఘటనల నేపథ్యంలో ఆ దేశ ప్రధాని హసీనా రాజీనామా చేసి దేశాన్ని వదిలిపెట్టి వెళ్లగా, ఆ దేశంలో మైనారిటీగా ఉన్న హిందువులపై విస్తృతంగా దాడులు జరుగుతున్న క్రమంలో సీజేఐ ఈ వ్యాఖ్యలు చేశారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం సుప్రీం కోర్టు ప్రాంగణంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. బంగ్లాదేశ్‌లో ప్రస్తుత పరిణామాలు మనకు స్వేచ్ఛ ఎంత విలువైనదో తెలియజేస్తున్నాయని అన్నారు.

గిన్నిస్‌కెక్కిన జాతీయ గీతాలాపన



న్యూఢిల్లీ, ఆగస్టు 15: జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామీ విజేత రిక్కీ కేజ్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ గీతాలాపన గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కింది. యూకేకు చెందిన 100 మందితో కూడిన రాయల్ ఫిలార్మోనిక్ ఆర్కెస్ట్రా, మన దేశానికి చెందిన హరిప్రసాద్ చౌరాసియా, రాకేశ్ చౌరాసియా, రాహుల్ శర్మ, అమాన్, అయాన్ అలీ బంగాశ్, రాహుల్ శర్మ, జయంతి కుమరేశ్, షేక్, కలీషాబి మహబూబ్, గిరిధర్ ఉడుప వంటి సంగీతవేత్తలు కలిసి జాతీయ గీతానికి సంగీతాన్ని ఇచ్చారు. కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌కు చెందిన 14 వేల మంది ఆదివాసీ చిన్నారులు భారతదేశ చిత్రపటం, భారత్ అనే అక్షరక్రమంలో నిల్చొని జాతీయ గీతాలాపన చేశారు. ఈ వీడియోను రిక్కీ కేజ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

నర్సుపై లైంగికదాడి, హత్య

లక్నో: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం ఘటన మరువక ముందే యూపీలో ఒక నర్సు సైతం హత్యాచారానికి గురయ్యారు. ఉత్తరాఖండ్‌లోని ఒక ప్రైవేట్ దవాఖానలో పనిచేస్తున్న నర్సు జూలై 30న ఇంటికి చేరుకోలేదు. 8 రోజుల తర్వాత ఆగస్టు 8న తన ఇంటికి 1.5 కి.మీ దూరంలోని దిబ్డిబా గ్రామంలో యూపీ పోలీసులు ఆమె మృతదేహాన్ని గుర్తించారు. ఆమె తన నివాస భవనంలోకి వెళ్తుండగా, దాడి చేసి పొదల్లోకి లాక్కుపోయానని, తర్వాత లైంగిక దాడి జరిపి హత్య చేసినట్టు నిందితుడు అంగీకరించాడు.

ఉద్యోగినులకు నెలసరి సెలవు

ఒడిశా ప్రభుత్వం నిర్ణయం

భువనేశ్వర్, ఆగస్టు 15: ఒడిశాలో ఉద్యోగినులకు ఒకరోజు నెలసరి సెలవును ఇవ్వనున్నట్టు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రవతి పరిదా ప్రకటించారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పని చేసే ఉద్యోగినులు వేతన చెల్లింపుతో కూడిన నెలసరి సెలవును తీసుకోవచ్చని పేర్కొన్నారు. అయితే, ఈ సెలవు ఐచ్ఛికమని తెలిపారు. కటక్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమానికి హాజరైన తర్వాత ఆమె ఈ ప్రకటన చేశారు. మహిళ రుతు చక్రంలోని మొదటి లేదా రెండో రోజు ఈ సెలవు తీసుకోవచ్చని వెల్లడించారు.

ఒత్తిడితో వైద్య విద్యార్థుల చిత్తు

- నలుగురిలో ఒకరికి మానసిక సమస్యలు
- ముగ్గురిలో ఒకరికి ఆత్మహత్య ఆలోచనలు
- ఎన్‌ఎంసీ టాస్క్‌ఫోర్స్ సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ, ఆగస్టు 15: వైద్య విద్యార్థులు విపరీతమైన ఒత్తిడితో చిత్తవుతున్నారని, మానసిక సమస్యల బారిన పడుతున్నారని జాతీయ మెడికల్ కమిషన్(ఎన్‌ఎంసీ) నివేదిక పేర్కొన్నది. ప్రతి నలుగురు ఎంబీబీఎస్ విద్యార్థుల్లో ఒకరు మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారని, ప్రతి ముగ్గురు పీజీ విద్యార్థుల్లో ఒకరిలో ఆత్మహత్య ఆలోచనలు కూడా వచ్చాయని తెలిపింది. ఎన్‌ఎంసీ ఏర్పాటుచేసిన 'నేషనల్ టాస్క్‌ఫోర్స్ ఫర్ మెంటల్ హెల్త్ అండ్ వెల్‌బీయింగ్' వైద్య విద్యార్థులపై ఏప్రిల్ 26 నుంచి మే 6 వరకు ఒక ఆన్‌లైన్ సర్వే నిర్వహించింది. ఇందులో 25,590 మంది అండర్ గ్రాడ్యుయేట్, 5,337 మంది పీజీ వైద్య వైద్యార్థులు, 7,035 మంది అధ్యాపకులు పాల్గొన్నారు. యూజీ విద్యార్థుల్లో 27.8 శాతం, పీజీ విద్యార్థుల్లో 15.3 శాతం మంది తాము మానసిక సమస్యలను ఎదుర్కొంటున్నట్టు స్వచ్ఛందంగా తెలిపారని ఈ నివేదిక పేర్కొన్నది.

విద్యార్థుల్లో ఆత్మహత్యల ఆలోచనలు

యూజీ విద్యార్థుల్లో 16.2 శాతం మంది, పీజీ విద్యార్థులు 31.2 శాతం మందికి ఆత్మహత్య ఆలోచనలు వచ్చినట్టు ఈ నివేదిక తెలిపింది. గత ఏడాదిలో 564 మంది పీజీ విద్యార్థులు తాము ఆత్మహత్య చేసుకునేందుకు ప్రణాళికలు వేసుకున్నామని, 237 మంది పీజీ విద్యార్థులు ఆత్మహత్యకు ప్రయత్నించామని సైతం సర్వేలో ఒప్పుకున్నట్టు ఈ నివేదిక పేర్కొన్నది. ఇలాంటి ఆలోచనలు ఉన్న వారిలో కొందరు మానసిక వైద్య సహాయాన్ని ఆశిస్తుండగా, ఇంకొందరు వద్దనుకుంటున్నారు.

సర్వేలో తేలిన మరిన్ని అంశాలు

- 45 శాతం మంది పీజీ విద్యార్థులు వారానికి 60 గంటలకు పైగా పని చేస్తున్నామని చెప్పారు.
- 56 శాతం మంది పీజీ విద్యార్థులు తమకు వారాంతపు సెలవులు లభించడం లేదని తెలిపారు.
- 9.7 శాతం మంది ఎంబీబీఎస్ విద్యార్థులు, 18 శాతం మంది పీజీ విద్యార్థులు తాము ర్యాగింగ్‌కు గురైనట్టు చెప్పారు.
- 41.6 శాతం మంది ఎంబీబీఎస్ విద్యార్థులు హాస్టళ్లలో సౌకర్యాల పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఎన్‌ఎంసీ చేసిన కీలక ప్రతిపాదనలు

వైద్య విద్యార్థులు మానసికంగా ఒత్తిడికి గురవుతున్న నేపథ్యంలో ఎన్‌ఎంసీ పలు కీలక ప్రతిపాదనలు చేసింది.

- రెసిడెంట్ డాక్టర్లు వారానికి 74 గంటల కంటే ఎక్కువ పని చేయొద్దు. వారానికి ఒక రోజు కచ్చితంగా సెలవు తీసుకోవాలి.
- వైద్య విద్యార్థులు సెలవు అడిగినప్పుడు పరిగణనలోకి తీసుకోవాలి. అకారణంగా తిరస్కరించొద్దు.
- పీజీ విద్యార్థులు, ఇంటర్న్స్ ప్రధానంగా అభ్యసించడానికే ఉన్నారు కానీ సిబ్బంది కొరత తీర్చడానికి కాదు అనేది గుర్తించాలి.
- విద్యార్థులపై ఒత్తిడి, ఆందోళన తగ్గించడానికి సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణను అమలు చేయాలి.
- యూజీ, పీజీ సిలబస్‌లో మానసిక వైద్య విద్యను సైతం భాగం చేయాలి. వర్క్‌షాప్‌లు, సదస్సులు నిర్వహించాలి.
- మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు విద్యార్థులకు యోగా తరగతులు, క్రీడలు నిర్వహించాలి.

అదానీని ఆదుకొందాం!

- బంగ్లా సంక్షోభంతో అదానీ పవర్‌కు ఇబ్బందులు
- అధికార మార్పిడితో విద్యుత్తు డీల్‌పై నీలినీడలు
- ఇప్పటికే గొడ్డా ప్లాంట్‌లో విద్యుదుత్పత్తి షురూ
- రంగంలోకి ఎన్డీయే సర్కారు.. నిబంధనల మార్పు
- బంగ్లాకు ఇవ్వాల్సిన కరెంటు.. ఇకపై దేశీయ గ్రిడ్‌లకు..
- అంతర్జాతీయ పత్రిక 'రాయిటర్స్'లో సంచలన కథనం
- ఆప్తమిత్రుడికి లబ్ధి చేకూర్చడానికేనని సర్వత్రా విమర్శలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): అదానీ గ్రూప్ కంపెనీకి చెందిన అదానీ పవర్‌కు మేలు చేసేలా కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం విద్యుత్తు సవరణలు చేసింది. పొరుగు దేశం బంగ్లాదేశ్‌లో నెలకొన్న రాజకీయ సంక్షోభం అంతిమంగా అదానీ పవర్‌కు ఇబ్బందిగా మారడంతో సదరు కంపెనీ నష్టపోకుండా 2018లో తీసుకొచ్చిన రెగ్యులేటర్స్ సప్లయింగ్ ఎలక్ట్రిసిటీ నిబంధనలను కేంద్రం హడావుడిగా మార్చేసింది. సవరణలతో కూడిన మెమోను ఆగస్టు 12న విద్యుత్తుశాఖ జారీ చేసింది. ఈ మేరకు అంతర్జాతీయ పత్రిక 'రాయిటర్స్' ఓ సంచలన కథనంలో వెల్లడించింది.

అసలేం జరిగింది?

జార్ఖండ్‌లోని గొడ్డాలోని 1600 మెగావాట్ల సామర్థ్యం ఉన్న పవర్ ప్లాంట్‌లో ఉత్పత్తి అయ్యే మొత్తం విద్యుత్తును బంగ్లా కొనుగోలు చేసేలా అదానీ పవర్ సంస్థ 2015 ఆగస్టులో బంగ్లాదేశ్‌లోని అప్పటి షేక్ హసీనా ప్రభుత్వంతో ఒక ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు అక్కడ రాజకీయ సంక్షోభంతో పవర్ డీల్‌పై నీలినీడలు కమ్మాయి. దీంతో కేంద్రంలోని ఎన్డీయే సర్కారు జోక్యం చేసుకొంది. 2018లో చేసుకొన్న ఒప్పందంలోని నిబంధనలను మార్చేసింది. గొడ్డాలోని అదానీ పవర్ ప్లాంట్.. దేశీయ గ్రిడ్లకు విద్యుత్తు సరఫరా చేసుకోవచ్చని కొత్త మెమో ఇచ్చింది. ఈ మేరకు రాయిటర్స్ వెల్లడించింది. అయితే, అదానీని ఆదుకొనేందుకే కేంద్రం ఈ నిబంధనలను పక్షపాతపూరితంగా మార్చేసిందని పలువురు విమర్శిస్తున్నారు.



డీల్‌పై సర్వత్రా విమర్శలు

బంగ్లాదేశ్‌తో అదానీ కంపెనీ చేసుకొన్న పవర్ డీల్‌పై కూడా అప్పట్లో పెద్దయెత్తున విమర్శలు వచ్చాయి. ఈ ఒప్పందం కుదరడానికి ప్రధాని నరేంద్రమోదీ సాయపడ్డారన్న ఆరోపణలూ ఉన్నాయి. 2015 జూన్‌లో మోదీ బంగ్లాదేశ్‌లో పర్యటించారు. దౌత్య, వాణిజ్య సంబంధాల బలోపేతం పేరిట ఆ దేశంతో 4.5 బిలియన్ డాలర్ల ఒప్పందం కుదుర్చుకొన్నారు. పరిశ్రమలు స్థాపించి స్థానిక యువతకు ఉపాధి కల్పిస్తామని అప్పటి ఆ దేశ ప్రధాని షేక్ హసీనాకు హామీనిచ్చారు. అయితే, దీనికి ప్రతిగా జార్ఖండ్ గొడ్డాలోని అదానీ పవర్ ప్లాంట్ నుంచి విద్యుత్తును కొనుగోలు చేయాలని, అదానీకి చెందిన విద్యుదుత్పత్తి, ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ కంపెనీలను బంగ్లాలో స్థాపించేందుకు అనుమతినివ్వాలని మోదీ మెలికపెట్టినట్టు వార్తలు వచ్చాయి. కాగా, ఈ డీల్‌తో తాము నష్టపోతున్నట్టు గత ఏడాది బంగ్లాదేశ్ పవర్ డెవలప్‌మెంట్ బోర్డ్ (బీపీడీ) అదానీ కంపెనీకి ఓ లేఖ రాసింది.

ఉక్రెయిన్ ఆధీనంలో రష్యా పట్టణం

- మిలిటరీ కార్యాలయం ఏర్పాటు
- ప్రకటించిన అధ్యక్షుడు జెలెన్‌స్కీ



సడ్జాలో ధ్వంసమైన ఒక ప్రాంతం

కీవ్, ఆగస్టు 15: రష్యా - ఉక్రెయిన్ యుద్ధం కీలక మలుపు తిరిగింది. రష్యా భూభాగంలోని కుర్స్క్ ప్రాంతంలో ఉన్న సడ్జా పట్టణాన్ని తమ బలగాలు పూర్తిగా ఆధీనంలోకి తీసుకున్నాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ గురువారం ప్రకటించారు. ఈ పట్టణంలో దాదాపు 5,000 జనాభా ఉన్నారు. పశ్చిమ సైబీరియా చమురు నిక్షేపాల నుంచి ప్రవహించే పైప్‌లైన్లు ఈ ప్రాంతంలోనే ఉన్నాయి. సడ్జా పట్టణంలో ఉక్రెయిన్ సైనిక కమాండర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు జెలెన్‌స్కీ ప్రకటించారు. కాగా, జనవరి నుంచి ఉక్రెయిన్‌లోని 1,175 చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని రష్యా ఆక్రమించగా, ఇప్పుడు మొదటిసారిగా రష్యా భూభాగంలోని దాదాపు 800 చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని ఉక్రెయిన్ ఆక్రమించిందని వాషింగ్టన్ కేంద్రంగా పని చేసే ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది స్టడీ ఆఫ్ వార్ తెలిపింది.

నార్డ్ స్ట్రీమ్ పైప్‌లైన్ పేలుళ్ల వెనుక ఉక్రెయిన్?

రష్యా - యూరోప్ మధ్య ఉండే నార్డ్ స్ట్రీమ్ సహజ వాయువు పైప్‌లైన్‌ల పేలుళ్ల వెనుక ఉక్రెయిన్ బలగాలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మేరకు వాల్‌స్ట్రీట్ జర్నల్‌లో ఒక కథనం ప్రచురితమైంది. దీని ప్రకారం.. ఉక్రెయిన్‌పైకి రష్యా దండెత్తిన తర్వాత రష్యాను దెబ్బతీసేందుకు గానూ ఆ దేశం నుంచి యూరోప్ వెళ్లే నార్డ్ స్ట్రీమ్ 1, నార్డ్ స్ట్రీమ్ 2 పైప్‌లైన్లను పేల్చేయాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి ఓ వ్యాపారవేత్త సూచించారు. ఈ మేరకు 2022 మేలో ఈ ప్రణాళిక అమలు చేయడానికి జెలెన్‌స్కీ ఆమోదం తెలిపారు. అయితే, ఈ విషయం అమెరికా నిఘా సంస్థ సీఐఏకి తెలిసి, ప్రణాళికను విరమించుకోవాలని కోరడంతో జెలెన్‌స్కీ వెనక్కు తగ్గారు. తర్వాత సెప్టెంబర్‌లో జెలెన్‌స్కీకి సంబంధం లేకుండానే అప్పటి ఉక్రెయిన్ సైనికాధికారి జలుజ్నీ ఒక ప్రణాళిక రచించి బాల్టిక్ సముద్రంలో పైప్‌లైన్లను పేల్చేయించారు. కాగా, ఈ వార్తలను ఉక్రెయిన్ ఖండించింది. పైప్‌లైన్ పేలుళ్లలో తమ ప్రమేయం లేదని పేర్కొన్నది.

గాజాలో మృత్యుఘోష

- 40 వేలు దాటిన మృతుల సంఖ్య
- పార్కులు, వీధుల్లో శవాల ఖననం

న్యూఢిల్లీ: ఇజ్రాయెల్ - హమాస్ యుద్ధంలో మృతుల సంఖ్య 40,000 దాటిపోయింది. మృతదేహాలను ఖననం చేయడానికి కుటుంబ సభ్యులు నానా కష్టాలు పడుతున్నారు. గాజా స్ట్రిప్‌లోని డెయిర్ అల్-బలాహ్ శ్మశాన వాటికలో సూర్యోదయం నుంచి సమాధుల తవ్వకాలు ప్రారంభమవుతున్నాయి. ప్రస్తుతం ఉన్న సమాధులను కూడా తెరచి, అంతస్థులుగా సమాధులను నిర్మిస్తున్నారు.

2 శాతం మంది మృతి..

గాజాలో మరణించిన వారి మృతదేహాలను ఇండ్ల పెరడు, మెట్ల క్రింద, రోడ్డు పక్క పార్కింగ్ లాట్స్‌లో ఖననం చేస్తున్నారు. గాజా స్ట్రిప్‌లో యుద్ధానికి ముందు ఉన్న జనాభాలో దాదాపు 2 శాతం మంది మరణించారని అధికారులు చెప్తున్నారు. వాస్తవంగా మరణించినవారి ఖననం చేసిన తేదీ, ఐడెంటిఫికేషన్ నంబర్, ఆ మృతదేహం ఎక్కడ దొరికింది? వంటి వివరాలను రాసి పెడుతున్నారు.

వెనక్కి తగ్గితే దైవాగ్రహం తప్పదు: *ఖమేనీ హమాస్ రాజకీయ చీఫ్ ఇస్మాయిల్ హనియా హత్యతో ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న ఇరాన్ కీలక వ్యాఖ్యలు చేసింది. ఇజ్రాయెల్‌పై దాడి విషయంలో వెనక్కి తగ్గితే దైవాగ్రహానికి గురికాక తప్పదని ఆ దేశ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ సంచలన వ్యాఖ్యలు చేశారు.*



బర్త్ సర్టిఫికెట్ తెచ్చేలోగానే..

ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంలో అనేక విషాదకర సంఘటనలు జరుగుతున్నాయి. తాజాగా జరిగిన దాడిలో నవజాత కవల శిశువులు, వారి తల్లి, అమ్మమ్మ ప్రాణాలు కోల్పోయారు. సెంట్రల్ గాజా స్ట్రిప్, డెయిర్ అల్ బాలాహ్‌లో మంగళవారం ఈ దారుణం జరిగింది. ఆ సమయంలో ఆ బిడ్డల తండ్రి మహమ్మద్ అల్ ఖుమ్సన్ వారి జననాలను నమోదు చేయించి, ధ్రువ పత్రాలను తీసుకొచ్చేందుకు ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లారు. ఆయన ప్రభుత్వ కార్యాలయంలో ఉండగానే వారి పొరుగింటివారు ఆయనకు ఫోన్ చేసి, ''మీ ఇంటి మీద బాంబులు వేశారు'' అని చెప్పారు. దీంతో ఆయన దిగ్భ్రాంతికి గురయ్యారు. తమ బిడ్డల జనన ధ్రువీకరణ పత్రాలను విలేకర్లకు చూపుతూ, గుండెలు అవిసేలా రోదించారు. తమకు అస్సెర్ (బాలుడు), అయిస్సెల్ (బాలిక) శనివారం (ఈ నెల 10న) జన్మించారని, వారితో సంతోషంగా గడపటానికి తనకు సమయం చిక్కలేదని వాపోయారు.

రైతులకు ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలి

- ఎన్నారై విభాగం వ్యవస్థాపక అధ్యక్షుడు కూర్మాచలం



హైదరాబాద్, ఆగస్టు15 (నమస్తే తెలంగాణ): రైతులను మోసగించిన సీఎం రేవంత్‌రెడ్డి వారికి క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ ఎన్నారై విభాగం వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం డిమాండ్ చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావును రాజీనామా చేయాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి చిల్లర విమర్శలు చేశారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో డిసెంబర్ 9 నాడే రుణమాఫీ చేస్తానని మాటిచ్చి, ఆ తర్వాత 100 రోజుల్లోగా అంటూ హామీ ఇచ్చి, మళ్లీ ఆగసస్టు15 వరకు చేస్తామని రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేశారని విమర్శించారు. రాజీనామా హరీశ్‌రావుకు కొత్త కాదని, రైతులకిచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేసి సవాల్‌ను స్వీకరించాలని, గారడీ చేసి తప్పుదోవ పట్టిస్తామనుకుంటే రాబోయే రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



భరత్ (ఫైల్)

బోథ్, ఆగస్టు 15 : అప్పుల బాధతో ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదిలాబాద్ జిల్లాలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన ప్రకారం.. బోథ్ మండలం సాకెర కకు చెందిన జాదవ్ భరత్ (50)కు మూడున్నర ఎకరాలు ఉన్నది. ఇద్దరి కూతుళ్ల పెండ్లిళ్లతోపాటు పంటకు చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురరై గురువారం తన పొలంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు చేను వద్దకు వెళ్లి చూసేసరికి స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే బోథ్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన భార్య విజయబాయి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆవేశంతో రంకెలేస్తే అబద్ధాలు నిజాలైపోవు!

మొదటిపేజీ తరువాయి...

ఆంధ్రప్రదేశ్ చరిత్రలో కానీ, తెలంగాణ చరిత్రలోనూ రేవంత్‌రెడ్డిలా దిగజారిన, దిక్కుమాలిన సీఎం ఇంకెవరూ ఉండరని ఉదహరించారు. అబద్ధం కూడా సిగ్గుపడి మూసీలో దూకి ఆత్మహత్య చేసుకునేలా రేవంత్‌రెడ్డి ప్రవర్తన ఉన్నదని ధ్వజమెత్తారు. దేవుళ్ల మీద ఒట్లు పెట్టుకొని కూడా మాట మీద నిలబడక పోగా, నిస్సిగ్గుగా బీఆర్‌ఎస్‌పై, తనపై అవాకులు చెవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సోనియాగాంధీ పుట్టిన రోజు కానుకగా డిసెంబర్ 9 నాటికి రూ.40 వేల కోట్ల రైతు రుణమాఫీ ఏకకాలంలో చేస్తానని చెప్పింది రేవంత్‌రెడ్డేనని.. అది నెరవేర్చలేక పార్లమెంట్ ఎన్నికల ముందు మరో నాటకానికి తెరలేపారని, ఆగస్టు 15 వరకు రూ.31వేల కోట్లు మాఫీ చేస్తానని అన్నారని వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికల నుంచి పార్లమెంట్ ఎన్నికల సమయానికి రూ.9 వేల కోట్లను కోతపెట్టిన చరిత్ర రేవంత్‌రెడ్డిది అని నిప్పులు చెరిగారు. అప్పటికీ ప్రజలు



నమ్మటం లేదని ఏ ఊరికిపోతే ఆ ఊరి దేవుడిపై ఒట్లు పెట్టాడని గుర్తుచేశారు. సోనియా గాంధీ మీద ఒట్టుపెట్టినా, దేవుళ్ల మీద ఒట్టుపెట్టినా 'అబద్ధమే నా లక్షణం. మోసమే నా విధానం. మాట తప్పడమే నా నైజం' అనే రీతిలో నగ్నంగా తన నిజసర్వరూపాన్ని మరోసారి రేవంత్‌రెడ్డి నిరూపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోసం చేసినట్టు తెలిసిపోయాక ఎవరు రాజీనామా చేయాలి? ఏటిలో దుంకి ఎవరు చావాలి? అని ప్రశ్నించారు.

కేసీఆర్ హయాంలో మొదటి దశకే రూ.17 వేల కోట్లు

కేసీఆర్ నాయకత్వంలో బీఆర్‌ఎస్ సర్కారు మొదటి దఫాలో 35 లక్షల మంది రైతులకు రూ.1 లక్ష రుణమాఫీ చేశామని, అప్పుడు రూ.17 వేల కోట్లు అయ్యిందని హరీశ్‌రావు గుర్తుచేశారు. అదే, కాంగ్రెస్ ప్రభుత్వం నిజంగా రూ.2 లక్షల రుణమాఫీ చేస్తే 22 లక్షల మంది రైతులే ఉంటారా? వారికి రూ.17,869 కోట్లు మాత్రమే అవుతాయా? అని ప్రశ్నించారు.

దేవుడా.. రేవంత్ తప్పులు తెలంగాణకు శాపంగా మారొద్దు

'రేవంత్‌రెడ్డి నువ్వు రైతు ద్రోహానికి మాత్రమే కాదు, దైవ ద్రోహానికీ పాల్పడ్డావు' అనే విషయాన్ని విస్మరించకూడదు అని హరీశ్‌రావు పేర్కొన్నారు. సీఎంగా ఉండి దేవుళ్ల మీద ఒట్టుపెట్టి మాట తప్పి చేసిన అపచారానికి వెంటనే ప్రాయశ్చిత్తం చేసుకోవాలని సీఎంకు సూచించారు. రేవంత్‌రెడ్డికి వికారమే తప్ప సంస్కారం లేదని విమర్శించారు. సీఎం స్థాయిలో రేవంత్ మాట తప్పినందుకు ఆ దేవుళ్లు తెలంగాణ మీద ఎక్కడ ఆగ్రహిస్తారోనని ఆవేదన వ్యక్తంచేశారు. రేవంత్‌రెడ్డి చేసిన పాపఫలితం ప్రజలకు ఎక్కడ శాపంగా మారుతుందోనని ఆందోళన వ్యక్తంచేశారు. రేవంత్ చేసిన తప్పులకు, దైవ ద్రోహానికి తెలంగాణపై ఆగ్రహించవద్దని ముక్కోటి దేవుళ్లను వేడుకున్నారు. రేవంత్‌రెడ్డి ఏ దేవుళ్ల మీద ఒట్టు పెట్టి మాట తప్పాడో.. ఆ దేవాలయాలకు త్వరలో తాను స్వయంగా వెళ్లి దేవుళ్లను ప్రార్థిస్తానని పేర్కొన్నారు.

రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలకోరు!

- రైతులనే కాదు దేవుళ్లనూ మోసం చేసిండు
- అరకొర రుణమాఫీతో అబద్ధాల మాటలు
- వేముల ప్రశాంత్‌రెడ్డి ధ్వజం



హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాల కోరు అని, రైతులనే కాదు దేవుళ్లను కూడా మోసం చేస్తున్నాడని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ధ్వజమెత్తారు. డిసెంబర్ 9నే రైతులందరికీ ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తానన్న ఆయన మళ్లీ 100 రోజుల్లో చేస్తానన్నాడని అప్పుడూ చేయలేదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని దేవుళ్లందరిపై ప్రమాణం చేసి ఆగస్టు 15లోపు రైతులందరికీ రూ.31 వేల కోట్లతో రెండు లక్షల చొప్పున రుణమాఫీని ఏకకాలంలో చేస్తానని చేయలేదని ఆరోపించారు. ఇప్పటివరకు కేవలం రూ.17,934 కోట్లు మాత్రమే మాఫీ చేశారని, 36 లక్షల మంది రైతులుంటే కేవలం 22 లక్షల మందికే రుణమాఫీ చేస్తూ రైతులనే కాదు దేవుళ్లనూ మోసం చేశాడని ధ్వజమెత్తారు. రుణమాఫీపై మాజీ మంత్రి హరీశ్‌రావు చాలెంజ్ విసిరితేనే ఆ మేరకు అమలు చేశారని పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీలు, 13 హామీలు ఆగస్టు 15లోపు అమలు చేస్తే రాజీనామా చేస్తానని నాడు హరీశ్‌రావు ప్రకటించారని గుర్తుచేశారు. ఆరు గ్యారెంటీలు, 13 హామీలు, రుణమాఫీని అమలు చేయకుండానే దబాయిస్తున్నాడని, నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నాడని విమర్శించారు. రైతులకు అరకొర రుణమాఫీ చేసి అబద్ధపు మాటలు మాట్లాడుతున్నాడంటూ విమర్శించారు. రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేయాలని, లేకుంటే రేవంత్‌కు దేవుళ్లు, ప్రజలు, రైతులు తగిన శాస్తి చేస్తారని హెచ్చరించారు.

రేవంతే ముక్కునేలకు రాయాలి: ఓయూ జేఏసీ చైర్మన్ కరాటే రాజునాయక్

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే తన పదవికి రాజీనామా చేసి అమరవీరుల స్థూపం వద్ద ముక్కు నేలకు రాయాలని ఓయూ జేఏసీ చైర్మన్ కరాటే రాజునాయక్ డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆరు గ్యారెంటీల్లో భాగమైన 420 హామీలను 100 రోజుల్లో అమలు చేస్తామని ప్రగల్భాలు పలికిన రేవంత్‌రెడ్డి సీఎం పదవికి అనర్హుడని గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్‌కు స్పందించి, ఆగస్టు 15 నాటికి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రెండు లక్షల రుణమాఫీ సహా ప్రజలకు ఇచ్చిన ఇతర అన్ని హామీలను అమలు చేస్తానని గత పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రగల్భాలు పలికి ఇప్పుడు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు మోసం చేసినట్టేనని తెలిపారు.

హరీశ్‌రావుపై సీఎం వ్యాఖ్యలు సిగ్గుచేటు: బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి



రుణమాఫీ విషయంలో మాజీ మంత్రి హరీశ్‌రావును ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు సిగ్గుచేటని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్నాననే విషయం మరిచిన రేవంత్‌రెడ్డి ఓ బజారు వ్యక్తిలా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. పంద్రాగస్టులోపు ఆరు గ్యారెంటీల అమలు, రైతులందరికీ రుణమాఫీ చేస్తే తాను రాజీనామా చేస్తానని హరీశ్‌రావు స్పీకర్‌కు రాసిన లేఖలో స్పష్టం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. దేవుళ్లందరి మీద ఒట్టుపెట్టి మాట తప్పింది రేవంత్‌రెడ్డేనని తెలిపారు. రూ.31 వేల కోట్లను ఆగస్టు 15లోపు మాఫీ చేస్తానని చెప్పి కేవలం రూ.18 వేల కోట్లతో సరిపెట్టి దానికే ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావును విమర్శించే నైతిక హక్కులేదని పేర్కొన్నారు. ఏట్లో దూకాల్సింది హరీశ్‌రావు కాదని, మాట తప్పినందుకు రేవంతే దూకాలని డిమాండ్ చేశారు.

రుణమాఫీ పూర్తిచేశాం

- 2 లక్షల్లోపు రుణాల కోసం 18 వేలకోట్లు జమ
- నిరుద్యోగులకు ఇక ఏటా 60 వేల ఉద్యోగాలు
- రెండేండ్లలో సీతారామ ప్రాజెక్టు పూర్తిచేస్తాం
- సవాలుకు కట్టుబడి హరీశ్‌రావు రాజీనామా చేయాలి
- వైరా బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ఖమ్మం, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ములకలపల్లి/అశ్వాపురం/కొణిజర్ల: రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ పూర్తిచేశామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా భద్రాద్రి జిల్లా ములకలపల్లి మండలం పూసుగూడెం వద్ద నిర్మించిన రెండో పంపుహౌస్‌ను గురువారం ప్రారంభించారు. అనంతరం ఖమ్మం జిల్లా వైరాలో రూ.2 లక్షల రుణమాఫీని ప్రారంభించి మాట్లాడారు. రూ.2 లక్షల రైతుల రుణమాఫీకి సంబంధించి రూ.18 వేల కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్టు తెలిపారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో రైతులకు రూ. 2 లక్షల్లోపు రుణమాఫీ చేస్తామని రాహుల్ గాంధీ ప్రకటించిన ప్రకారం అర్హులందరికీ రుణమాఫీ చేశామని వివరించారు. సీతారామ ప్రాజెక్టును 2026 ఆగస్టు 15 నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. ఖమ్మం జిల్లా ప్రజలకు మున్నేరు నుంచి తాగునీటిని అందించేందుకు మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ వద్ద 15 టీఎంసీల సామర్థ్యంతో వీరభద్రుడి రిజర్వాయర్ నిర్మిస్తామని ప్రకటించారు. ఇప్పటికే 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని, ఇకపై ఏటా 60 వేల ఉద్యోగాలు ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలిపారు.

హరీశ్ రాజీనామా చెయ్

ఆగస్టు 15 నాటికి రుణమాఫీ పూర్తిచేస్తే శాసన సభ్యత్వానికి రాజీనామా చేస్తానని సవాలు విసిరిన హరీశ్‌రావు వెంటనే రాజీనామా చేయాలని రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రం నుంచి 8 మంది ఎంపీలు గెలిచినా ఈ రాష్ట్రానికి బీజేపీ గాడిద గుడ్డు ఇచ్చిందని విమర్శించారు. సీతారామ సహా ఎస్‌ఎల్‌బీసీ, పాలమూరు ఎత్తిపోతల పథకాలను పూర్తి చేసే బాధ్యత తమదేనని పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం నాడే ప్రాజెక్టును ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధం

అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు వద్ద తొలి పంపుహౌస్‌ను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ములకలపల్లి మండలం కమలాపురం వద్ద మూడో పంపుహౌస్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టులతోపాటు ఏ ప్రభుత్వ హయాంలో ఎంత అభివృద్ధి జరిగిందో చర్చించాలన్న బీఆర్‌ఎస్ సవాళ్లకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

వామపక్ష నాయకుల నిరసన

భద్రాద్రి జిల్లాకు చెందిన సీతారామ ప్రాజెక్టు సాగునీటిని తొలుత ఈ జిల్లాకు ఇచ్చాకే ఇతర జిల్లాలకు తరలించాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. పోడు భూములకు పట్టాలలివ్వాలని కోరుతూ ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం గుబ్బగుర్తి అటవీ ప్రాంత రైతులు సీఎం సభలో నినాదాలు చేశారు. పట్టాలు ఇవ్వాలని నినాదాలు చేశారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. దీంతో వారు పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. తమ సమస్య సీఎం దృష్టికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఐదు నిమిషాలే ఎత్తిపోసిన ఒకటో పంపుహౌస్

భద్రాద్రి జిల్లాలోని సీతారామ ప్రాజెక్టులో ముఖ్యమంత్రి, మంత్రులు గురువారం ప్రారంభించిన పంపుహౌసుల్లో ఒకటి కేవలం ఐదు నిమిషాలు మాత్రమే గోదావరి నీటిని ఎత్తిపోసింది. మిగతా రెండు గంటకు పైగానే నీటిని లిఫ్ట్ చేశాయి. సీతారామ ప్రాజెక్టు ఎత్తిపోతల పథకంలో తొలుత భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు వద్ద ఒకటో పంపుహౌస్‌ను మంత్రి కోమటిరెడ్డి ప్రారంభించారు. ఇది కేవలం ఐదు నిమిషాలు మాత్రమే గోదావరి నీటిని ఎత్తిపోసి ఆ తరువాత ఆగిపోయింది. పూసుగూడెం, కమలాపురం పంపుహౌస్‌లు మాత్రం గంటకు పైగానే నీటిని ఎత్తిపోశాయి.



బీఆర్‌ఎస్ భద్రాద్రి జిల్లా కార్యాలయం వద్ద ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావును అరెస్టు చేస్తున్న పోలీసులు

బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేల అరెస్టు

రేగా, హరిప్రియను పీఎస్‌కు తరలించిన భద్రాద్రి పోలీసులు

పోలీసుల వాహనాన్ని అడ్డుకున్న పార్టీ శ్రేణులు.. స్వల్ప ఉద్రిక్తత

కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 15: సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనను పురస్కరించుకొని పినపాక, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, హరిప్రియ సహా బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులను భద్రాద్రి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. భద్రాద్రి జిల్లాలోని పినపాక నియోజకవర్గంలో కేసీఆర్ నిర్మించిన సీతారామ ప్రాజెక్టు నీళ్లను పినపాక, ఇల్లెందు నియోజకవర్గాలకు ఇవ్వకుండా ఖమ్మం జిల్లా మంత్రులు వారి నియోజకవర్గాలకు తరలించుకు వెళ్తుండటాన్ని నిరసిస్తూ రేగా కాంతారావు, హరిప్రియ గురువారం ఆందోళనకు పిలుపునిచ్చారు. భద్రాద్రి జిల్లా ములకలపల్లి మండలం పూసుగూడెం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించే సీతారామ ప్రాజెక్టు రెండో పంపుహౌస్ ప్రారంభోత్సవాన్ని బీఆర్‌ఎస్ నేతలు అడ్డుకుంటారనే ఆలోచనతో భద్రాద్రి జిల్లా పోలీసులు గురువారం వీరిని ముందస్తు అరెస్టు చేశారు. బీఆర్‌ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడిగా ఉన్న రేగా కాంతారావు.. జిలా కేంద్రమైన కొత్తగూడెంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో గురువారం ఉదయం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం పార్టీ కార్యాలయం నుంచి బయటకు వస్తున్న రేగా కాంతారావు, హరిప్రియ సహా బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులను పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. ఎందుకు అరెస్టు చేస్తున్నారో చెప్పాలంటూ డీఎస్పీ రెహమాన్‌ను ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో నిరసన చేసే హక్కు లేదా అంటూ నిలదీశారు. అయినప్పటికీ వారి మాటలను పోలీసులు పట్టించుకోకుండా బలవంతంగా అరెస్టు చేశారు. హరిప్రియను మహిళా పోలీసులు ముందుకు నెట్టేసి మరీ పోలీసు వాహనంలోకి ఎక్కించారు. బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, నాయకుల అరెస్టుకు నిరసనగా పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పోలీసుల వాహనాలకు అడ్డుగా నిలబడి ఆందోళన వ్యక్తంచేశారు. దీంతో పార్టీ కార్యాలయం వద్ద కొంత ఉద్రిక్తత నెలకొన్నది. కార్యకర్తలను పోలీసులు నెట్టేసి మాజీ ఎమ్మెల్యేలను, బీఆర్‌ఎస్ నేతలను కొత్తగూడెం వన్ టౌన్, సుజాతనగర్ పోలీసుస్టేషన్లకు తరలించారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ సీతాలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేందర్, చుంచుపల్లి మాజీ ఎంపీపీ శాంతి, నాయకులు రాజశేఖర్, భాస్కర్‌రావు, అనుదీప్, తపస్వి, గిరిబాబు, సత్యనారాయణ, కృష్ణ, లక్ష్మణ్, రమణ, నరసింహారావు, రామారావు, రవి ఉన్నారు.

ఇల్లెందులో న్యూడెమోక్రసీ నేతల అరెస్టు

ఇల్లెందు రూరల్ : సీతారామ ప్రాజెక్టు నీళ్లను ఇల్లెందు ఏజెన్సీకి ఇవ్వకుండా మైదాన ప్రాంతాలకు తరలించుకుపోతుండటాన్ని నిరసిస్తూ సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నేతలు భద్రాద్రి జిల్లా ఇల్లెందులో గురువారం ఆందోళన చేపట్టారు. పోలీసులు.. నిరసనకారులను అరెస్టు చేశారు. ఎన్డీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అవునూరి మధు సహా ఆ పార్టీ నేతలు తుపాకుల నాగేశ్వరరావు, కొక్కు సారంగపాణి, నాయకులు నందగిరి వెంకటేశ్వర్లు, తోడేటి నాగేశ్వరరావును అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు.



ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియను నెట్టుకొని వెళ్తున్న మహిళా పోలీసులు

రాష్ట్రానికి పట్టిన చీడ రేవంత్

- నోరు తెరిస్తే అబద్ధాలు, అవాస్తవాలే
- ఇంత అసభ్య సీఎం దేశంలోనే లేరు
- సీతారామకు 7,400 కోట్లు ఖర్చుచేసింది కేసీఆర్ ప్రభుత్వమే
- 8 నెలల్లో రూ.75 కోట్ల నిధులతో ఏ ప్రాజెక్టు అయినా పూర్తయితదా?
- ప్రజలను మభ్యపెట్టడం కదరదు
- రుణమాఫీకి తొలుత 40 వేల కోట్లు అని చెప్పి చేసింది 17 వేల కోట్లే
- హరీశ్‌రావు నీ మెడలు వంచి రుణమాఫీ చేయించిండు
- రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫైర్



తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సబితాఇంద్రారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, టీఎస్‌ఎండీసీ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్

హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణకు పట్టిన చీడ, పీడ సీఎం రేవంత్‌రెడ్డి అని బీఆర్‌ఎస్ జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆయన నోరు తెరిస్తే అబద్ధాలు, అవాస్తవాలేనని, ఇంత అసభ్య సీఎం దేశంలో మరొకరు లేరని విమర్శించారు. 30 వేల ఉద్యోగాలపై, సీతారామ ప్రాజెక్టుపై సీఎం, మంత్రులవి అన్ని అబద్ధాలేనని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో భాక్రానంగల్ ప్రాజెక్టు కట్టింది కాంగ్రెస్ అంటున్నారు.. అసలు తెలంగాణలో ఆ ప్రాజెక్టు ఉన్నదా? అని నిలదీశారు. సీఎం రేవంత్‌రెడ్డి పొద్దట్నుంచి అన్ని చోట్లా బూతులు మాట్లాడారని, ఆయన భాషను చూసి ప్రజలంతా సిగ్గుతో తలదించుకుంటున్నారని మండిపడ్డారు. అధికారులు కూడా సీఎం అబద్ధాలను చూసి సిగ్గుపడుతున్నారని ఫైరయ్యారు. తెలంగాణభవన్‌లో గురువారం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, టీఎస్‌ఎండీసీ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. 10 లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వాలనే లక్ష్యంతో సీతారామ ప్రాజెక్టు పనులు మొదలుపెట్టింది.. పైసలు ఇచ్చింది.. నిర్మించింది కూడా కేసీఆర్ ప్రభుత్వమేనని స్పష్టంచేశారు. కానీ, రూ.75 కోట్లతో చిన్న చిన్న పనులు జరిపి ప్రాజెక్టు మొత్తం తామే కట్టామని కలరింగ్ ఇవ్వడమేమిటని రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. 9 నెలల్లో ప్రాజెక్టు పూర్తిచేస్తే అది వరల్డ్ రికార్డు అవుతుందని ఎద్దేవా చేశారు. సీతారామ మీరే కడితే మరి కొడంగల్ లిఫ్ట్ ప్రాజెక్టు పనుల్లో ఇప్పటి వరకు తట్టెడు మన్ను ఎందుకు తీయలేదు? అని నిలదీశారు. దుమ్ముగూడెం ప్రాజెక్టును కేసీఆర్ ఆపాలంటే ఆపారని సీఎం అబద్ధాలు చెప్తున్నారని, ఆ ప్రాజెక్టు మొదలుపెడితే ఖమ్మం జిల్లా దుమ్ము కొట్టుకుపోయేదని మండిపడ్డారు. కృష్ణా నీరు వర్షాలకు వచ్చింది తప్ప మంత్రులు తెచ్చివని కావని, తాము తెచ్చినట్టు చెప్పుకోవడానికి సిగ్గుండాలని మండిపడ్డారు. ప్రజలను మభ్యపెట్టాలని చూస్తే చెల్లదని స్పష్టంచేశారు.

రైతు రుణమాఫీపై సీఎంది పెద్దమోసం

రైతు రుణమాఫీపై సీఎం రేవంత్‌రెడ్డిది అతి పెద్ద మోసమని పల్లా విమర్శించారు. 'రాష్ట్రంలో 44 లక్షల మంది రైతుల రుణమాఫీకి రూ.40 వేల కోట్లు అవుతుందని తొలుత రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆ తర్వాత రూ.31 వేల కోట్లు అన్నారు. ఇప్పుడు వేసింది రూ.17 వేల కోట్లు మాత్రమే' అని మండిపడ్డారు. నిబంధనల సాకుతో సగం మందిపైగా రైతులను తీసివేసి 22.34 లక్షల మంది (46 శాతం)కి మాత్రమే రుణమాఫీ చేసి రైతులను ఉద్ధరించినట్టు రేవంత్‌రెడ్డి ప్రగల్భాలు పలకడం తగదని హితవు పలికారు. రేవంత్‌రెడ్డి మీద నమ్మకం లేకే రుణమాఫీ సంబురాలకు రాహుల్‌గాంధీ రాలేదని ఎద్దేవా చేశారు. హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచి రుణమాఫీ చేయించారని చెప్పారు. దేవుడి మీద ఒట్లు లేకపోతే తిట్లు అనేది సీఎం వైఖరిగా మారిందని మండిపడ్డారు. రైతు రుణమాఫీ రూ.2 లక్షలతోపాటు 100 రోజుల్లో ఆరు గ్యారెంటీల్లోని 13 హామీలను ఆగస్టు 15లోగా అమలుచేస్తే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని హరీశ్‌రావు అసెంబ్లీ సాక్షిగా, అమరవీరుల స్థూపం సాక్షిగా ప్రకటించారని గుర్తుచేస్తూ ఆ నాటి రాజీనామా లేఖను మీడియాకు చూపించారు. సగం మంది రైతులకే రుణమాఫీ చేశారని, ఆరు గ్యారెంటీల్లోని కొన్ని హామీలే నెరవేర్చి హరీశ్‌రావును రాజీనామా కోరడం రేవంత్‌రెడ్డి దిగజారుడుతనానికి నిదర్శనమని ఫైరయ్యారు. 'హరీశ్‌రావు ఏడుసార్లు ఎమ్మెల్యే. ఉద్యమంలో రెండుసార్లు పదవికి రాజీనామా చేశారు. ఉద్యమంలో రేవంత్‌రెడ్డి ఎక్కడున్నారు?' అని నిలదీశారు. రేవంత్ భాషను పశువులు కూడా సహించవని, చిల్లర, చిచోరా భాషను మాట్లాడేందుకు తమకు సంస్కారం అడ్డు వస్తున్నదని అన్నారు. హరీశ్‌రావును తిడితే ఆకాశం మీద ఉమ్మి వేసినట్టేనని విమర్శించారు. ఉడత ఊపులకు భయపడబోమని చెప్పారు. ఇచ్చిన హామీలన్నీ అమలయ్యే దాకా సీఎంను వదిలిపెట్టబోమని బీఆర్‌ఎస్ పక్షాన నిలదీస్తూనే ఉంటామని హెచ్చరించారు.

> రూ.75 కోట్లతో చిన్న చిన్న పనులు జరిపి ప్రాజెక్టు మొత్తం తామే కట్టామని కలరింగ్ ఇవ్వడమేమిటి రేవంత్? 9 నెలల్లో ప్రాజెక్టు పూర్తిచేస్తే అది వరల్డ్ రికార్డు అవుతుంది. సీతారామ కాంగ్రెస్ సర్కారే కడితే మరి కొడంగల్ లిఫ్ట్ ప్రాజెక్టు పనుల్లో ఇప్పటివరకు తట్టెడు మన్ను ఎందుకు తీయలేదు? రైతు రుణమాఫీ రూ.2 లక్షలతోపాటు 100 రోజుల్లో ఆరు గ్యారెంటీల్లోని 13 హామీలను ఆగస్టు 15లోగా అమలుచేస్తే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని హరీశ్‌రావు అసెంబ్లీ సాక్షిగా, అమరవీరుల స్థూపం సాక్షిగా ప్రకటించారు. కానీ ప్రభుత్వం సగం మంది రైతులకే రుణమాఫీ చేసింది. ఆరు గ్యారెంటీల్లోని కొన్ని హామీలే నెరవేర్చి హరీశ్‌రావును రాజీనామా కోరడం రేవంత్‌రెడ్డి దిగజారుడుతనానికి నిదర్శనం. - ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

రుణమాఫీ అంకెల గారడీ: కొత్త ప్రభాకర్‌రెడ్డి

రుణమాఫీ ఓ అంకెల గారడీ అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. హరీశ్‌రావును తిడితే సీఎం తప్పులు ఒప్పులు కావని హితవుపలికారు. గ్రామాల్లో కాంగ్రెస్‌ను ప్రజలు ఛీ కొడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసిందని చెప్పారు. ఏ గ్రామానికి వెళ్లినా ఎక్కడి చెత్త అక్కడే కనిపిస్తున్నదని, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల బారిన పడి ప్రజలు దవాఖానల పాలవుతున్నారని మండిపడ్డారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో నిధులు లేక సిబ్బందికి వేతనాలు కూడా చెల్లించలేని దుస్థితి దాపురించిందని ఆగ్రహం వ్యక్తంచేశారు.

డైవర్షన్ కోసమే రేవంత్ బూతులు: సబిత

44 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పుడు 22.34 లక్షల మందికే కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేసిందని, రుణమాఫీ కానీ మిగతా రైతులు రోడ్డు ఎక్కేందుకు సిద్ధమయ్యారని, వారి దృష్టి మళ్లించేందుకు డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే రేవంత్‌రెడ్డి బూతులు అందుకున్నారని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. రుణమాఫీ పూర్తి చేయనందుకు రేవంత్‌రెడ్డి అమరుల స్థూపం దగ్గర ముక్కు నేలకు రాయాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున కూడా సీఎం రేవంత్ బూతుపురాణం అందుకోవడం సిగ్గుచేటని, ఆయన ఆత్మ విమర్శ చేసుకోవాలని హితవుపలికారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును తిట్టకపోతే రేవంత్‌కు పూట గడవటం లేదని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి ఎన్నితిట్టినా హామీలపై బీఆర్‌ఎస్ నిలదీస్తూనే ఉంటుందని స్పష్టంచేశారు.

దేవుళ్లను మోసంచేసిన ఏకైక సీఎం రేవంత్‌రెడ్డి: కౌశిక్‌రెడ్డి

రూ.31 వేల కోట్ల రుణమాఫీ చేస్తానని దేవుళ్ల మీద ఒట్టువేసి.. రూ.17 వేల కోట్లు మాత్రమే అకౌంట్లలో వేసి దేవుళ్లను సైతం మోసం చేసిన ఏకైక సీఎం రేవంత్‌రెడ్డేనని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి విమర్శించారు. సిగ్గుంటే సీఎం రేవంత్ ముక్కునేలకు రాసి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 2018లో రేవంత్‌ను కొడంగల్‌లో హరీశ్‌రావును చిత్తుచిత్తుగా ఓడించారని గుర్తుచేశారు. హరీశ్‌రావును విమర్శించే స్థాయి రేవంత్‌కు లేదని మండిపడ్డారు. మూసీ కంటే రేవంత్ నోరు కంపు కొడుతున్నదని, ముందు ఆయన నోరును ప్రక్షాళన చేయాలని ఎద్దేవా చేశారు. సీఎం కుర్చీ అని గౌరవం ఇస్తున్నామని, హరీశ్‌రావును నోటికొచ్చినట్టు అంటే సహించబోమని హెచ్చరించారు.

కొనసాగుతున్న సమ్మె

- నేడు నల్లబ్యాడ్జీలతో డాక్టర్ల నిరసన

హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): కోల్‌కతాలో వైద్యవిద్యార్థిని హత్యాచార ఘటనపై జూనియర్ డాక్టర్లు, సీనియర్ రెసిడెంట్ల నిరసనలు కొనసాగుతున్నాయి. దేశవ్యాప్తంగా జూడాలు, రెసిడెంట్ డాక్టర్ల అసోసియేషన్ల జేఏసీ సమావేశం గురువారం జరిగింది. 72 గంటల్లోగా సీబీఐ అధికారులు ఆర్జీకార్ మెడికల్ కాలేజీపై దాడి చేసిన గూండాలను అదుపులోకి తీసుకోవాలని, హాస్పిటల్, మెడికల్ కాలేజీ ఉన్నతాధికారులు నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా టీచింగ్ డాక్టర్లు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపనున్నట్టు ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ గవర్నమెంట్ అసోసియేషన్ మెడికల్ టీచర్స్ విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ కిరణ్ మాదాల తెలిపారు.

కాచిగూడ-తిరుపతి మధ్య రైళ్లు రద్దు

హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ) : కాచిగూడ-తిరుపతి, కాకినాడ-సికింద్రాబాద్, నర్సాపూర్-సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ల మధ్య నడుస్తున్న ఆరు రైళ్లను రద్దు చేసినట్లు గురువారం దక్షిణ మధ్య రైల్వే జోన్ అధికారులు తెలిపారు. ఈనెల 19 వరకు రైళ్ల రద్దు కొనసాగుతుందని పేర్కొన్నారు.

'ఎయిర్ టికెట్'కు రూ. 1.6 కోట్ల బురిడీ

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): నకిలీ క్రెడిట్ కార్డులతో ఎయిర్ టికెట్ సంస్థను దుండగులు రూ. 1.6 కోట్లకు బురిడీ కొట్టించిన ఘటన గురువారం చోటుచేసుకుంది. బంజారాహిల్స్‌లోని ఇండియన్ ఈగల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎయిర్ టికెట్ల విక్రయంలో వినియోగదారులకు ఆన్‌లైన్ సలహాలు, సూచనలిస్తుంది. టికెట్లు విక్రయించిన ఎగ్జిక్యూటివ్‌లకు కమిషన్ ఇస్తుంది. ఈ సంస్థకు చెందిన నితీశ్‌తో దుండగులు చాట్ చేసి వ్యక్తిగత ఫోన్ నంబర్ తీసుకుని ఆయన ద్వారా టికెట్లు కొంటామని చెప్పారు. క్రెడిట్ కార్డులు ఉపయోగించి అభిషేక్, పర్వీజ్ అహ్మద్‌నూర్, మహ్మద్‌హోర, గుండు రాణి తదితరుల పేర్లతో 118 టికెట్లు బుక్ చేశారు. ఇందుకు కమిషన్ రూ.82,500 నితీశ్ ఖాతాలో డిపాజిట్ అయింది. ఈ కార్డులు చోరీ చేసినవని యాజమాన్యం గుర్తించింది. వీటితో బుక్ చేసిన టికెట్లతో సంస్థకు రూ. 1,59,18,900 నష్టం జరిగిందంటూ సంస్థ డైరెక్టర్ రమేశ్ సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేపట్టారు.

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

కోల్‌కతా హత్యాచారం

కోల్‌కతా ప్రభుత్వ వైద్య విద్యాసంస్థ ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజీ హాస్పిటల్ ఆవరణలో అత్యాచారం, ఆపై హత్య జరగడం అత్యంత శోచనీయం. కామాంధుల కర్కశత్వానికి ఓ యువ వైద్యురాలు బలైంది. చట్టాలు పదునెక్కినా దారితప్పిన మగవారి నుంచి మహిళలకు భద్రత లభించని పరిస్థితులు ఇంకా మన సమాజంలో తచ్చాడుతూనే ఉన్నాయని ఈ సంఘటన సూచిస్తున్నది. సమాజం తలదించుకోవాల్సిన ఈ ఘటనపై సహజంగానే తీవ్రస్థాయిలో ప్రతిస్పందనలు వ్యక్తమవుతున్నాయి. దేశవ్యాప్తంగా, ముఖ్యంగా బెంగాల్‌లో నిరసనలు పెల్లుబుకుతున్నాయి. ఒక వ్యక్తి మాత్రమే లైంగికదాడిలో పాల్గొన్నాడని ముందుగా వార్తలు వెలువడ్డాయి. వైద్యపరీక్షల్లో సామూహిక లైంగిక దాడి జరిగినట్టు ఆధారాలు లభించడంతో జనాగ్రహం కట్టలు తెంచుకుంటున్నది. నిరసనలు చాలావరకు శాంతియుతంగానే జరుగుతున్నప్పటికీ అక్కడక్కడా హింసాకాండ చోటుచేసుకున్నది.

ఘటనా స్థలంలో వైద్యులు బీభత్సం సృష్టించడంతో పోలీసులు లాఠీ చార్జీ, బాష్పవాయు గోళాలు ప్రయోగించాల్సి రావడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నది. దాడిలో ఎమర్జెన్సీ వార్డు పూర్తిగా ధ్వంసమైంది. ఈ దాడిలో నేరస్థలంలోని కీలక సాక్ష్యాధారాలకు నష్టం వాటిల్లినట్టు పోలీసులు చెప్తున్నారు. ఈ మొత్తం వ్యవహారంపై రాజకీయాల నీలినీడలు ప్రసరించడం శోచనీయం. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల పాతవైరానికి కొత్త ముడిసరుకుగా ఈ ఘటన మారుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. మమత నేతృత్వంలోని బెంగాల్ ప్రభుత్వానికి ఈ ఉదంతం ఓ అగ్నిపరీక్షలా మారింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి, రాష్ట్రంలోని తృణమూల్ సర్కారుకు మధ్య సంబంధాలు ఉప్పు-నిప్పులా కొనసాగుతున్న నేపథ్యంలో హత్యాచార ఉదంతం ఆ వైరానికి ఆజ్యం పోస్తున్నది. రాష్ట్ర పోలీసులు గడువులోగా కేసును పరిష్కరించకపోతే కేసును సీబీఐకి అప్పగిస్తానని సీఎం మమత ప్రకటించిన నేపథ్యంలో ఆ గడువు కంటే ముందుగానే హైకోర్టు జోక్యంతో కేసు కేంద్ర సంస్థ చేతుల్లోకి పోయింది.

ఈ ఘటన విషయంలో ప్రభుత్వం, పోలీసులు స్పందించిన తీరు, నిరసనకారులతో టీఎంసీ నేతలు వ్యవహరిస్తున్న శైలి ఏ మాత్రం ఆమోదయోగ్యంగా లేదనే విమర్శలు వినవస్తున్నాయి. పోలీసులు సకాలంలో స్పందించలేదనే ఆరోపణలూ వచ్చాయి. చివరికి కేసు కేంద్ర దర్యాప్తు సంస్థ చేతికి వెళ్లడం కీలక మలుపు. దీంతో టీఎంసీ ప్రభుత్వం మొత్తంగా, విశేషించి సీఎం మమత ఆత్మరక్షణలో పడ్డట్టుగా కనిపిస్తున్నది. బెంగాల్‌లో పట్టుకోసం కేంద్రంలోని బీజేపీ సర్కారు దొరికిన ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకోవాలని చూస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ ఉదంతం విషయంలోనూ అదే జరుగుతున్నది. ప్రధాని మోదీ ఎర్రకోట ప్రసంగంలో మహిళలపై జరిగే నేరాలను ప్రస్తావించడం గమనార్హం. జరిగిన ఘటన ఘోరాతిఘోరమైనదనే విషయంలో రెండో అభిప్రాయానికి తావులేదు. ఘటనతో సంబంధమున్న నేరస్థులందరినీ పట్టుకుని, న్యాయస్థానంలో నిలబెట్టి శిక్షలు వేయించాల్సిన అవసరమున్నది. సీబీఐ సకాలంలో పారదర్శకంగా, నిష్పాక్షికంగా దర్యాప్తు జరిపితేనే అది సాధ్యమవుతుంది. మరి సీబీఐకి అలాంటి చరిత్ర ఉన్నదా?

ప్రపంచబ్యాంక్ పడగనీడన తెలంగాణ

స్వాతంత్య్ర దినోత్సవం నాడు గోల్కొండ కోట మీద మువ్వన్నెల జెండా ఎగరవేసాక తన ప్రసంగంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాము ప్రపంచబ్యాంక్ అధ్యక్షుడిని ఇటీవలే కలిసామని, త్వరలోనే ఆ సంస్థ నుండి అప్పులు తీసుకొస్తామని చాలా ఆనందంగా చెప్పారు.

దేశమంతా వలస పాలన నుండి విముక్తి సంబురాలు జరుపుకుంటున్న రోజునే తెలంగాణ పరాధీన అవుతున్నదనే ప్రకటన రావడం ఎంతటి విరోధాభాస?



కొణతం దిలీప్



సరిగ్గా 24 నాలుగేళ్ల క్రితం, ఇదే ఆగస్టు నెలలో ప్రపంచబ్యాంక్ ఆదేశాల మేరకు చంద్రబాబు నాయుడు కరెంటు చార్జీలు పెంచితే, దాన్ని తగ్గించాలని నిరసన వ్యక్తం చేస్తున్న సామాన్య ప్రజలపైకి పేలిన తూటాలు, కారిన రక్తాలు, పోయిన ప్రాణాలు అన్నీ నా కళ్ల ముందు సినిమా రీల్లా గిర్రున తిరిగాయి.

ఆ చంద్రబాబు శిష్యుడు రేవంత్‌రెడ్డి వచ్చీ రాగానే చేస్తున్న ప్రపంచబ్యాంక్ జపం, ఆ సంస్థ నుండి అప్పులు తేవడానికి సిద్ధం చేస్తున్న భారీ ప్రాజెక్టుల వెనుక ఉన్న కుట్రల గురించి తెలంగాణ సమాజం మేలుకోకపోతే జరిగే నష్టం అంతా ఇంతా కాదు.

చంద్రబాబుతో ప్రపంచబ్యాంక్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చేసిన ప్రయోగం వికటించి చివరికి ఆయన పదవే ఊడిపోయాక దాదాపు రెండు దశాబ్దాలు ఈ ప్రాంతంలో పెద్దగా ఆ సంస్థ ఉనికి కనపడలేదు. మరీ ముఖ్యంగా తెలంగాణలో అయితే కేసీఆర్ దృఢ సంకల్పం వల్ల ప్రపంచబ్యాంక్‌ను అడుగుపెట్టనీయలేదు. 2014 నుంచి 2023 మధ్య మౌలిక వసతుల కల్పన కోసం రుణాలు అవసరమైనా దేశీయ బ్యాంకులు, రుణ వితరణ సంస్థల వద్దకే వెళ్ళింది తప్ప ఏనాడూ ప్రపంచబ్యాంక్ రుణాలు తీసుకోలేదు కేసీఆర్ ప్రభుత్వం.

అయితే ప్రపంచబ్యాంక్ నుండి రుణాలు తీసుకుంటే జరిగే నష్టమేమిటో, అసలా రుణాల వెనుక జరిగే కుట్రల కథలేమిటో ఈ తరానికి పెద్దగా అవగాహన లేదు. అందువల్లనే రేవంత్ సర్కార్ వారిని తక్కువ వడ్డీకి రుణాలు వస్తాయని మభ్యపెట్టొచ్చు అనే నమ్మకంతో ఉన్నదనిపిస్తున్నది.

రెండో ప్రపంచ యుద్ధం అనంతరం అస్తవ్యస్తంగా తయారైన ప్రపంచ ఆర్థికవ్యవస్థను గాడిలో పెట్టేందుకంటూ 1944లో అమెరికా ప్రోద్బలంతో మొదలైంది ప్రపంచబ్యాంక్. కానీ అది రానురానూ పేదదేశాల వనరులను దోచి అమెరికా వంటి అగ్రరాజ్యాల, బహుళజాతి కంపెనీల ప్రయోజనాలు నెరవేర్చే సంస్థగా రూపాంతరం చెందింది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు అవసరం ఉన్నా లేకున్నా ఇబ్బడిముబ్బడిగా రుణాలిచ్చి, ఆ దేశాలు అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేయడం. ఇచ్చిన అప్పులతో నడిచే ప్రాజెక్టుల్లో బహుళజాతి కంపెనీలకు, మధ్య దళారులకు ప్రయోజనం కలిగేలా చేయడం ప్రపంచ బ్యాంక్ విధానం. అంతేకాదు రుణాలిచ్చిన దేశాల్లో పాలకులు నియంతలైనా, దుర్మార్గులైనా, అవినీతిపరులైనా ప్రపంచబ్యాంక్ పట్టించుకోదనే విమర్శలున్నాయి. చిలీలో అగస్టో పినోషె, నికరాగువాలో అనస్టాసియో సొమోజా, రొమేనియాలో నికొలాయ్ సీసెస్క్యూ, కాంగోలో మొబుటు, బ్రెజిల్, టర్కీ దేశాల్లో మిలిటరీ నియంతృత్వాలకు ప్రపంచబ్యాంక్ నిస్సిగ్గుగా అండగా నిలబడి అనేక విమర్శలు ఎదుర్కొన్నది.

పేదరిక నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారత వంటి పడికట్టు పదాలతో పేద దేశాలపై వల విసిరే ప్రపంచబ్యాంక్, ఆయా దేశాలు అప్పుల ఊబిలో చిక్కుకోగానే స్ట్రక్చరల్ అడ్జస్ట్‌మెంట్ లోన్‌ల పేరిట ఒక దుర్మార్గమైన పన్నాగం పన్నుతుంది. ఈ లోన్ల కోసం ప్రపంచబ్యాంక్ పేద దేశాల్లో పెట్టిన షరతులు చూడండి - విద్య, వైద్యం, ప్రజారవాణా, విద్యుచ్ఛక్తి తదితర రంగాలను ప్రైవేటుకు అప్పజెప్పాలి; ప్రభుత్వరంగ సంస్థలన్నీ ప్రైవేటీకరణ చేయాలి; నీటిపారుదల మొదలు అన్ని రంగాల్లో యూజర్ చార్జీలు ప్రవేశపెట్టాలి; గనులు బహుళజాతి కంపెనీలకు ధారాధత్తం చేయాలి, మార్కెట్లను బహుళజాతి కంపెనీలకు బార్లా తెరవాలి, ఇలా... ఎన్నో.

ప్రైవేటీకరణ వల్ల ఉద్యోగాలు కోల్పోయిన లక్షలాదిమంది అభాగ్యులు; విద్య, వైద్యం ఖరీదైపోయి దాన్ని కొనలేక పోయిన కోట్లాదిమంది అసహాయులు; బహుళజాతి కంపెనీల మైనింగ్‌తో జరిగిన విధ్వంసం వల్ల గూడు కోల్పోయిన గిరిజనులు; ప్రపంచబ్యాంక్ అప్పుల వలకు చిక్కి నాశనమైన దేశాల్లో ఎక్కడ చూసినా మీకు కనిపించే దృశ్యాలు ఇవే.

1990ల వరకూ కేవలం దేశాలకు మాత్రమే అప్పులు ఇచ్చే ప్రపంచబ్యాంకు చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యాక తొలిసారిగా ఒక రాష్ట్ర ప్రభుత్వానికి అప్పులు ఇవ్వడం ప్రారంభించింది. మిగతా చోట్ల ఉపయోగించిన ఎత్తుగడలే ఆనాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా ఉపయోగించింది వరల్డ్ బ్యాంక్. అనవసరమైన అప్పుల్ని చంద్రబాబు సర్కారుకు ఇవ్వజూపి, బదులుగా ఇక్కడ విద్యుత్ రంగాన్ని, ఇతర ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయించింది. బ్యాంక్ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ బోర్డును ట్రాన్స్‌కో జెన్‌కోగా విభజించి, ఆ తరువాత దశలవారీగా ప్రైవేటుకు అప్పజెప్పే ప్రక్రియను చంద్రబాబు ప్రభుత్వం మొదలుపెట్టింది.

యేటా విద్యుత్ చార్జీలు పెంచాలనే ప్రపంచ బ్యాంక్ షరతును చంద్రబాబు ప్రభుత్వం అమలుజేయడానికి ప్రయత్నించినప్పుడు ప్రజాగ్రహం పెల్లుబికింది. రాష్ట్రమంతటా రాజుకున్న విద్యుత్ చార్జీల వ్యతిరేక ఉద్యమం చివరికి వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో చలో అసెంబ్లీ కార్యక్రమంతో తారాస్థాయికి చేరింది. ఆగస్టు 28, 2000 నాడు అనేక ఆంక్షలను ఛేదించుకుని బషీర్‌బాగ్ చేరుకున్న ఆందోళనకారుల మీద చంద్రబాబు ప్రభుత్వ పోలీసులు విచక్షణారహితంగా కాల్పులు జరపడం వల్ల ముగ్గురు యువకులు మరణించగా అనేక మంది గాయపడ్డారు. ఆనాటి విద్యుత్ చార్జీల వ్యతిరేక ఉద్యమమే ప్రపంచబ్యాంక్ జీతగాడు అనే బిరుదు చంద్రబాబుకు ప్రసాదించింది. చివరికి ఆయన పీఠాన్ని కూకటివేళ్లతో పెకిలించివేసింది.

తెలంగాణ ముఖ్యమంత్రిగా చంద్రబాబు శిష్యుడు రేవంత్ రెడ్డి నియామకం అయిన కొద్ది రోజులకే మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు గురించి మాట్లాడటం మొదలుపెట్టాడు. అయితే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.16,634 కోట్ల అంచనాతో ప్రారంభించిన ప్రాజెక్టును తొలుత అమాంతం మూడు రెట్లు పెంచి రూ.50,000 కోట్లతో చేపడతాం అని ప్రకటించిన రేవంత్ రెడ్డి, మూడు నెలలు గడిచే సరికి ఆ అంచనాను ఏకంగా పది రెట్లకు పెంచి రూ. లక్షా యాభై వేల కోట్లకు చేర్చడంతో తెలంగాణ సమాజం నివ్వెరపోయింది. ఇంతలోనే ఆయన అమెరికా పర్యటనకు బయలుదేరడం, అక్కడ ప్రపంచబ్యాంక్ అధ్యక్షుడితో కలవడం చకచకా జరిగిపోయాయి. ఆ రోజు జరిగిన చర్చల అనంతరం మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు ప్రపంచబ్యాంక్ రుణం తీసుకుంటామని రేవంత్ సర్కారు ప్రకటించింది. ప్రాజెక్టు అంచనాలు కొద్ది నెలల్లోనే పదిరెట్లు పెంచడం, దానికి ప్రపంచబ్యాంక్ రుణం తీసుకుంటాం అని ప్రకటించడం పక్కా కుట్రపూరిత ప్రణాళికతోనే జరిగిందని ఇప్పుడు స్పష్టమవుతున్నది.

రేవంత్ రెడ్డి మొదలుకొని కాంగ్రెస్ నాయకులంతా ప్రపంచబ్యాంక్ రుణాలు తక్కువ వడ్డీకి దొరుకుతాయి అనే అందమైన అర్థసత్యాన్ని పదేపదే వల్లెవేసి తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. కానీ వారు చెప్పని విషయం ఏమిటంటే ప్రపంచబ్యాంక్ వంటి సంస్థల రుణాలు డాలర్ డినామినేషన్లో ఉంటాయి. రూపాయి బలహీనపడ్డ ప్రతిసారీ వడ్డీ సంగతేమో కానీ అసలు మొత్తమే భారీగా పెరుగుతుంది. రుణాలివ్వడానికి ప్రపంచ బ్యాంక్ పెట్టే షరతులతో తెలంగాణను పీల్చి పిప్పి చేయడం ఖాయం. ఇలాంటి రుణాల వల్ల ఎదురయ్యే దుష్పరిణామాల్లో విద్యుత్ చార్జీల పెంపుతో పాటు ఆర్టీసీ ప్రైవేటీకరణ వరకూ ఉండొచ్చు.

స్వతహాగా ప్రగతిశీల భావాలు కలిగిన తెలంగాణ సమాజం, బుద్ధిజీవులు మరోసారి ఈ గడ్డమీదికి ప్రపంచబ్యాంకును, వారి తాబేదార్లను తీసుకురావడానికి ప్రయత్నిస్తున్న రేవంత్ సర్కార్ ప్రయత్నాలను తిప్పికొట్టాలి. తెలంగాణ మరోసారి పరాధీన కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే!

> **స్వతహాగా ప్రగతిశీల భావాలు కలిగిన తెలంగాణ సమాజం, బుద్ధిజీవులు మరోసారి ఈ గడ్డమీదికి ప్రపంచబ్యాంకును, వారి తాబేదార్లను తీసుకురావడానికి ప్రయత్నిస్తున్న రేవంత్ సర్కార్ ప్రయత్నాలను తిప్పికొట్టాలి. తెలంగాణ మరోసారి పరాధీన కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే!**

బీసీలు బలి జీవులేనా..!



మధు యాదవ్ నూకల
63033 43359






తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల వేళ సామాజిక, ప్రజాస్వామిక అభ్యుదయ విధానాలను పథకాల రూపంలో ప్రకటించి తెలంగాణ సమాజాన్ని ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నించింది. బీసీల పట్ల గతంలో చేసిన అనేక తప్పిదాలను సరిదిద్దుకునే ప్రయత్నంగా అవి కనిపించాయి. కానీ, తీరా అందలమెక్కాక ఆ పార్టీ అసలు స్వరూపం బయటపడింది. రాష్ట్రంలో అధికార మార్పు కోరుకున్న ఆ పార్టీ నాయకులు.. ఇచ్చిన హామీలను నెరవేర్చి వెనుకబడిన కులాల జీవితాల్లో మార్పు రావాలని మాత్రం కోరుకోవడం లేదు. కాలేల్కర్ కమిషన్ నుంచి మండల్ కమిషన్ సిఫారసుల అమలు వరకు బీసీల విషయంలో కాంగ్రెస్ అనుసరించిన విధానం క్షమార్హం కానిది.

అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలే నేడు ఆ పార్టీ మెడకు ఉచ్చులా బిగుస్తున్నాయి. ముఖ్యంగా బీసీల ఓట్లు కొల్లగొట్టడానికి ఇచ్చిన హామీలు ఇప్పుడు ప్రభుత్వానికి గుదిబండలా మారుతున్నాయి. అయితే వాటిని నిలబెట్టుకునే విషయంలో ప్రభుత్వ చిత్తశుద్ధి చింతాకుమందం కూడా కనిపించడం లేదు. బీసీలను ఆ పార్టీ ఇప్పటికీ విస్మరిస్తూనే ఉన్నది. అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ల కేటాయింపుతో మొదలైన ఇది కొనసాగుతూనే ఉన్నది. బీసీలకు బీఫాంలు ఇచ్చినా గెలవలేరని.. అగ్రకులాలకే టికెట్లు ఇస్తామన్నట్టు ఆ పార్టీ వ్యవహరించిన తీరును మరువకముందే నామినేటెడ్ పోస్టుల్లోనూ హస్తం పార్టీ వంచించింది. కులగణన, సామాజిక న్యాయం అంటూ రాహుల్‌గాంధీ దేశమంతటా తిరుగుతుండగా.. ఇక్కడి నాయకత్వం మాత్రం బీసీలను అణగదొక్కాలని చూస్తున్నది.

వెనుకబడిన తరగతులకు కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడో బుట్టదాఖలు చేసింది. కులగణన చేపట్టి, బీసీల రిజర్వేషన్లు పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్.. ఎనిమిది నెలలైనా ఆ ప్రక్రియను చేపట్టలేదు. అంతేకాదు, బీసీ కులాల సంక్షేమానికి ఏటా రూ.20 వేల కోట్ల చొప్పున కేటాయిస్తామని చెప్పి బడ్జెట్‌లో రూ.8 వేల కోట్లు మాత్రమే కేటాయించి అసెంబ్లీ సాక్షిగా వంచించింది.

కులవృత్తులకు ప్రతి మండల కేంద్రంలో వృత్తి బజార్లు ఏర్పాటు చేసి, ఉచితంగా షాపులు కేటాయిస్తామని చెప్పి ఇప్పుడు ఏమీ పట్టనట్టు వ్యవహరించడం సరికాదు. బీఆర్‌ఎస్ ప్రారంభించిన గొర్రెల పంపిణీ పథకాన్ని కొనసాగిస్తూనే.. 100 రోజుల్లోపే మరో విడత గొర్రెల పంపిణీ చేస్తామని మాటిచ్చి తీరా అధికారంలోకి వచ్చాక మొత్తం పథకమే విఫలమైందని చేతులెత్తేయడం సబబు కాదు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రుణమాఫీకి సంబంధించి 157 సహకార సంఘాల్లో అవకతవకలు జరిగినట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఈ లెక్కన రుణమాఫీ కూడా విఫలమైందని ప్రభుత్వం ప్రకటించాలి.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు ఆ అంశాన్ని ఎటూ తేల్చకుండానే ఎన్నికలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నది. ఈ నేపథ్యంలో ఉద్యమానికి బీసీలు సమాయత్తమవుతున్నారు. శ్రామిక కులాలన్నీ ఏకమై రోడ్డెక్కే రోజు దగ్గర్లోనే ఉన్నది. బీసీలంతా ఒక్కతాటి పైకి వచ్చిన నాడు రాష్ట్ర ఆర్థిక రంగం పూర్తిగా స్తంభించిపోవడం ఖాయం. కల్లు మండువన గౌడన్నలు, గొర్ల మందన గొల్లకురుమలు, చాకలి రేవున రజకులు, చేపల చెరువున ముదిరాజులు, కొలిమిన కమ్మరులు, మట్టి తట్టా పనుల వద్ద వడ్డెర ఉప్పరివారు.. ఇలా ఎవరికివారు, ఎక్కడికక్కడ సబ్బండ కులాలు ఉద్యమ పిడికిలి బిగించేందుకు సిద్ధంగా ఉన్నాయి. సర్దార్ సర్వాయి పాపన్న, పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య, మారోజు వీరన్న, బెల్లి లలితల వారసత్వాన్ని పుణికిపుచ్చుకొని 'మేమెంతో మాకంత' అంటూ ఆర్థిక, రాజకీయ వాటాలు దక్కే వరకు పార్టీలకతీతంగా బీసీలందరూ ధిక్కారపు స్వరాలుగా నిలవాల్సిన సమయమిది. అమాయక కులాలని, రాజకీయ చైతన్యం లేని వర్గాలని అనుకుంటూ మన వాటాను కూడా పరాన్న జీవుల్లా దండుకుంటున్నవారికి బీసీ కులాల బలమేమిటో చూపించాల్సిన అవసరం ఉన్నది. ఈ నేపథ్యంలో ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను పట్టుబట్టి సాధించుకోవాల్సిన బాధ్యత కూడా బీసీ కులాలపైనే ఉన్నది.





ఇది వారి కుట్రే!

ఆర్జీ కార్ హాస్పిటల్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నా. మేం కూడా గతంలో ఎన్నో ఆందోళనలు చేశాం. కానీ, ఇలా ఎప్పుడూ చేయలేదు. హాస్పిటల్ ధ్వంసంలో విద్యార్థుల పాత్ర ఏమీ లేదు. ఇది బయటివారి పని. టీఎంసీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేపీ, లెఫ్ట్ పార్టీలు కుట్ర పన్నాయి. ఆ పార్టీల జెండాలను నేనూ చూశా.

- మమతా బెనర్జీ, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి

బీఆర్‌ఎస్‌పై కుట్రలు కొత్త కాదు

ఉద్యమమే ఊపిరిగా పురుడుపోసుకున్న.. కోట్లాది మంది తెలంగాణ ప్రజల ఆకాంక్షల ప్రతిరూపమై నిలిచిన.. ప్రత్యేక తెలంగాణ సాధనే ఏకైక లక్ష్యంగా పోరుసలిపిన.. సబ్బండ వర్గాలను, సకల జనులను కదిలించిన.. 'నై తెలంగాణ' అన్నోళ్లతోనే 'జై తెలంగాణ' అనేలా చేసిన పార్టీ గులాబీ పార్టీ. ఉద్యమం నాటి నుంచి పునాదులతో సహా పెకిలించాలని, నామరూపాలు లేకుండా చేయాలని చూసినా.. రాజకీయ ప్రలోభాలతో బలహీనపరచాలని కుట్రలు పన్నినా.. వాటన్నింటినీ తట్టుకుని తన వ్యూహాలతోనే తెలంగాణను సాధించిన పార్టీ బీఆర్‌ఎస్. ఒక్కమాటలో చెప్పాలంటే బీఆర్‌ఎస్ లేకుంటే తెలంగాణే లేదు.



సంపత్ గడ్డం
78933 03516



తెలంగాణ అస్తిత్వ ప్రతీక బీఆర్‌ఎస్‌పై మరోసారి కుట్రలు జరుగుతున్నాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ఉద్యమ పార్టీ చెక్కు చెదరకపోవడం, సంస్థాగతంగా మరింత బలోపేతంగా మారుతుండటంతో 'విలీన' కుతంత్రం తెరపైకి వస్తున్నది. మరో పార్టీలో బీఆర్‌ఎస్ విలీనమవుతుందని కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారు. కానీ, వారి కుట్రలకు ఆదిలోనే అడ్డుకట్ట పడింది. వారు ఎన్నివిధాలుగా విష ప్రచారం చేస్తున్నా ప్రజలు ఉద్యమ పార్టీ వైపే మొగ్గు చూపుతున్నారు. రెండు జాతీయ పార్టీల కుట్రలను తిప్పికొడుతున్నారు.

గులాబీ పార్టీ అంటేనే ప్రజల పార్టీ. అది అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా నిత్యం ప్రజల కోసం కొట్లాడుతూనే ఉంటుంది. మొన్నటికి మొన్న మేడిగడ్డ కుంగిందని సాకులు చెప్తూ కాంగ్రెస్ పాలకులు గోదావరి జలాలను సముద్రం పాలుచేస్తుంటే.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు మేడిగడ్డను సందర్శించి కాళేశ్వరం జలాల ఎత్తిపోత షురూ చేయించారు. ఈ విధంగా పదునైన ప్రశ్నించే గొంతుక బీఆర్‌ఎస్ ప్రజాపక్షం వహిస్తూ.. పాలకులకు ముచ్చెమటలు పట్టిస్తుండటంతోనే విలీనమంటూ కొంత మంది ఇలా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు.

పది ఎంపీ స్థానాలివ్వండి, తెలంగాణ శక్తి ఏమిటో చూపిస్తానని పార్లమెంట్ ఎన్నికల వేళ కేసీఆర్ పదే పదే చెప్పారు. అప్పుడు ఆయన మాటలను తెలంగాణ సమాజం సరిగ్గా అర్థం చేసుకోలేదు. ఫలితంగా కేంద్ర బడ్జెట్‌లో మనకు తీవ్ర అన్యాయం జరిగింది. రెండు జాతీయ పార్టీలను నెత్తిన పెట్టుకున్నా తెలంగాణకు ఒరిగిందేమీ లేదు. 16 మంది ఎంపీలున్నా ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు. అదే సమయంలో ప్రాంతీయ పార్టీలైన టీడీపీ, జేడీయూల అండతో సంకీర్ణ సర్కారును ఏర్పాటు చేసిన మోదీ.. ఏపీ, బీహార్‌లకు కాసుల వర్షం కురిపించారు. బీఆర్‌ఎస్‌ను కాదనుకొని మనల్ని మనమే మోసం చేసుకున్నామని దీన్ని బట్టే అర్థం చేసుకోవాలి. నాడైనా, నేడైనా, భవిష్యత్తులోనైనా తెలంగాణ ప్రయోజనాల కోసం పోరాడేది గులాబీ పార్టీయే. మరోవైపు 'కేంద్రంతో సఖ్యతగా లేకుంటే నిధులెలా వస్తా యి?' అని అప్పట్లో రాద్ధాంతం చేసిన రేవంత్.. సీఎం అయ్యాక మోదీని పెద్దన్నగా సంబోధిస్తూ భుజానికెత్తుకున్నారు. అయినప్పటికీ శూన్యహస్తమే మిగిలింది. రెండు జాతీయ పార్టీల లక్ష్యం అధికారమే తప్ప తెలంగాణ ప్రయోజనాలు కాదు. ప్రాంతీయ పార్టీల్లో బలమైన శక్తిగా ఉన్న బీఆర్‌ఎస్‌ను ఎదగనీయకుండా చేయాలన్నదే రెండు పార్టీల కుట్ర. అయినా కేసీఆర్‌కు ఇలాంటి కుట్రలను ఎదుర్కోవడం కొత్తేం కాదు. సామాన్యులను అసామాన్యులుగా తీర్చిదిద్దిన నాయకత్వం కేసీఆర్‌ది.

తెలంగాణ గొంతుక బీఆర్‌ఎస్ అధికారానికి దూరమవడంతో అవకాశవాదులు తెలంగాణపై పెత్తనం చెలాయించేందుకు మళ్లీ ఉవ్విళ్లూరుతున్నారు. పదేండ్లలో విశ్వనగరంగా మారిన హైదరాబాద్, సహజ సంపదల గని తెలంగాణపై కుట్రలు మొదలయ్యాయి. తెలంగాణలో టీడీపీ పూర్వవైభవం కోసం అర్రులు చాస్తున్న చంద్రబాబు మాటలే అందుకు నిదర్శనం. ఇప్పటికైనా తెలంగాణవాదులు సంఘటితం కావాలి. లేదంటే అవకాశవాద రాజకీయాలకు తెలంగాణ వేదికగా మారే ప్రమాదం ఉన్నది.

తెలంగాణ రాష్ట్ర సాధనే తన అంతిమ లక్ష్యమంటూ, త్యాగానికి సిద్ధపడి తెలంగాణను కేసీఆర్ సాధించారు. అరిగోస పడి సా ధించుకున్న తెలంగాణను పాలకుడిగా సుసంపన్నం చేశారు. సంక్షేమం, అభివృద్ధిని జోడెడ్లలా పరుగులు తీయించారు. త్యాగాల ఫలితంగా వచ్చిన తెలంగాణ ఇప్పుడు కుక్కలు చింపిన విస్తరిగా మారే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నది.

తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే ఎజెండాగా సాగుతున్న కేసీఆర్ నాయకత్వంపై దుష్ప్రచారం చేసి, అబద్ధపు హామీలిచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలన్నింటినీ పాలకులు ఇప్పుడు మరిచారు. నాడు రారాజులా బతికిన రైతులు నేడు తిప్పలు పడుతున్నారు. వరికి బోనస్ బోగస్‌గా మారింది. రుణమాఫీ మాయాజాలంతో లక్షల మంది రైతులు బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రతీ పల్లె కేసీఆర్‌ను గుర్తు చేసుకుంటున్నది.

కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయిన సాధారణ ప్రజలే కాదు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కూడా కేసీఆర్ నాయకత్వాన్ని మెచ్చుకుంటున్నారు. మోత్కుపల్లి నర్సింలు, బక్క జడ్సన్ సహా చాలామంది నేతలు కేసీఆరే తెలంగాణ రక్షకుడని చెప్తున్నారు. నిరుద్యోగులను రెచ్చగొట్టి, సోషల్ మీడియాలో అబద్ధపు ప్రచారం చేసిన కొందరు ఇప్పుడు కేసీఆర్‌ను తల్చుకుంటున్నారు. నాడు కాంగ్రెస్ రెచ్చగొట్టిన నిరుద్యోగులే నేడు ఆ పార్టీ ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తున్నారు. ప్రజాభవన్ ముందు కంచెలు తొలగించామని గప్పాలు కొట్టిన కాంగ్రెస్ సర్కార్ నేడు తెలంగాణ అంతటా పదునైన ముళ్ల కంచెలను వేసింది. ఈ నేపథ్యంలో కేసీఆర్‌ను కాదనుకొని తప్పు చేశామనే భావన సబ్బండ వర్గాల్లో వ్యక్తమవుతున్నది.

ఈ నేపథ్యంలో అవకాశవాదులకు తెలంగాణలో చోటిస్తే తెలంగాణకు నష్టం జరుగుతుంది. వ్యక్తులను మోసే పార్టీలకు కాకుండా.. తెలంగాణ ప్రయోజనాలే పరమావధిగా పని చేసే బీఆర్‌ఎస్‌ను ఆదరించాల్సిన అవసరమున్నది. తెలంగాణ ఉనికికి, అస్తిత్వానికి ముప్పు ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో సబ్బండవర్గాలు కేసీఆర్ వెంట నడవాలి.

గూగుల్ గూగ్లీ పిక్సెల్ 9 సిరీస్



బ్రాండ్ అంటే క్రేజీగా ఫీల్ అవ్వని అబ్బాయిలు ఉండరు.. అమ్మాయిలైతే అసలు చెప్పనక్కర్లేదు. బ్యాండ్ బజాయించేస్తారు. అందుకే మొబైల్ కంపెనీలు తమ బ్రాండ్ ఫోన్లను సరికొత్త ఫీచర్లతో నిత్యం అప్‌డేట్ చేస్తూ మార్కెట్‌లో సందడి చేస్తుంటాయి. ఆ సందడి ఇప్పుడు గూగుల్ చేస్తున్నది. 'మేడ్ బై గూగుల్' అంటూ పిక్సల్ ఫోన్లు, ఇతర ఉత్పత్తుల విశేషాల్ని టెక్ ప్రియులకు పరిచయం చేసింది. వాటిలో ముందుగా మాట్లాడుకోవాల్సింది 'పిక్సల్ 9 సిరీస్' ఫోన్ల గురించే. యాపిల్‌కి పోటీగా ఆండ్రాయిడ్ ఓఎస్‌తో ఎప్పటి నుంచో మొబైల్ యూజర్లకు దగ్గరైంది. దాదాపు ఎనిమిదేండ్ల తర్వాత మస్తీ ఈవెంట్‌తో ఈ ఫోన్‌లోని ఫీచర్లను పరిచయం చేసింది.

పిక్సల్ 9, పిక్సల్ ప్రో, పిక్సల్ ప్రో ఎక్సెల్.. ఇవే మూడు మోడళ్లు. మొదటి రెండు ఫోన్‌లు 6.3 అంగుళాల తెరతో ముస్తాబైతే.. ప్రో ఎక్సెల్ మాత్రం 6.8 అంగుళాల స్టైలిష్ లుక్‌తో సిద్ధమైంది. ప్రాసెసింగ్ వేగాన్ని.. బ్యాటరీ మన్నికను పెంచేస్తూ ఫోన్లలో 'జీ4 టెన్సర్ చిప్' సెట్ వాడారు. అంతేకాదు.. రానున్న ఏడేండ్ల పాటు ఓఎస్ అప్‌డేట్స్‌ని ఫోన్లలో పొందొచ్చు. ఇక ఫోన్ కెమెరా విషయానికొస్తే.. మొదటి రెండు ఫోన్లలో 50ఎంపీ (మెయిన్), 49 ఎంపీ (అల్ట్రా వైడ్), ప్రో ఎక్సెల్ మాడల్ మరోటి (48ఎంపీ టెలీఫొటో) జతచేసి మొత్తం మూడు కెమెరాలతో ఫొటోగ్రఫీ ప్రియుల మదిని దోచుకునే ప్రయత్నం చేశారు. 5ఎక్స్ వరకూ దీంతో జూమ్ చేసి ఫొటోలు తీయొచ్చు. వీటి ప్రారంభ ధర సుమారు రూ.79,900.



శ్రావణ శుక్రవారం సందడి. ఇంటింటా కోలాహలం.
ఓ ముచ్చటైన ముత్తయిదువ అక్కడికొచ్చింది... వ్రతం పనుల్లో
తలమునకలైన ఆ ఇంటి ఇల్లాలితో మాటకలిపింది..
'ఏమ్మా వరలక్ష్మి బాగున్నావా?' అంది పెద్దావిడ.
'నా పేరు అది కాదమ్మా' అన్నది ఆ ఇల్లాలు..

నీవేనమ్మా.. వరలక్ష్మి



'**అష్టలక్ష్ములను** ఆవాహన చేసుకున్న అసలు లక్ష్మి అచ్చంగా నువ్వే. నువ్వేమిటి... మన స్త్రీ జాతి అంతా లచ్చుమమ్మలే! ఆ మాటకొస్తే నేనూ వరలక్ష్మినే.. ఏ ఇంట నువ్వు నవ్వుతుంటావో... అక్కడ ఉండేది నేనే! నీ నవ్వుల్లోనే కాదు.. నీలోనూ నేనున్నా!! 'అదెలా..?' అంటావేమో.. అయితే విను..

నేను శ్రావణ వరలక్ష్మిని. ఏడాదికోసారి ఇలా వచ్చి అలా వెళ్లిపోతాను. కానీ, అవనిలోని ఆడ కూతుళ్లంతా నా ప్రతిరూపాలే! ఆ మాటకొస్తే నా అసలు రూపాలే!!

యుగాల నుంచి అతివలను చూస్తున్నా కదా! స్త్రీ సాధికారతను ఏ నాగరికతా సహించలేదు. అందుకే పేరుమోసిన నాగరికతలన్నీ కథల్లో శిథిలాల్లా మిగిలిపోయాయి.

మీ తరాన్ని చూస్తుంటే మాత్రం ఈ వరలక్ష్మికి ముచ్చటేస్తుంది! ఎంతలా ఎదిగిపోతున్నారో!!

చదువుల్లో మీరే టాపు.
ర్యాంకుల్లో మీదే గ్రాపు.
కొలువుల్లో రాణిస్తున్నారు.
కోర్టుల్లో వాదిస్తున్నారు.
చట్ట సభల్లోనూ కోటా కొట్టేశారు.
ఎంత ఎత్తుకు ఎదిగినా..
అమ్మగా మీకు మీరే సాటి.
బిడ్డగా అమ్మకు వరం.. నాన్నకు భాగ్యం.

ఈ తరం లక్ష్ములు సాధించిన విజయాలు ఎన్నని చెప్పమంటావ్!

పారిస్‌లో మన భారత కీర్తి పతాకను రెండుసార్లు రెపరెపలాడించిన మను బాకర్ విజయలక్ష్మి అంశ అనకుండా ఎలా ఉండగలను.

అధ్యక్ష పోరులో టెంపరి ట్రంప్‌ను ఢీ కొడుతున్న కమలా హారిస్ ఎన్నికల్లో గెలిస్తే... అమెరికా ఆది లక్ష్మి కాకుండా ఉంటుందా!

గగనాంతర రోదసిలోకి దూసుకుపోయిన వ్యోమగామిని సునీతా విలియమ్స్ ధైర్యలక్ష్మికి ప్రతిరూపమే!!

వయనాడ్ విధ్వంసంలో వారధి కట్టి.. ఎందరో బిడ్డల ప్రాణాలను కాపాడిన మేజర్ సీతా అశోక్ షెల్కేను సంతాన లక్ష్మిగా ఆరాధించొచ్చు.

భారత సైన్యానికి చెందిన వైద్యసేవల విభాగం డైరెక్టర్ జనరల్‌గా ఎంపికైన సాధనా సక్సేనా.. ఆరోగ్యాన్ని అనుగ్రహించే గజలక్ష్మికి ప్రతినిధి!!

సేంద్రియ సాగులో దేశానికి దిక్సూచిగా నిలిచి, మేలు రకం దేశీయ వంగడాలను జాతికి పునరంకితం చేస్తున్న రహీబాయి పోపెరే ధాన్యలక్ష్మికి నిండురూపం.

చదువే ఆడపిల్లకు అలంకారం అని, ఆఫ్గన్ వీధుల్లో, ఐక్యరాజ్య సమితి సదస్సుల్లో ఎలుగెత్తి చాటిన ధీశాలి మలాలా విద్యాలక్ష్మికి వారసురాలే కదా!

కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూ, ఉద్యోగాలు చేస్తూ... పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పుతూ... ఇంటిని నడిపిస్తున్న ఇల్లాలు అచ్చంగా ధనలక్ష్మే!!

ఈ అష్టలక్ష్ములను ఆవాహన చేసుకున్న వరలక్ష్మమ్మలు మీరే! మన ఆడబిడ్డలే!! అందుకే, ఈ శ్రావణ శుక్రవారం మీకే అభినందన వాయనం ఇస్తున్నా...'

'ఇస్తినమ్మా వాయనం...' అంది వరలక్ష్మి
'పుచ్చుకుంటిమమ్మా... నీ ఆశీర్వాదం'.. అన్నది ఆ ఇంటి వరలక్ష్మి.

దివ్యాంగులతో జట్టుకట్టి..

మిట్టీ కేఫ్ మొదలుపెట్టి!

దివ్యాంగులను చూసి మానవత్వం ఉన్నవారంతా జాలిపడటం సహజం. కానీ వారిలోని ప్రతిభను గుర్తించి ఉపాధి కల్పించడం మాత్రం అలీనాకే సాధ్యమైంది. దివ్యాంగులను ఉద్యోగులుగా, ఆంత్రప్రెన్యూర్లుగా చూడాలన్నది ఆమె సంకల్పం. అందుకోసం 'మిట్టీ కేఫ్' నెలకొల్పింది. ఒక్క కేఫ్‌తో ప్రారంభమైన ప్రయాణం దేశమంతటా విస్తరించి ఓ సామ్రాజ్యంగా ఎదిగింది. ఈ అద్భుత విజయానికి పునాదులు వేసింది బెంగళూరుకు చెందిన అలీనా ఆలమ్.

దివ్యాంగుల ప్రతిభకు పట్టం కట్టాలనే దృఢసంకల్పంతో మిట్టీ కేఫ్‌ని ప్రారంభించింది అలీనా. 2017లో ప్రారంభమైన మిట్టీ కేఫ్ దేశవ్యాప్తంగా పదుల సంఖ్యలో ఔట్‌లెట్లు, వందలాది ఉద్యోగులతో విజయవంతంగా కొనసాగుతున్నది. దివ్యాంగుల కోసం పనిచేసే బెంగళూరులోని 'సమర్థన' ట్రస్ట్‌లో అలీనా ఇంటర్న్‌షిప్ ప్రోగామ్ చేసింది. అదే సమయంలో ఆమెకు 'మిట్టీ కేఫ్' ఆలోచన వచ్చింది. సోషల్ ఆంత్రప్రెన్యూర్‌గా ప్రయాణం ప్రారంభించాలని భావించింది. విషయం తెలిసి ఇంట్లోవాళ్లు 'పెండ్లి చేసుకో లేదా ఉద్యోగం చెయ్' అన్నారు. అలీనా మాత్రం వెనక్కి తగ్గలేదు. దాతల సహకారంతో హుబ్లీలో ఓ చిన్నషెడ్‌లో తొలి కేఫ్ మొదలుపెట్టింది. ఈ రెస్టారెంట్‌లో పనిచేసేవారంతా దివ్యాంగులే! దానికి ఊహించని స్పందన వచ్చింది. కాలక్రమంలో 'మిట్టీ కేఫ్'లు పదుల సంఖ్యలో పుట్టుకొచ్చాయి. విమానాశ్రయాలు, కార్పొరేట్ కార్యాలయాలు, బ్యాంకు ప్రాంగణాల్లో వెలసిన కేఫ్‌లలో దివ్యాంగులు దివ్యంగా వండి పెడుతున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 46 'మిట్టీ కేఫ్'లు నడుస్తున్నాయి. గత సంవత్సరం సుప్రీంకోర్టు ప్రాంగణం, రాష్ట్రపతి భవన్, ఐఐఎం–బెంగళూరులో 'మిట్టీ కేఫ్'లను ప్రారంభించారు. రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా మరిన్ని కేఫ్‌లు ప్రారంభిస్తామని చెబుతున్నది అలీనా. ఆమె ఆలోచనను ప్రసిద్ధ పత్రిక ఫోర్బ్స్ కొనియాడింది. అండర్ 30 ఏషియన్ విమెన్ ఆంత్రప్రెన్యూర్ల జాబితాలో ఆమెకు చోటు కల్పించింది.



ఇటాలియన్ సొగసు

సాంకేతికత పుణ్యమా అని సంస్కృతులు, సంప్రదాయాలతోపాటు ఆభరణాలూ ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్నాయి. కొన్ని దేశాల సంప్రదాయ ఆభరణాలు అతివలను మరింత ఆకట్టుకుంటున్నాయి. వాటిలో ఒకటే ఇటాలియన్ జువెలరీ. తక్కువ బంగారంతో ఎక్కువ మెరుపునిచ్చే ఇవి స్ప్రింగ్ జువెలరీగా ఆధునిక మగువల మనసు దోచేస్తున్నాయి.









నగ ధగలు





బంగారు ఆభరణాలను ఎంచుకునే సమయంలో ప్రతి ఒక్కరూ తప్పకుండా పరిశీలించేది వాటి బరువు. ఎంత బరువు నగలైతే అంత ఎక్కువ ధర. కాబట్టి, భారీ ఆభరణాలను ధరించాలని ఉన్నా వాటి ధరను బట్టి కొనేందుకు సాహసించరు. కానీ తక్కువ బంగారంతో పెద్దగా కనిపించే నగల్ని తీసుకోవాలంటే మాత్రం ఇటాలియన్ జువెలరీ సరైన ఎంపిక. ఈ ఆభరణాలు సన్నని తీగలాంటి డిజైన్లలో అందుబాటులో ఉంటాయి. నాజూకుగానే కాదు, అందంగా, ఆకర్షణీయంగానూ ఉండటంతో మహిళలను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయివి. ముఖ్యంగా ఆధునిక మహిళల ఫ్యాషన్ దుస్తులపైకి చక్కగా నప్పుతున్నాయి. ఆకులు, తీగలు, పువ్వుల డిజైన్లతో కూడిన చెవికమ్మలు, గాజులు, కంఠాభరణాలు, ఉంగరాలు, బ్రేస్‌లెట్లు వీటిలో అందుబాటులో ఉన్నాయి. ఇక, ఇటాలియన్ నగలకి భారతీయ నగిషీలు అద్దినవే ఇండో ఇటాలియన్ ఆభరణాలు. ఇటాలియన్ డిజైన్లకి నల్లపూసలు, మీనాకారీ, ఎనామిల్ మెరుపుల్ని జతచేసి వీటిని తయారు చేస్తారు. ఇవి సంప్రదాయ దుస్తులపైకి కూడా చక్కగా నప్పుతాయి. అందరికీ అందుబాటులో ఉండేలా వెండితోనూ ఈ తరహా నగల్ని తయారు చేస్తున్నారు. రంగురంగుల రాళ్లు, వజ్రాలు పొదిగిన ఇటాలియన్ సిల్వర్ జువెలరీ కూడా భలే ఆకట్టుకుంటున్నది. మీరూ ట్రై చేస్తారా మరి!

నమస్తే తెలంగాణ

ముల్కనూరు సాహితీ పీఠం

కథల పోటీ 2023-24 విజేతలు



ప్రథమ బహుమతి	ద్వితీయ బహుమతులు (2)	
రూ॥ 50,000	రూ॥ 25,000	
గెలుపొందిన కథ	గెలుపొందిన కథలు	
అమ్మ చిరునామా	ఇసుక తైలం	ఒక మిలంతి కల
డా. ఎం. కోటేశ్వర రావు	సమ్మెట ఉమాదేవి	మల్లిపురం జగదీశ్

తృతీయ బహుమతులు (3) రూ॥ 10,000

1	దేగ	బొడ్డేడ బలరామ స్వామి
2	రిశ్తే	సయ్యద్ గఫార్
3	చేజారి పోనీకు	గుమ్మడి రవీంద్రనాథ్

రూ॥లు 5,000 బహుమతులు (10)

1	పోటెత్తిన అల	సూర్య గండ్రకోట
2	కిస్మత్	స్ఫూర్తి కందివనం
3	కుల కస్పి	డా. కాలువ మల్లయ్య
4	ఆశ బరువు తూయగలమా?	కె.వి. సుమలత
5	అమ్మ పుట్టిల్లు	నెల్లుట్ల రమాదేవి
6	రూపాంతరం	చింతకింది శివశంకర్
7	వెన్ యూ రియలైజ్ దట్	అరుణ్ కుమార్ ఆలూరి
8	అనుకోకుండా అలా	మాచిరాజు కామేశ్వర రావు
9	జెట్ట రోగం	క్రాంతి శివరాత్రి
10	అక్రోధేన జయేత్ క్రోధం	ఉమా మహేశ్ ఆచాళ్ల

రూ॥లు 3,000 బహుమతులు (20)

1	సహజం	ఆకెళ్ల సూర్యనారాయణ మూర్తి
2	షీరో	డా. చెల్లపిల్ల సూర్య లక్ష్మి
3	ఒకరికొకరు	పట్ల యాదగిరి (గిరిపట్ల)
4	దైవం మనుష్య రూపేణా!	సూరిశెట్టి వసంత కుమార్
5	తడబడిన జ్ఞాపకం	సలీం
6	చిరంజీవి	సౌందర్య తేజ కోరా
7	మొ'గే'డు	పి. చంద్రశేఖర ఆజాద్
8	నాన్న టికెట్	మంజీత కుమార్
9	అంతర్నేత్రం	ఎస్వీ కృష్ణ
10	తప్పిపోయిన కూతురు	జి. లక్ష్మి
11	ఒక దీపం వెలిగింది	గాజోజు నాగభూషణం
12	ఆకలి	సుజల గంటి
13	దేవర	ఎస్. నాగేందర్‌నాథ్ రావు
14	రీసైక్లింగ్	డా. ఎ. సంతోష్ రెడ్డి
15	కొండెక్కని దీపం	ఎస్. మౌనిక
16	మనసా ఎటులోర్తునే..	పి.ఎస్. నారాయణ
17	చేజారిన జ్ఞాపకం	శ్రీ మానస (జన్ను లక్ష్మి)
18	సావాసం	నెల్లుట్ల రుక్మిణి
19	సోగణ్	బి. కళాగోపాల్
20	ఆర్తి	అనిసెట్టి శ్రీధర్

రూ॥లు 2,000 బహుమతులు (24)

1	అమ్మ ఒడికి	ఇ. కోటేశ్వర రావు
2	జాతర	పి.వి. అన్నాజీ రావు
3	మనసున మనసై	లక్ష్మి గాయత్రి
4	కరిగిన మేఘం	కడెం లక్ష్మి ప్రశాంతి
5	నా బలగం	డా. శ్రీదేవి శ్రీకాంత్
6	వాడు వెళ్లిపోయాడు	కాంచనపల్లి గోవర్ధన్ రాజు
7	అంతర్యామి	కె.వి.వి. సత్యనారాయణ
8	తా(ఆ)ళి బంధం	ఉరిమల్ల సునంద
9	తెలుగు మాస్టారు	లక్ష్మి మదన్
10	ఈశ్వర్ అల్లా తేరో నామ్	డా. కనుపూరు శ్రీనివాసులు రెడ్డి
11	మార్పు	గీత కురుగంటి (హంసగీతి)
12	పస్తిని	కె.వి. మేఘనాథ్ రెడ్డి
13	ఖట్నా	పిన్నంశెట్టి కిషన్
14	సిగ్గు! సిగ్గు! సిగ్గు!!	సింహ ప్రసాద్
15	రక్తసంబంధం	ఎం. సూర్యప్రసాదరావు
16	పర్ణశాల	పంతంగి శ్రీనివాస రావు
17	మంచి మనసుకు మంచి రోజులు	సి.ఎన్. చంద్రశేఖర్
18	మనస్విని	విజయార్కె
19	వేద శృతి	శ్రీవల్లి భాస్కర్
20	పీరియడ్ టైం	నల్లపాటి సురేంద్ర (స్వీట్ సురేంద్ర)
21	సమ్మెట దెబ్బల చప్పుడు	రవి తేజ సిరిపురం
22	మైదాకు	ఝాన్సీ లక్ష్మి జాష్టి
23	కన్నీటి కత్తులు	కొండపల్లి నీహారిణి
24	యావజ్జీవం హో ష్యామి	గంటి రమాదేవి (జి. ఎస్. శర్మ)

విశిష్ట కథకుల గుర్తింపు (8)

1	ఈ దేవుళ్ల దారుల్లో	వేణు మరీదు
2	గబ్బిలం.. ది అన్‌టచబుల్	డా. ఎం. సుగుణ రావు
3	అలౌకికం	తులసి బాలకృష్ణ
4	సమాధానం లేని ప్రశ్న	నామని సుజనా దేవి
5	సంతకం	జొన్నవిత్తుల శ్రీరామ చంద్రమూర్తి
6	మేరా బాప్ ఖయ్యూం	హుమాయూన్ సంఘీర్
7	లచ్చిమి	కె. ఆనందా చారి
8	కిష్కింధ కాండ	చందు తులసి (చంద్రశేఖర్)

కేసీఆర్ ఎత్తిపోతలు.. కాంగ్రెస్ ఉత్త కోతలు



రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు అనగానే కేసీఆర్ గుర్తుకు వస్తారు. ఎందుకంటే ఏండ్ల తరబడి సాగిన వీటి నిర్మాణంపై దృష్టి సారించిన ఆయన 10 ఏండ్లలో ఎన్నో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు నీరందించారు. కచ్చితమైన ప్రణాళిక, వనరుల సమీకరణ, అధికారుల నియామకం, సత్వర నిర్ణయాల ఫలితంగానే పదేళ్ల కాలంలో అనేక అద్భుతాలను చేసి చూపారు. భక్తరామదాసు, తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాలనైతే కేవలం 10 నెలల కాలంలోనే సాకారం చేశారు. స్వరాష్ట్రంలో చేపట్టిన కీలక ప్రాజెక్టులన్నీ దాదాపు పూర్తిచేయడం కేసీఆర్ లక్ష్య సాధనకు నిదర్శనం. వాటిలో మచ్చుకు కొన్నింటి వివరాలు సంక్షిప్తంగా..

- ఎత్తిపోతల పేరు: కోయిల్‌సాగర్ ‖ జిల్లా: ఉమ్మడి మహబూబ్‌నగర్



వినియోగంలోకి తెచ్చింది: బీఆర్‌ఎస్ ప్రభుత్వం

ప్రారంభం:2000.. పూర్తయింది: 2017
పనులు సాగింది: 17 ఏండ్లు
సాగులోకి తెచ్చిన ఆయకట్టు: 8 వేల ఎకరాలు

- ఎత్తిపోతల పేరు: నెట్టెంపాడు ‖ జిల్లా: ఉమ్మడి మహబూబ్‌నగర్



వినియోగంలోకి తెచ్చింది: బీఆర్‌ఎస్ ప్రభుత్వం

ప్రారంభం:1991.. పూర్తయింది: 2016
పనులు సాగింది: 25 ఏండ్లు
సాగులోకి తెచ్చిన ఆయకట్టు: 1,42,000 ఎకరాలు

- ఎత్తిపోతల పేరు: మిడ్‌మానేరు ‖ జిల్లా: ఉమ్మడి కరీంనగర్



వినియోగంలోకి తెచ్చింది: బీఆర్‌ఎస్ ప్రభుత్వం

ప్రారంభం:2005.. పూర్తయింది: 2018
పనులు సాగింది: 13 ఏండ్లు
సాగులోకి తెచ్చిన ఆయకట్టు: 1,00,000 ఎకరాలు

- ఎత్తిపోతల పేరు: చనకాకొరాట ‖ జిల్లా: ఉమ్మడి ఆదిలాబాద్



వినియోగంలోకి తెచ్చింది: బీఆర్‌ఎస్ ప్రభుత్వం

ప్రారంభం:1975.. పూర్తయింది: 2023
పనులు సాగింది: 48 ఏండ్లు
సాగులోకి తెచ్చిన ఆయకట్టు: 40,000 ఎకరాలు

- ఎత్తిపోతల పేరు: రాజీవ్ భీమా ‖ జిల్లా:ఉమ్మడి మహబూబ్‌నగర్



వినియోగంలోకి తెచ్చింది: బీఆర్‌ఎస్ ప్రభుత్వం


ప్రారంభం:1983.. పూర్తయింది: 2016
పనులు సాగింది: 33 ఏండ్లు
సాగులోకి తెచ్చిన ఆయకట్టు: 1,58,000 ఎకరాలు



- ఎత్తిపోతల పేరు: పాలమూరు రంగారెడ్డి ‖ జిల్లా:ఉమ్మడి మహబూబ్‌నగర్

ప్రారంభం:2015.. పూర్తయింది: 2023
పనులు సాగింది: 8 ఏండ్లు
సాగులోకి తెచ్చిన ఆయకట్టు: డిస్ట్రిబ్యూటరీలు తవ్వాలి
వినియోగంలోకి తెచ్చింది: బీఆర్‌ఎస్ ప్రభుత్వం

- ఎత్తిపోతల పేరు: కల్వకుర్తి ‖ జిల్లా:ఉమ్మడి మహబూబ్‌నగర్



వినియోగంలోకి తెచ్చింది: బీఆర్‌ఎస్ ప్రభుత్వం

ప్రారంభం:1984.. పూర్తయింది: 2016
పనులు సాగింది: 32 ఏండ్లు
సాగులోకి తెచ్చిన ఆయకట్టు: 3,07,000 ఎకరాలు

గడువులోగా సాధ్యమయ్యేనా?

- మార్కెట్ ధర రూ.50 లక్షలైతే.. ఇస్తున్నది రూ.6 లక్షలే
- భూసేకరణపై రైతులను ఒప్పించాలంటూ కలెక్టర్లపై ఒత్తిడి
- ట్రిపుల్ ఆర్ భవితవ్యంపై సర్వత్రా అనుమానాలు

హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్‌ఆర్) నిర్మాణానికి అవసరమైన భూముల సేకరణ కోసం రైతులను ఎలాగైనా ఒప్పించాలని సీఎం రేవంత్‌రెడ్డి గత నెలలో కలెక్టర్లను ఆదేశిస్తే.. వచ్చే నెల రెండో వారం చివరినాటికి ఈ భూసేకరణ ప్రక్రియను పూర్తిచేయాలని తాజాగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గడువు విధించారు. కానీ, ఆ భూములకు మార్కెట్‌లో ఉన్న ధరలకు, ప్రభుత్వం ఇవ్వజూపుతున్న ధరలకు ఏ మాత్రం పొంతన లేకపోవడం పెద్ద అడ్డంకిగా మారింది. ట్రిపుల్‌ఆర్‌ను నిర్మించతలపెట్టిన ప్రాంతాల్లో ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో ఎకరం ధర రూ.50 లక్షల వరకు పలుకుతుంటే.. రైతులకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) రూ.6 లక్షలు మాత్రమే ఆఫర్ చేస్తున్నది. దీంతో భూములను ఇచ్చేందుకు రైతులు నిరాకరిస్తుండటంతో కలెక్టర్లు ముందడుగు వేయలేని పరిస్థితి నెలకొన్నది. మొత్తం 348 కి.మీ. పొడవున నిర్మించతలపెట్టిన ట్రిపుల్‌ఆర్ కోసం దాదాపు 10 వేల ఎకరాల భూములను సేకరించాల్సి ఉన్నది. ఇందులో 158.65 కి.మీ. పొడవైన ఉత్తర భాగం నిర్మాణానికి 4,600 ఎకరాలు, 189.02 కి.మీ పొడవైన దక్షిణ భాగం నిర్మాణానికి 5,400 ఎకరాలు అవసరమవుతాయి. ట్రిపుల్‌ఆర్ నిర్మాణానికి అయ్యే ఖర్చు పూర్తిగా కేంద్రమే భరించనుండగా.. భూసేకరణ ఖర్చులో మాత్రం సగభాగాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. భూసేకరణ బాధ్యతలను స్థానిక జిల్లా కలెక్టర్లకు అప్పగించినప్పటికీ రైతులకు ఇవ్వాల్సిన నష్టపరిహారాన్ని మాత్రం ఎన్‌హెచ్‌ఏఐ ద్వారానే చెల్లిస్తారు. కాగా, ట్రిపుల్‌ఆర్ ఉత్తర భాగంలో ఇప్పటికే దాదాపు 3,500 ఎకరాలు సేకరించారు. మిగిలిన 1,000 ఎకరాల్లో సుమారు 200 ఎకరాల అటవీ భూమి ఉన్నది. ఈ భూమికి బదులుగా అటవీశాఖకు మరోచోట భూమిని ఇచ్చేందుకు ప్రభుత్వం ఇప్పటికే సంసిద్ధత వ్యక్తం చేసినప్పటికీ మిగిలిన 800 ఎకరాల సేకరణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎన్‌హెచ్‌ఏఐ ఆఫర్ చేసిన ధరకు భూములు ఇచ్చేందుకు రైతులు ససేమిరా అంటున్నారు. బహిరంగ మార్కెట్ ధరకు అనుగుణంగా తమకు నష్టపరిహారం చెల్లించాలని లేదా తమకు ప్రభుత్వం మరో చోట భూములు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే ట్రిపుల్‌ఆర్ నిర్మాణానికి తమ భూములు ఇచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తున్నారు. ఈ విషయమై ఇప్పటికే కొందరు రైతులు కోర్టును ఆశ్రయించడంతో భూసేకరణపై కోర్టు స్టే విధించింది. ఈ నేపథ్యంలో ట్రిపుల్‌ఆర్ భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్లపై ప్రభుత్వం ఎంత ఒత్తిడి తెచ్చినా ఫలితం ఉండకపోవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



త్వరలో నష్టపరిహారం చెల్లింపు: ఎన్‌హెచ్‌ఏఐ

ట్రిపుల్‌ఆర్ నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు త్వరలో నష్టపరిహారం చెల్లిస్తామని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు తెలిపారు. ఇప్పటివరకు సేకరించిన భూములకు స్థానిక ఆర్డీవో, కలెక్టర్ నిర్ధారించిన ధరను చెల్లిస్తామని అంటున్నారు. ధర ఎంతన్నది తమకు సంబంధం లేదని, నిబంధనల ప్రకారం అధికారులు నిర్ధారించిన ధర చెల్లిస్తామని చెప్తున్నారు. వచ్చే నెల రెండో వారంలోగా భూసేకరణ పూర్తిచేస్తే టెండర్లకు మార్గం సుగమం అవుతుందని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. భూముల ధర, పరిహారం పెంపుపై ఇప్పటివరకు స్పష్టమైన ప్రకటన చేయకపోవడంతో ట్రిపుల్‌ఆర్ భవితవ్యంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



అంగన్‌వాడీ కేంద్రాలకు కుళ్లిన గుడ్లు

- పిల్లలు, తల్లులు, గర్భిణులకు అవే పంపిణీ
- కరీంనగర్ జిల్లా అంగన్‌వాడీ కేంద్రంలో బట్టబయలు
- రాష్ట్రంలో చాలా చోట్ల ఇదే పరిస్థితి

హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. వాటిలో చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలకు కుళ్లిన కోడిగుడ్లు సరఫరా చేస్తున్నారు. ఇటీవల కరీంనగర్ జిల్లాలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్లపై అనుమానం వచ్చి పగలగొట్టి చూడటంతో ఓ గుడ్డు నుంచి కోడి పిల్ల బయటకు వచ్చింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన కోడిగుడ్లను సరఫరా చేయాల్సిన అధికారులు.. కాసులకు కక్కుర్తిపడి కుళ్లిన గుడ్లను సరఫరా చేస్తున్నట్టు తెలిసింది. ప్రస్తుతం శ్రావణ మాసం కొనసాగుతుండటంతో చికెన్‌తోపాటు గుడ్లకు డిమాండ్ తగ్గిపోయింది. దీంతో చాలా గుడ్లు పౌల్ట్రీల్లోనే మురిగిపోతున్నాయి. ఇలాంటి కోడిగుడ్లను అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసి, సొమ్ము చేసుకోవాలని చూస్తున్న కొందరు అధికారులు కన్సల్టెంట్లతో ఒప్పందాలు చేసుకుంటున్నారు. కుళ్లిన కోడిగుడ్లను తక్కువ ధరకు కొనుగోలు చేసి, వాటిని అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్నారు. మరికొన్ని జిల్లాల్లో కన్సల్టెంట్లు అసలు గుడ్లనే సరఫరా చేయడం లేదని, వాటిని మధ్యలోనే దళారులు మింగేస్తున్నారని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. కోడిగుడ్లను సరఫరా చేయకముందే ఐసీడీసీ అధికారులకు బిల్లులు పెడుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 35,700 అంగన్ వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయి. వాటిలో 4,57,643 మంది గర్భిణులు, 10,44,562 మంది బాలింతలు, 6,67,783 మంది చిన్నారులు ఉన్నట్టు అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి.

సీవోఈ సిబ్బందిపై సర్కారు కాఠిన్యం

- జీతాలు అడిగినందుకు ఏకంగా తొలగింపు!
- 2 నెలలుగా వేతనాలివ్వడం లేదని పెన్‌డౌన్
- రెగ్యులర్ సిబ్బంది కోసం సెక్రటరీ ప్రకటన
- ర్యాంకులు తెచ్చిన గురుకుల సిబ్బందిపై కుట్ర



గౌలిదొడ్డిలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రంలో సిబ్బంది నిరసన

హైదరాబాద్, ఆగస్టు15 (నమస్తే తెలంగాణ): ప్రతిష్ఠాత్మకమైన ఐఐటీ, నీట్ లాంటి జాతీయస్థాయి ఎంట్రెన్స్‌లలో వందలాది మంది గురుకుల విద్యార్థులకు ర్యాంకులు తెప్పించారు. జీవితంలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు వారిని ఉత్తములుగా తీర్చిదిద్దారు. మొత్తంగా గురుకులాలకే వన్నెతెచ్చారు. ఇంత చేసిన తమకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని మాత్రమే వారు అడిగారు. నెలలు గడుస్తుంటే పెన్‌డౌన్ చేసి నిరసన తెలిపారు.. అదే ఇప్పుడు వారి పాలిట శాపమైంది. ఫలితంగా రాష్ట్ర సర్కారు కాటుతో వారిపై వేటుపడింది. టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ సొసైటీ పరిధిలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ)లలో పనిచేసే హానరోరియం సిబ్బందిని ప్రభుత్వం తొలగించింది. రెండు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారడంతో ప్రభుత్వ దృష్టికి వెళ్లేలా చేయడంతో ప్రభుత్వం మాత్రం వారిపై కాఠిన్యం ప్రదర్శించింది. రాష్ట్రంలో 38 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలు ఉన్నాయి. ఆ సీవోఈల్లో బాలికలకు 2,000, బాలురకు 1,680 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

38 సీవోఈల్లో 231 మంది సిబ్బంది

అన్ని సీవోఈల్లో కలిసి అందులో కెమెస్ట్రీ, మ్యాథ్స్, ఫిజిక్స్, బోటనీ, జువాలజీ విషయ నిపుణులు, సీనియర్ అధ్యాపకులు కలిపి మొత్తంగా 231 మంది సిబ్బంది ఉన్నారు. పనివిధానాన్ని బట్టి సిబ్బందికి హానరోరియం పేరిట వేతనాలను చెల్లిస్తున్నారు. ఆగస్టు15 దాటినా జూన్, జూలై నెలలకు సంబంధించిన వేతనాలను ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే పలుమార్లు సొసైటీ ఉన్నతాధికారులకు నివేదించారు. అయినా స్పందన కరువైంది. దీంతో ఇటీవలే పెన్‌డౌన్ ప్రకటించి నిరసన తెలిపారు.

వేతనాలు అడిగిన సీవోఈ కేంద్రాల సిబ్బందిపై ప్రభుత్వం ఇప్పుడు కక్షసాధింపు చర్యలకు దిగింది. తాజాగా గౌలిదొడ్డి, కరీంనగర్, చిల్కూర్, మహేంద్రహిల్స్, నార్సింగి, షేక్‌పేట్ తదితర సీవోఈల్లో మొత్తంగా 57 మందిని తొలగించి రెగ్యులర్ సిబ్బంది నియామకానికి సొసైటీ సెక్రటరీ అలుగు వర్షిణి ఉత్తర్వులు జారీ చేశారు. సీవోఈల్లో పనిచేయాలనే ఆసక్తి ఉన్న నాన్ సీవోఈల్లో పనిచేస్తున్న రెగ్యులర్ జేఎల్, పీజీటీలు దరఖాస్తు చేసుకోవాలని, వారికి డిప్యూటేషన్ కల్పిస్తామని సెక్రటరీ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

విద్యార్థులకు తీరని నష్టం

సీవోఈ కేంద్రాల సిబ్బంది తొలగింపు నిర్ణయం అక్కడి విద్యార్థులకు తీరని నష్టం కలుగనున్నది. లక్షలాది రూపాయల విలువ చేసే కోచింగ్‌ను ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో నిరుపేద విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నది. కార్పొరేట్ స్థాయిలో ఇంటర్ విద్యను అందిస్తున్నారు. జాతీయ పోటీ పరీక్షల్లో ఏటేటా వందలాది ర్యాంకులు వచ్చేలా ఈకేంద్రాలు దోహదపడుతున్నాయి. ఇప్పుడు ఏకంగా ఆ విధానానికి స్వస్తిపలికి రెగ్యులర్ సిబ్బందితో చెప్పించడమంటే సీవోఈలనే నిర్వీర్యం చేసినట్టేనని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి.

- బీర్ టిన్‌లో ఇరుకున్న పాము



గురువారం జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నల్లగొండ శివారులోని రైతు వేదిక మైదానంలో మందుబాబులు తాగి పడేసిన బీర్ టిన్‌లో పాము దూరడానికి యత్నించింది. అందులో తల ఇరుక్కుపోయి బయటికి రాలేక తల్లడిల్లింది. మూడు గంటలపాటు అటూ ఇటూ తిరిగింది. స్థానికులు దానిని తీసే ప్రయత్నం చేసినా సాధ్యం కాలేదు. చివరకు పాము ముళ్లకంపలో నుంచి వెళ్తుండగా టిన్ ఊడిపోవడంతో బతుకుజీవుడా అంటూ వెళ్లిపోయింది.

ప్రతి నెల పరీక్షలకు ముగింపు..

- ఈ ఏడాదిలోనూ ఎఫ్‌ఎల్‌ఎన్, లిప్ అమలు
- పర్యవేక్షణకు తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ యాప్



హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): సర్కారు పాఠశాల విద్యార్థుల్లో విద్యా ప్రమాణాల పెంపు, కనీస సామర్థ్యాల సాధనకు గతంలో నిర్వహించిన ఎఫ్‌ఎల్‌ఎన్, లిప్ కార్యక్రమాలను ఈ విద్యాసంవత్సరం సైతం కొనసాగించాలని విద్యాశాఖ నిర్ణయించింది. వీటి అమలులో కొన్ని మార్పులు చేస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి కీలక ఆదేశాలు జారీచేశారు. విద్యాప్రమాణాల పెంపుకు గత కేసీఆర్ సర్కారు హయాంలో 1–5 తరగతులకు ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ(ఎఫ్ఎల్‌ఎన్), 6 –9 తరగతులకు లర్నింగ్ ఇప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం(లిప్)ను విద్యాశాఖ తలపెట్టింది. ఎఫ్‌ఎల్‌ఎన్‌ను తొలిమెట్టు, లిప్‌నకు ఉన్నతి అని నామకరణం చేశారు. అయితే ఈ ప్రోగ్రాంల్లో భాగంగా విద్యార్థులకు ప్రతి నెల పరీక్షలు నిర్వహించేవారు. కానిప్పుడు ప్రతినెల పరీక్షలకు పాఠశాల విద్యాశాఖ ముగింపు పలికింది. వీటిస్థానంలో ఆగస్టులో బేస్‌లైన్ టెస్ట్, డిసెంబర్‌లో మిడ్‌లైన్ పరీక్ష, మార్చిలో ఎండ్‌లైన్ పరీక్షలను నిర్వహించాలని సూచించారు. సబ్జెక్టులవారీగా విద్యార్థుల పురోగతిని అంచనావేసి, నమోదుచేస్తారు. ఫలితాలను 'తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ యాప్'లో నమోదుచేస్తారు. మండల ఎఫ్‌ఎల్‌ఎన్ నోడల్ అధికారులు, హెచ్‌ఎంలు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరుపుతారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బడుల్లో తనిఖీలు నిర్వహిస్తారు. తరగతి గది బోధనను పరిశీలించి, ఫీడ్‌బ్యాక్ ఇస్తారు.

బిల్లులు ఇస్తేనే.. మందులిస్తాం

- ప్రభుత్వ దవాఖానలకు సరఫరా నిలిపివేసిన డీలర్లు
- 600 కోట్ల బిల్లులు బకాయిపడిన రాష్ట్ర ప్రభుత్వం
- సీజనల్ వ్యాధుల వేళ వేధిస్తున్న ఔషధాల కొరత



హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సర్కారు వైద్యాన్ని పాలకులు గాలికొదిలేశారు. ప్రభుత్వ దవాఖానల్లో మందుల సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫలితంగా సరైన మందులు దొరక్క, ప్రైవేటుగా కొనలేక రోగులు సతమతం అవుతున్నారు. ఔషధాల పంపిణీదారులకు ప్రభుత్వం పెండింగ్ బిల్లులు మంజూరు చేయకపోవడంతో వారు సరఫరాను నిలిపివేశారు. దీంతో దవాఖానలకు వచ్చేవారికి డాక్టర్ రాసిచ్చిన మందుల్లో సగం బయట కొనుక్కోవాల్సిన దుస్థితి నెలకొన్నది. గాంధీ, ఉస్మానియా వంటి ప్రధాన దవాఖానల్లోనూ ఇదే పరిస్థితి. ప్రాణాధార మందులకు సైతం ఇబ్బందిగా ఉన్నదని వైద్యవర్గాలు చెప్తున్నాయి. కొన్నిరకాల అత్యవసర ఔషధాలను ఆయా దవాఖానలు సొంతంగా కొనుగోలు చేయాల్సి వస్తున్నదని వాపోతున్నాయి. ప్రభుత్వం తమకు రూ.600 కోట్ల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉన్నదని ఔషధ పంపిణీ ఏజెన్సీలు, డీలర్లు చెప్తున్నారు. వీటిని విడుదల చేయాలని కొన్ని నెలలుగా కోరుతున్నా ఫలితం లేదని వాపోతున్నారు. దీంతో మందుల సరఫరాను నిలిపివేసినట్టు చెప్తున్నారు.

కేంద్రం సొమ్మును తొక్కిపెట్టిన రాష్ట్రం

ఈఎస్‌ఐ దవాఖానలు, డిస్పెన్సరీలకు మందులు సరఫరా చేసిన డీలర్లకు కేంద్ర ప్రభుత్వం రూ.180 కోట్లు విడుదల చేసిందని ఔషధ పంపిణీ ఏజెన్సీ ప్రతినిధులు, డీలర్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందులో రూ.35 కోట్లు మాత్రమే విడుదల చేసిందని, మిగతా రూ.145 కోట్లను ఎందుకు విడుదల చేయడం లేదో తెలియడం లేదని పేర్కొన్నారు. కనీసం ఆ నిధులైనా విడుదల చేయాలని వారు కోరుతున్నారు. వాస్తవానికి మందుల సరఫరా కొన్ని నెలల కిందటే ఆగిపోయిందని, బఫర్ స్టాక్‌తో ఇన్ని రోజులుగా నెట్టుకొచ్చామని వైద్యవర్గాలు తెలిపాయి. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న ఈ సమయంలో మందుల నిల్వలు పెంచాల్సిందిపోయి, తగ్గించడం ఏమిటని ప్రభుత్వంపై రోగులు